RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake Printing of Daily News Papers

హైదరాబాద్ 11 ఏప్రిల్ 2026 శనివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:263

# మహిళా బిల్లుకు రండి...ఏకగ్రీవం చేద్దాం

## ప్రధాని నరేంద్రమోడి పిలుపు



న్యూఢిల్లీ ఏప్రిల్ 10 పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల చట్టసవరణ బిల్లుకు కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యింది. విపక్షాలు బిల్లుకు సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులు హాజరై ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించాలని ప్రధాని మోదీ కోరారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు అన్ని పార్టీల పార్లమెంటు సభ్యులు హాజరై ఏకగ్రీవంగా బిల్లును ఆమోదించాలని ప్రధాని మోదీ కోరారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించేందుకు అన్ని పార్టీలు మద్దతివ్వాలని ప్రధాని మోదీ కోరారు. ఏప్రిల్ 16,17,18 తేదీల్లో జరిగే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు అన్ని పార్టీల ఎంపీలు హాజరు కావాలని మోదీ విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లు ఆమోదానికి ఏకాభిప్రాయ సాధన కోసం ? కృషిచేయాలంటూ అన్ని రాజకీయ పక్షాలకు ప్రధాని పిలుపునిచ్చారు.

ఈ మార్పులు భారతదేశవ్యాప్తంగా ఉన్న మహిళల ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయని, వీటిని కేవలం శాసనపరమైన ప్రక్రియ అని పిలవడం తక్కువ చేసి చెప్పడమే అవుతుందని అన్నారు. అంతేకాకుండా, ఇది భారతదేశ నాగరికతా స్ఫూర్తికి ఎప్పటినుంచో మార్గదర్శకంగా ఉన్న ఒక సూత్రానికి ధృవీకరణ అని ఆయన అన్నారు. భారతదేశ జనాభాలో సగం మంది మహిళలేనని, దేశ అభివృద్ధిలో వారు కీలక పాత్ర పోషించారని పేర్కొంటూ, వారి సాధికారత కోసం నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. మెరుగైన విద్య, ఆరోగ్య సంరక్షణ సౌకర్యాలు, ఆర్థిక సహాయం అందించడం వల్ల ఆర్థిక, సామాజిక జీవితంలో మహిళల భాగస్వామ్యానికి పునాదులు మరింత బలపడ్డాయని ఆయన అన్నారు. సమాజంలో మహిళల పాత్రకు అనుగుణంగా రాజకీయాలు, శాసనసభలలో వారి భాగస్వామ్యం లేకపోవడం దురదృష్టకరమని ప్రధానమంత్రిభావితరాల కోసం మహిళా రిజర్వేషన్ బిల్లు అన్నారు మోదీ. వికసిత్ భారత్ లక్ష్యం సాధించాలంటే మాతృశక్తిని, నారీశక్తిని పూర్తిస్థాయిలో పటిష్ఠం చేయాలని మోదీ వీడియో సందేశం జారీ చేశారు. ప్రజాస్వామ్యం కాలక్రమేణా మరింత సమ్మిళితం అవుతుందని ఇలాంటి సందర్భాలు చాటిచెబుతాయన్నారు. ఇది సాధారణ శాసన ప్రక్రియ కాదన్నారు. దేశంలో కోట్లమంది మహిళల ఆకాంక్షలకు ప్రతిరూపమని అన్నారు. “కమిటీలు ఏర్పాటు చేశారు, బిల్లు ముసాయిదాలు ప్రవేశపెట్టారు కానీ అవి ఎన్నడూ కార్యరూపం దాల్చలేదు,” అని ప్రధాని మోదీ అన్నారు. “కానీ శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరగాలనే విస్తృత ఏకాభిప్రాయం అలాగే నిలిచి ఉంది. సెప్టెంబర్ 2023లో, పార్లమెంట్ అదే ఏకాభిప్రాయ స్ఫూర్తితో నారీ శక్తి వందన అధినియమ్‌ను ఆమోదించింది. నేను దానిని నా జీవితంలోని అత్యంత ప్రత్యేకమైన సందర్భాలలో ఒకటిగా భావిస్తాను.” అని ప్రధానమంత్రి తన వీడియో సందేశంలో పేర్కొన్నారు. ఇదిలావుంటే, 2023లో కూడా పార్లమెంట్ ఉభయసభలు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాయి. లోక్‌సభ స్థానాల సంఖ్యను 543 నుంచి 816కి పెంచి, వాటిలో 273 స్థానాలను మహిళలకు కేటాయించడానికి వీలుగా మహిళా రిజర్వేషన్ చట్టంలో మార్పులు చేస్తున్నారు. 2011 జనాభా ఆధారంగా మహిళకు రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లును తెస్తోంది. బిల్లులో కొన్ని మార్పులు చేయాలని విపక్షాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ఓబీసీ , ముస్లిం, ఎస్సీ,ఎస్టీ వర్గాల మహిళలకు కోటా కల్పించాలని కోరుతున్నాయి.మహిళా రిజర్వేషన్ బిల్లు కోసంపై కాంగ్రెస్ పార్టీ కూడా కీలక చర్చలు జరుపుతోంది. మరో వైపు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు డీలిమిటేషన్‌పై చర్చిస్తారు.

# 12న ఇంటర్ ఫలితాలు

హైద్రాబాద్ ఏప్రిల్ 10;తెలంగాణలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ ఫలితాలు ఈ నెల 12న రిలీజ్ కానున్నాయి. ఈ విషయాన్ని ఇంటర్మీడియట్ బోర్డు వెల్లడించింది. ఫిబ్రవరి 26 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు జరిగాయి. 9.97 లక్షల మంది విద్యార్థులు ఈసారి ఎగ్జామ్స్ రాశారు.

# తెలంగాణకు రూ.103 కోట్ల విలువైన రెండు కొత్త ప్రాజెక్టులు మంజూరు

న్యూ ఢిల్లి ఏప్రిల్ 10; గత 11 ఏళ్లుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. ముఖ్యంగా రోడ్డు రవాణా, రైల్వే ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు ప్రాధాన్యత ఇస్తూ.. కేటాయింపులు చేస్తోంది. తాజాగా ‘సేతు బంధన్’ పథకం కింద రూ. 103 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ ఆమోదం తెలిపింది.‘సేతుబంధన్’ పథకంలో భాగంగా సెంట్రల్ రోడ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) కింద రూ.103 కోట్ల పనులకు కేంద్ర రోడ్డు, రవాణా శాఖ ఆమోదం తెలిపింది. నల్గొండ జిల్లా పరిధిలో నార్కట్ పల్లి-మునుగోడు రైల్వే లైన్ లోని రైల్వే ఓవర్ బ్రిడ్జికి రూ.69 కోట్లు, ఖమ్మం జిల్లా మధిరలోని రైల్వే లైన్ దగ్గర అండర్ పాస్, ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు అప్రోచ్ రోడ్ల అభివృద్ధికి కేంద్రం రూ.34 కోట్లు ఖర్చు చేయనుంది.ఈ ప్రాజెక్టులు పూర్త యితేస్థానికప్రజలఇబ్బందులు తొలగి పోతాయి. రవాణామెరుగుపడటంతో పాటు. .రైల్వేప్రమాదాలుతగ్గుముఖం పట్టనున్నాయి.

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం.

## మంత్రి ధనసరి అనసూయ సీతక్క




# రాష్ట్రపతిని కలిసిన రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా



హైదరాబాద్, ఏప్రిల్ 10, తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము తో భేటీ అయ్యారు.తెలంగాణ గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలిసారి రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

# రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు






# ‘అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని..’

## కేసీఆర్ ని కలిసిన సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి భావోద్వేగం.





ఎర్రవెల్లి నివాసానికి చేరుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్య నేతలు ఘనస్వాగతం పలికారు. బీఆర్ఎస్ అధినేత కే. చంద్రశేఖర్ రావు తో ఎర్రవెల్లి నివాసంలో, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి శుక్రవారం నాడు మర్యాదపూర్వక భేటీ అయ్యారు. నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సాదరంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే డా. కె. సంజయ్, మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావు, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. జీవన్ రెడ్డి తో పాటు వచ్చిన వారిలో వారి కుమారులు, జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ వసంత సురేశ్ దంపతులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం శుభవార్త

**ఈ క్యాలెండర్ సంవత్సరం (2026) నుండి 2.1% డీఏ పెంపు**

**ఇంతకు ముందు 50.7% డిఎ ఉండగా, ఇపుడు దాన్ని 52.8% కి పెంపు**

**పెరిగిన డిఎ జనవరి 1, 2026 నుండి అమలు**

హైదరాబాద్ తెలంగాణ ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ యేడాది 2.1 శాతం డిఏ పెంచుతున్నట్లుప్రకటించింది.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ డీఏ లో పెంపు సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులకు శుభాకాంక్షలు. ఆర్టీసీ లో పెండింగ్ పనులు అభివృద్ధి కార్యక్రమాలపై పలు రీజియన్ లో ఆర్ ఎం లతో సమావేశాన్ని నిర్వహించి పెండింగ్ పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించడం జరిగిందని అన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించి ఉన్న ఏకైక పెండింగ్ డీఏ ను ప్రభుత్వం విడుదల చేసింది. జనవరి 2026 నుండి 2.1 శాతం పెరిగిన డీఏ అమలులోకి వచ్చింది... దీంతో సవరించిన డీఏ వల్ల 52.8 శాతానికి చేరింది. జనవరి నుండి ఇవ్వాల్సిన పెండింగ్ డీఏ లు భవిష్యత్ లో వచ్చే మూడు నెలలకు గాను ఒక్కో నెలలో విడుదల చేయడం జరుగుతుంది.

తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం లో మొదటి నుండి ఆర్టిసి సంస్థ పరిరక్షణ ,ఉద్యోగుల సంక్షేమం, ప్రయాణికుల సౌల్యభం కేంద్రంగా పని చేస్తుంది. సంస్థకు ప్రధానంగా కార్మికుల సంక్షేమం పై వారికి సంబంధించిన ఆరోగ్య సంరక్షణ కు ఆసుపత్రి అప్గ్రెడేషన్ ,కారుణ్య నియామకాలు,దీర్ఘ కాలంగా రిమూవ్ అయిన వారిని త్రిమెన్ కమిటీ ద్వారా తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడం ,కొత్త నియామకాలు చేపట్టి పని భారం తగ్గించడం ,కొత్త బస్సులు కొనుగోలు లాంటి అనేక కార్యక్రమాలు చేస్తుందని అన్నారు. పెండింగ్ లో ఉన్న డీఏ 2.1 శాతం పెంచడం వల్ల గతంలో ఉన్న 50.7 శాతం నుండి 52.8 శాతానికి పెరిగింది. తెలంగాణ లో ఉన్న ప్రతి ఆర్టీసీ ఉద్యోగులందరికీ ఇది ఉపయోగపడుతుంది. తెలంగాణ లో లైఫ్ లైన్ గా ఉన్న ఆర్టీసీ నీ మరింత ప్రజల్లోకి తీసుకెళ్లలా కృషి చేయాలి. ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు.

# ఢిల్లీ రాజకీయాల్లోకి నితీశ్ కుమార్..

## రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం



న్యూఢిల్లీ ఏప్రిల్ 10 బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానంలో కీలక మలుపు తీసుకున్నారు. ఈరోజు ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈ పరిణామంతో ఆయన ఇక జాతీయ రాజకీయాలకే పరిమితం కానున్నట్లు స్పష్టమైంది. త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నట్లు నితీశ్ స్వయంగా వెల్లడించారు. ఈ ప్రమాణస్వీకారంతో నితీశ్ కుమార్ తన ఖాతాలో ఓ అరుదైన ఘనతను చేర్చుకున్నారు. రాష్ట్ర శాసనసభ, శాసనమండలి, లోక్‌సభ, రాజ్యసభ.. ఇలా నాలుగు చట్టసభల్లోనూ సభ్యుడిగా పనిచేసిన కొద్దిమంది నేతల జాబితాలో ఆయన చేరారు.రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణస్వీకార కార్యక్రమం కోసం ఆయన గురువారమే ఢిల్లీకి చేరుకున్నారు. మార్చి 16న రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన నితీశ్, మార్చి 30న తన శాసనమండలి సభ్యత్వానికి (ఎమ్మెల్సీ) రాజీనామా చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయడంతో ఆయన ముఖ్యమంత్రి పదవి నుంచి కూడా తప్పుకోవాల్సి ఉంటుంది.ఈ సందర్భంగా ఢిల్లీలో నితీశ్ కుమార్ మాట్లాడుతూ.. “బిహార్‌లో చాలా పనులు చేశాను. ఇక ఇక్కడే (ఢిల్లీ) ఉండి సేవ చేయాలని భావిస్తున్నాను. మూడు నాలుగు రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తాను. కొత్త ముఖ్యమంత్రి, మంత్రులు బాధ్యతలు చేపడతారు” అని స్పష్టం చేశారు. 2005 నవంబర్‌లో ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నితీశ్ కుమార్ అసెంబ్లీకి పోటీ చేయకుండా, శాసనమండలి సభ్యుడిగానే కొనసాగుతున్నారు. 2006 నుంచి వరుసగా నాలుగుసార్లు ఆయన ఎమ్మెల్సీగా పనిచేశారు. 1985లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితీశ్, ఆ తర్వాత లోక్‌సభ ఎంపీగా కూడా సేవలందించారు. తాజా పరిణామంతో బిహార్ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు మొదలుకానున్నాయి.

ప్రజాబలం

11 ఏప్రిల్ 2026 శనివారం

## పొంచి ఉన్న కరువు పరిస్థితులు...

గత ఏడాది రికార్డు స్థాయిలో వర్షాలు కురిసాయి. పంటలు సమృద్ధిగా పండాయి. కానీ ఈ ఏడాది అలా పరిస్థితి ఉండదని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ప్రధానంగా పసిఫిక్ మహాసముద్రంలో వేగంగా మారుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా.. 2026 లో అత్యంత బలమైన ఎల్ నినో పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని అంతర్జాతీయ వాతావరణ సంస్థలు అంచనా వేస్తున్నాయి. ఈ ఏడాది వర్షాలు కురిసే అవకాశం కనిపించడం లేదని వాతావరణ శాఖ నిపుణులు హెచ్చరిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ వర్షాకాలం దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది రైతులకు అత్యంత కష్టతరంగా మారబోతోందన్న హెచ్చరికలు వస్తున్నాయి. అయితే ముందుగానే ఈ హెచ్చరికలు వచ్చాయి. కానీ ఎల్ నినో ప్రభావం ఈ స్థాయిలో ఉండబోతుంది అని తెలుస్తుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది.కొన్ని ప్రాథమిక విశ్లేషణల ప్రకారం ఈ ఏడాది ఇబ్బందికర పరిస్థితులు తప్పవని అర్థమవుతోంది. ఈ శతాబ్దంలోనే అత్యంత తీవ్రమైన ఉష్ణ మండల వాతావరణం నమోదయ్యే ప్రమాదం ఉంది. రుతుపవనాల గమనాన్ని అస్తవ్యస్తం చేసి.. వర్షాలు పడకుండా చేస్తోందని తెలుస్తోంది. వ్యవసాయ రంగం దారుణంగా దెబ్బతినే అవకాశం ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్న ప్రతిసారి మన దేశంలో వర్షపాతం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అటువంటిది ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. సుదీర్ఘమైన కరువు కాటకాలకు దారి తీయవచ్చు అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రైతులకు ప్రయోజనం చేకూర్చే నైరుతి రుతుపవనాలను ఎల్ నినో నాశనం చేస్తుందని చెబుతున్నారు. వర్షాలు సరిగ్గా పడక తీవ్ర దుర్భిక్షం ఏర్పడుతుందని.. సాగునీటి ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గి.. భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందని.. రైతాంగం తీవ్ర పెట్టుబడి నష్టాలను చవిచూడాల్సి ఉంటుందని హెచ్చరికలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.మెరికా, ఇరాన్ దేశాల మధ్య నిన్నటిదాకా భీకరమైన యుద్ధం జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా ఆ యుద్ధం తాత్కాలికంగా వాయిదా పడింది. యుద్ధం వల్ల జరిగే దాడులు విపరీతమైన కాలుష్యానికి కారణమవుతుంటాయి. కాలుష్యం వల్ల వాతావరణంలో అనేక రకాలుగా మార్పులు చోటుచేసుకుంటాయి. వాటి వల్ల కరువు కాటకాలు ఏర్పడుతుంటాయి. రెండవ ప్రపంచ యుద్ధాన్ని తీసుకుంటే.. నాడు అమెరికా వేసిన న్యూక్లియర్ బాంబు వల్ల జపాన్ తీవ్రంగా నష్టపోయింది. ఆ బాంబు వేసిన ప్రాంతంలో ఇప్పటికీ పచ్చ గడ్డి కూడా మొలవడం లేదు. దీనిని బట్టి యుద్ధం లాంటి వైపరీత్యాలు చోటు చేసుకున్నప్పుడు ప్రకృతి ఎంత ప్రభావితమవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇక యుద్ధం తాత్కాలికంగా ముగిసింది అనుకుంటే.. మరో ఉపద్రవం ప్రపంచాన్ని ఇబ్బంది పెడుతోంది. ఈసారి ప్రపంచాన్ని ఆ విధంగా కలవరపెడుతున్న అంశం యుద్ధం కాదు.. మరొకటి కాదు.. అది కరువు.ఈ కరువు ఏర్పడేందుకు ప్రధాన కారణం పసిఫిక్ మహాసముద్రం. కొంతకాలంగా పసిఫిక్ మహాసముద్రం వేడెక్కుతోంది. దీనివల్ల ఎల్ నినో ఏర్పడుతోంది. ఎల్ నినో అనేది పసిఫిక్ సముద్రంలో సాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి ఏర్పడుతున్న ఎల్ నినో అత్యంత ప్రమాదకరమైనది. దీనివల్ల 2027 వరకు ప్రపంచ వ్యాప్తంగా ఎండలు మండిపోతాయట. చివరికి ధ్రువ ప్రాంతాలలో కూడా ఉష్ణోగ్రతలు పెరుగుతాయట. ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశమైన భారత్ లో ఎల్ నినో ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశం లేదట. దీనివల్ల సాగురంగం పూర్తిగా దెబ్బతింటుందట. మనదేశంలో కరువు పరిస్థితి ఉంటే.. దక్షిణ అమెరికాలో భారీగా వరదలు వస్తాయట. విస్తారమైన వర్షాలు కురిసి ప్రాంతాలకు ప్రాంతాలు మీటా మునిగిపోతాయట. సముద్ర తీర ప్రాంతం మరింత ముందుకు దూసుకు వస్తుందట.. తీర ప్రాంతాలు కోతకు గురి అవుతాయట.మనదేశంలో కరువు అనుకుంటే.. ఆసియా మొత్తం కూడా కరువు వచ్చే అవకాశం ఉంటుందట. వాతావరణ మొత్తం అల్లకల్లోలంగా ఉంటుందట. అందువల్లే ఇప్పటినుంచే ఆయా ప్రభుత్వాలు సిద్ధంగా ఉండాలని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఎందుకంటే కరువు వల్ల చాలా ఇబ్బంది పడాల్సి వస్తుంది. ఆహార ధాన్యాలకు.. ఇతర తిండి గింజలకు తీవ్రమైన కొరత ఏర్పడుతుంది. ఆ సమయంలో మరణాలు కూడా చోటుచేసుకుంటాయి. ఇవన్నీ జరగకూడదు అనుకుంటే ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ఎల్ నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో సర్వసాధారణంగా ఏర్పడేదే. అయితే ఈసారి అత్యంత తీవ్రమైన ఎల్ నినో ఏర్పడడం వల్ల కరువు కాటకాలు అధికంగా వస్తాయట.ఒక్క వర్షాభావ పరిస్థితులే కాదు.. దేశవ్యాప్తంగా భారీగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని కూడా హెచ్చరికలు వస్తున్నాయి. అసాధారణ రీతిలో పెరుగుతాయని సంకేతాలు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయరంగం పూర్తిగా దెబ్బతింటే ఆ ప్రభావం దేశం పై పడుతుంది. అందుకే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఒకసారి మన దేశ చరిత్రను గమనిస్తే.. ఎక్కువ శాతం కరువులు ఎల్ నినో సమయంలో సంభవించినవే. 2009లో అత్యంత తీవ్రమైన ఎల్ నినో కారణంగా దేశంలో అంతకుముందు 30 ఏళ్లలో లేనంతగా.. 22 శాతం వర్షపాతం తగ్గింది. దీనికి కారణంగా దేశవ్యాప్త కరువుకు దారితీసింది. 2014 నుంచి 2016 మధ్య ఎల్ నినో ప్రభావంతో వరుసగా రెండు సంవత్సరాలు వర్షాలు తగ్గి వ్యవసాయరంగం తీవ్రంగా నష్టపోయింది. 2023 లో కూడా ఎల్ నినో ప్రభావంతో ఆగస్టు నెలలో వందేళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వర్షపాతం నమోదయింది.. అయితే ఈ ఏడాది సూపర్ ఎల్ నినో ఉంటుందని తెలియడంతో తీవ్ర దుర్భిక్షం తప్పదన్న హెచ్చరికలు వస్తున్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం.

## మంత్రి ధనసరి అనసూయ సీతక్క



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 10 ,04 2026**శుక్రవారం ములుగు జిల్లా సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలం గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని అన్నారం గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 15 లక్షల రూపాయలతో

సి ఆర్ ఆర్ నిధుల తో చేపట్టనున్న అంతర్గత సి.సి. రోడ్ల నిర్మాణ పనులకు, అంకంపల్లి గ్రామంలో ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఐటిడిఎ నిధులు సుమారు 83 లక్షలతో ఆర్ అండ్ బి రోడ్డు నుండి అంకంపల్లి వరకు బిటి రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర మంత్రి వర్యులు దనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు.

అదే గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్లకు రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పట్టాలను పంపిణీ చేశారు. స్థానిక అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి మౌలిక సదుపాయాల కల్పన పలు అంశాలపై అంగన్వాడి చిన్నారులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని మారుమూల ప్రాంతాల అభివృద్ధి, గిరిజన సంక్షేమం కోసం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.

అంకంపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసి పైలట్ ప్రాజెక్ట్ ద్వారా అన్ని మౌలిక వస్తువులు కల్పిస్తూ మంజూరు అయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయని, గతంలో రోడ్డు సౌకర్యం లేకపోవడంతో స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ప్రజలకు రవాణా సౌకర్యాలను కల్పించడం కోసం ఆర్ అండ్ బి రోడ్డు నుంచి గ్రామం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయడం జరిగిందని అత్యంత నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ రోడ్డు పనులు చేపట్టాలని సూచించారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేదల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు.

గూడు లేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేరుస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారం, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చొరవతో ములుగు నియోజకవర్గానికి 5000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని త్వరలోనే అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం రెండో విడతను ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు.

మహిళా సంఘాల ద్వారా స్థానిక ఉత్పత్తులైన ఇప్ప పువ్వు తేనె సేకరణ వంటి పనులను చేపట్టడం ద్వారా మహిళలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు.

అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని పేర్కొన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని, మెనూలో ఎటువంటి లోపాలు చూసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ టి ఈ అజయ్ కుమార్, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**రైతు భరోసా క్రింద ప్రతి ఎకరానికి పన్నెండు వేలు ఇస్తున్నాం**

**రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల 80 వేల మంది రైతులకు కొత్త పాస్ పుస్తకాలు**

**ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో ప్యాక్స్ గోడౌన్ ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి పొంగులేటి జిల్లా కలెక్టర్**





**ఖమ్మం ప్రతినిధి ఏప్రిల్ 10 (ప్రజాబలం) ఖమ్మం జిల్లా** కూసుమంచి మండలం రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజ కొనుగోలు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌజింగ్ సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం కూసుమంచి మండలంలో పర్యటించి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సిపి సునీల్ దత్ లతో కలిసి పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు ముందుగా వెంకటాపురం గ్రామంలో దేపంగి శ్రీకాంత్, వీరకుమారి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు అనంతరం చేగొమ్మ గ్రామంలో ఒక కోటి 52 లక్షలతో నిర్మించిన 2 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోడౌన్ లను మంత్రి ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో గడిచిన రెండు సంవత్సరాల మూడు నెలల్లో అన్ని వర్గాల వారికి, రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం రైతులను రాజు చేసే కార్యక్రమంలో భాగంగా రైతుల సంక్షేమంతో పాటు వారి అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే అన్న మాట ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల మంది రైతులకు 20 వేల 670 కోట్లు రెండు లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేశామని మంత్రి తెలిపారు. రైతు భరోసా ద్వారా ప్రతి పంటకు ఎకరానికి 6 వేల రూపాయలు చొప్పున సంవత్సరానికి 12 వేలు ఇస్తున్నామని, సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాకు అదనంగా 500 రూపాయలు బోనస్ అందిస్తున్నామని సన్న వడ్లను ఇతర ప్రాంతాలకు పంపకుండా పట్టించి పేదలకు సన్న బియ్యం అందిస్తున్నామని రాష్ట్ర వ్యాప్తంగా రైతులు పండించిన ప్రతి గింజను కొన్నామని, ఇకముందు కూడా కొంటామని, కొన్న వారం రోజుల్లోగా రైతుల ఖాతాల్లో ప్రజా ప్రభుత్వం డబ్బులు జమ చేస్తున్నదని తెలిపారు. రైతులు పండించిన పంట నిల్వ ఉంచాలంటే వాటికి గోదాముల అవసరమున్నదని, సొసైటీ ద్వారా వెయ్యి మెట్రిక్ టన్నుల కెపాసిటీతో రెండు గోదాములు చేగొమ్మలో నిర్మించుకొని నేడు ప్రారంభించుకున్నామని తెలిపారు రైతులకు భరోసాగా భూ భారతి తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 3 లక్షల 80 వేల మందికి కొత్త పాసు పుస్తకాలను అందజేశామని, ప్రతి అంగుళాన్ని సర్వే చేసి రైతుల పాసు పుస్తకంలో భూమి సర్వే మ్యాప్ ను ప్రింట్ చేసి భవిష్యత్ లో భూమి పంచాయతీలు రాకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండవ విడత ఇందిరమ్మ ఇళ్లను రాబోయే కొద్ది రోజుల్లోనే ఇస్తామని, మూడు, నాలుగో విడతలలో కూడా అర్హులైన పేదవాళ్లకు ఇందిరమ్మ ఇళ్లులు ఇస్తామని తెలిపారు. ప్రతి సోమవారం కట్టిన ఇంటి లెవెల్ కు అనుగుణంగా డబ్బులు జమ చేస్తున్నామన్నారు రైతులు ఆడబిడ్డలు ఆత్మ గౌరవంతో బతికేలా, నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడంతో పాటు, ప్రతి వర్గాన్ని ప్రభుత్వం ఆదుకుంటూ, భవిష్యత్తులో మరింత అండగా ఉంటుందని తెలిపారు. చేగొమ్మ గ్రామస్తులు కోరిన విధంగా కొండాపురం రోడ్డును రాబోయే వర్షాకాలం లోపు పూర్తి చేయిస్తానని తెలిపారు జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్మించుకున్న రెండు గోదాములు నేడు మంత్రివర్యుల చేతుల మీదుగా ప్రారంభించు కున్నందుకు సంతోషం వ్యక్తం చేసారు. 2 గోదాములు ప్రారంభించు కోవడంతో రెండు వేల మెట్రిక్ టన్నుల స్టోరేజ్ కెపాసిటీ జిల్లాలో పెరిగి, జిల్లాలో పండించిన పంటకు స్టోరేజ్ వెసలుబాటు వచ్చిందని, వేరే జిల్లాలపై ఆధారపడకుండా సీజన్ కు ముందు గోదాములు అందుబాటులోకి తీసుకొని వచ్చామని అన్నారు. పంట కోతల ఆధారంగా ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసి, ధాన్యం కొనుగోళ్లు చేసిన వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా ఏర్పాట్లు చేశామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డిసిఓ గంగాధర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, ఎంపీడీఓ, వివిధ గ్రామాల సర్పంచ్, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ

# యుద్ధంలో అమెరికా ఒటమి ! జియాంగ్ జుయెకిన్ అంచనాలు నిజమవుతాయా ?

అమెరికా-ఇరాన్ యుద్ధంపై చైనా నోస్ట్రాడమస్ జియాంగ్ జుయెకిన్ చేసిన విశ్లేషణ ఇప్పుడు వైట్ హౌస్ వర్గాల్లో సైతం కలకలం రేపుతోంది. జియాంగ్ జుయెకిన్ కేవలం ఒక విద్యావేత్త మాత్రమే కాదు, ప్రిడిక్టివ్ హిస్టరీ అనే ప్రసిద్ధ యూట్యూబ్ ఛానెల్ ద్వారా ప్రపంచ గమనాన్ని విశ్లేషించే వ్యూహకర్త. గతంలో ఆయన చెప్పినట్లే 2024 నవంబర్ ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించడం, ఇరాన్-అమెరికా మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకోవడం వంటివి జరగడంతో ఆయన అంచనాలకు విపరీతమైన క్రేజ్ పెరిగింది. అమెరికా కేవలం విమానాలు, డ్రోన్లతో దాడులు చేసి యుద్ధం గెలవాలని చూస్తుంది. నేలపై ఉండి పోరాడే సైనికులను అమెరికా తక్కువగా వాడుతుంది. కేవలం గాలిలో దాడులు చేసి ఇరాన్ లాంటి దేశాన్ని లొంగదీసుకోవడం సాధ్యం కాదని, చివరికి అమెరికా సైనికులు ఇరాన్ భూభాగంలోకి అడుగుపెట్టక తప్పదని ఆయన చెబుతున్నారు. కేవలం గాలిలో దాడులు చేయడం వల్ల యుద్ధం ముగియదని, అమెరికా సైనికులు ఇరాన్ భూభాగంపై అడుగు పెట్టక తప్పదని, అదే అమెరికా పతనానికి నాంది పలుకుతుందని ఆయన అంటున్నారు.

జియాంగ్ వేసిన మూడు పెద్ద అంచనాలు
నవంబర్ ఎన్నికల్లో ట్రంప్ విజయం
అమెరికా-ఇరాన్ మధ్య యుద్ధం
ఈ యుద్ధంలో అమెరికా ఓటమి

పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు

ఏప్రిల్ నెలారంభంలోనే తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడు భగభగలాడుతున్నాడు. సాయంత్రం 5 గంటల వరకు సూర్యుడు ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. చాలా జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు 41 డిగ్రీలు దాటుతున్నాయి. ముఖ్యంగా తెలంగాణలోని దాదాపు 20 జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఆయా జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఆరెంజ్ అలర్జ్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే ఈ సారి అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు పేర్కొంది.

# ఆడ పిల్లలను జన్మనిస్తుందనే సాకుతో భార్య ఇద్దరు పిల్లలను హత్య



వరంగల్ రాష్ట్ర వ్యాప్తంగా సంచలంగా మారిన భార్య ఇద్దరు బాలికల హత్యకు సంబంధించి కేసులో హత్య గురైన మృతురాలి భర్తతో పాటు ఈ హత్యలకు పరోక్షంగా కారణంగా నిలిచిన మరో తొమ్మిది మందిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు ప్రస్తుతం పరారీలో వున్నారు.

పోలీసులు అరెస్టు చేసిన వారిలో ప్రధాన నిందితుడు వరంగల్ జిల్లా, పున్నెలు గ్రామానికి చెందిన యం.డి అజారుద్దీన్ (29)తో పాటు, నిందితుడి కుటుంబ సభ్యులు పున్నెలు గ్రామానికి చెందిన యం.డి చాంద్పాషా (49), యం.డి సలీహా (45), యం.షరోద్దీన్ (25)లతో పాటు బసిక స్రవంతి (32), కడిపికొండ, బాల్నె పార్ధు (47) నెక్కొండ, బొమ్మెర మనోహర్(39), గీసుగొండ, లింగాల నరేష్(37), కొండపర్తి, సాట్లరాజు (32), పున్నెలు, వాకుదోట్ భద్రు (60), ఎనుగల్లు చెందిన వారిని పోలీసులు అరెస్టు చేయగా, మరో ఇద్దరు నిందితులు డా. బాల్నె పూర్ణిమ, డా. ఎస్.రవళీ పరారీలో వున్నారు.

ఐనవోలు మండలం పున్నెలు గ్రామానికి చెందిన ప్రధాన నిందితుడు అజారుద్దీన్ ఇదే గ్రామానికి చెందిన మృతురాలు ఫరహాత్న 2016 సంవత్సరంలో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు హుమేరా (09), ఆయేషా (06) వున్నారు. తరువాత మృతురాలు గర్భం దాల్చడంతో తిరిగి అడ పిల్లకు జన్మనిస్తుందనే రెండు దఫాలు నిందితుడు మృతురాలికి అబార్షన్ చేయించడం జరిగింది.

ఇదే సమయంలో నిందితుడి దూరపు బంధువైన మైనర్ బాలికపై ప్రేమ పెంచుకున్న నిందితుడు పెళ్ళి చేసుకుంటానని మైనర్ బాలికకు నిందితుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసాడు.నీకు ఇంతకు ముందే పెళ్ళి అయి ఇద్దరు పిల్లలు వున్నారు. నేను నిన్న పెళ్ళి చేసుకోనని మైనర్ బాలిక నిరాకరించడంతో, తనకు భార్య పిల్లలు వుండటం కారణంగానే మైనర్ బాలిక పెళ్ళి అంగీకరించడం లేదని భార్య పిల్లలపై కక్ష్య పెంచుకున్నాడు తను ప్రస్తుతం ప్రేమిస్తున్న బాలికను పెళ్ళి చేసుకోవాలంటే భార్య, పిల్లలు బ్రతికుండగా సాధ్యం కాదని, వారిని చంపడం ద్వారా ఇది సాధ్యమని నిర్ణయించుకున్నాడు నిందితుడు.

ఇందుకోసం నిందితుడు తాను అనుకున్న ప్రణాళిక ప్రకారం ఈ నెల 1వ తారీఖు రాత్రి సుమారు 7.50 గంటలకు ఐసు క్రీం తినిపిస్తానని భార్య పిల్లలను తాను నిర్వహిస్తున్న స్విమ్మింగ్ పూల్ వద్దకు కారులో తీసుకరావడం జరిగింది. ప్రణాళిక ప్రకారం నిందితుడు ముందుగానే స్విమ్మింగ్ పూల్ వద్ద సిసి కెమెరాలు, కరెంటు నిలిపి వేయడంతో స్విమ్మింగ్ చేరుకున్న మృతులను నిందితుడు బలవంతంగా స్విమ్మింగ్లోకి నెట్టివేసి స్విమ్మింగ్ పూల్లో పడిపోయిన భార్య పిల్లలను బలవంతంగా వారు చనిపోయేవరకు వారిని నీటిలో ముంచి దారుణంగా హత్య చేసాడు. ఈ ముగ్గురిని హత్య చేసిన అనంతరం నిందితుడు వీరు మరణించినట్లుగా నిర్ధారించుకొని తన భార్య పిల్లలు స్విమ్మింగ్ పూల్లో పడి మృతి చేందారని ప్రచారం చేశాడు. మృతిరాలి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు తమకు అందుబాటులో వున్న టెక్నాలజీని వినియోగించుకొని నిందితుడు అజారుద్దీన్ తన భార్య పిల్లలను దారుణంగా హత్య చేసినట్లుగా నిర్ధారణకు వచ్చారు. పట్టుబడిన నిందితుల్లో స్రవంతి పై మూడు కేసులు, డా. పార్ధు మీద నాలుగు కేసులు, ప్రస్తుతం పరారీ లో వున్న డా. పూర్ణిమ పై నాలుగు కేసులు ఉన్నట్లుగా పోలీసులు వెల్లడించారు.

## బీసీ ధర్మదీక్షకు సంపూర్ణ మద్దతు తెలియజేసిన బిసి ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్





**శేర్లింగంపల్లి (ప్రజాబలం ప్రతినిధి నరేష్) ఏప్రిల్ 10** బీసీవై పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడ రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన మంగళగిరిలోని బీసీవై పార్టీ కేంద్ర కార్యాలయంలో పూలే భవన్లో బీసీల ప్రధాన డిమాండ్లపై రామచంద్ర యాదవ్ చేస్తున్న బీసీ రక్షణ చట్టం అమలు, బీసిలకు 1000 ఎకరాలు భూమి కేటాయింపు,నిధులు ఉద్యోగాలు స్థానిక సంస్థల చట్టసభల్లో బీసీలకు 44% రిజర్వేషన్లు అమలు చేయాలని చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. బీసీ డిమాండ్లపై బీసీల హక్కుల కోసం బోడ రామచంద్ర యాదవ్ చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు బీసీ సంఘాల నాయకులు ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు తెలియజేయాలని భేరి రామచందర్ యాదవ్ అన్నారు అన్నారు.ఈ కార్యక్రమంలోఎర్రగుంట్ల వెంకటేష్ యాదవ్, పల్నాడు వెంకటేష్ యాదవ్ బిల్డర్ రమణ యాదవ్, కృష్ణ గౌడ్, రమేష్ పద్మశాలి నేత, పాములేటి యాదవ్, రాజు ముదిరాజ్, నాయి బ్రాహ్మణ సంఘం కిషోర్, రజక సంఘం కిరణ్ ఇతరులు పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.


## సమతౌల్య ఆరోగ్యానికి హోమియోపతి ఉత్తమమైన మార్గం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్.

జగిత్యాల: ఏప్రిల్ 10 సమతౌల్య ఆరోగ్యానికి హోమియోపతి ఉత్తమమైన మార్గం అని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం జగిత్యాల మాతా శిశు ఆసుపత్రిలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ హోమియోపతి దినోత్సవం ఆయుష్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానవుని జీవన విధానంలో యోగ భాగం కావాలన్నారు. భారతదేశ సనాతన వైద్యం హోమియోపతి అని, ప్రపంచంలో మొదటి కటరాక్ట్ చికిత్స చేసింది సుశ్రుతుడని, రోగం వచ్చాక చికిత్స కన్నా రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి సంజయ్ కుమార్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నదే ప్రభుత్వ ఉద్దేమన్నారు. అంతకుముందు హోమియోపతి వైద్య సృష్టి కర్త డాక్టర్ సి.ఎఫ్.ఎస్.హెన్మాన్ జయంతి ని పురస్కరించుకుని వారి చిత్ర పటానికి నివాళు లు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి శ్రీనివాస్, డియం హెచ్ఓ సుజాత, డిప్యూటీ డియం హెచ్ఓ శ్రీనివాస్, సూపరిండెంట్ డాక్టర్.కృష్ణ మూర్తి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీల్, డాక్టర్ నరేశ్, కౌన్సిలర్లు ప్రశాంత్ రావు, దుమాల రాజ్ కుమార్, సర్పంచ్ మోహన్ రెడ్డి, ఏవో మెప్మ శ్రీనివాస్, నాయకులు కోటేశ్వర రావు, ప్రవీణ్ రావు,నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఆన్లైన్ బూస్టర్ సిస్టమ్ పనితీరును పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్, ఏప్రిల్ 10 : మారుమూల నివాస ప్రాంతాలకు సైతం రక్షిత మంచి నీటిని అందించేందుకు వీలుగా ఎడపల్లి మండలం జానకంపేట వద్ద ఏర్పాటు చేసిన ఆన్లైన్ బూస్టర్ సిస్టమ్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. దీని పనితీరు, ప్రయోజనాల గురించి గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిట్టచివరన ఉండే ఆవాసాలకు కూడా తాగునీరు చేరుకునేందుకు ఈ విధానం దోహదపడుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అనంతగిరి, పోచారం గ్రామాలకు సైతం తాగునీటి సరఫరా కోసం ఇదేతరహా ఏర్పాట్లు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత వేసవిలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి కొరత తలెత్తకుండా ముందస్తుగానే చర్యలు చేపడుతున్నామని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. ప్రతి ఆవాస ప్రాంతానికి రక్షిత మంచి నీరు సరఫరా అయ్యేలా పక్కాగా పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు. కలెక్టర్ వెంట ఆర్.డబ్ల్యూ.ఎస్ ఈ.ఈ లు రాకేష్, స్వప్న తదితరులు ఉన్నారు.

## ఈ ఏడాది వర్షపాతం తక్కువే
## ఎల్నినో ప్రభావంతో తగ్గనున్న వర్షపాతం : స్కైమెట్



హైద్రాబాద్ ఏప్రిల్ 10;ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో వర్షపాతం సాధారణం కంటే తకువగా నమోదయ్యే అవకాశం ఉన్నదని వాతావరణ అధ్యయన సంస్థలు తాజాగా అంచనా వేశాయి. దేశ వ్యవసాయ రంగానికి ప్రధాన ఆధారమైన నైరుతి రుతుపవనాలపై 'సైమెట్' వెదర్ అంచనా వేసింది. ఈ ఏడాది దీర్ఘకాల సగటు(ఎల్పీఏ)లో కేవలం 90 నుంచి 95% వర్షపాతం మాత్రమే కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈసారి వర్షాలు ఆశించిన స్థాయిలో ఉండకపోవచ్చని, ఇది వానకాలం సాగుపై ప్రభావం చూపే ప్రమాదం ఉన్నదని నిపుణులు అంచనా వేస్తున్నారు. రుతుపవనాలు బలహీనపడటానికి ప్రధాన కారణం 'ఎల్నినో' ప్రభావమేనని సైమెట్ స్పష్టంచేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరుగడం వల్ల ఏర్పడే ఈ పరిస్థితి, భారత ఉపఖండంలో వర్షాలను తగ్గిస్తుందని, రుతుపవనాల ప్రారంభ దశలో ఇది మొదలై, ఏడాది చివర వరకు మరింత బలంగా మారే అవకాశం ఉన్నదని తెలిపారు. ప్రస్తుతానికి ఇవి ప్రైవేట్ సంస్థ అంచనాలు మాత్రమే. త్వరలో నివేదికను భారత వాతావరణశాఖ అధికారికంగా విడుదల చేయనున్నది.

## తెలంగాణ రాష్ట్రం లోఅవినీతి పై అన్నా హజార కలిసిన ఆర్. అరుణ్ కుమార్



న్యూ డిల్లి ఏప్రిల్ 10 :జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఆర్. అరుణ్ కుమార్, ప్రముఖ సాంఘిక కార్యకర్త మరియు అవినీతి వ్యతిరేక యోధుడు అన్నా హజారేను ఆయన నివాసంలో కలిశారు.

47 ఏళ్లకు పైగా అవినీతిపై అవిశ్రాంతంగా పోరాడుతూ, లోక్పాల్ బిల్లు ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన అన్నా హజారే, మహారాష్ట్రలో ముగ్గురు మంత్రుల అరెస్టుకు దారితీసిన అవినీతి కేసులను వెలుగులోకి తేవడంలో కూడా కీలక పాత్ర పోషించారు.

సుమారు అరగంట పాటు జరిగిన ఈ సమావేశంలో, తెలంగాణలోని అవినీతికి సంబంధించిన వివిధ అంశాలపై కూలంకషంగా చర్చలు జరిగాయి. భూదాన్ భూములకు సంబంధించిన అవకతవకలు, కాళేశ్వరం ప్రాజెక్టులో నమోదైన నిర్మాణపరమైన లోపాలు, మరియు కొమ్మెర ఘటన వంటివి ప్రధానాంశాలుగా ఉన్నాయి.

రాజకీయ వ్యవస్థలో మరింత పారదర్శకత ఆవశ్యకత గురించి కూడా శ్రీ ఆర్. అరుణ్ కుమార్ చర్చించారు. రాజకీయ నాయకులందరూ తమ ఎన్నికల అఫిడవిట్లలో పాస్పోర్ట్ వివరాలను వెల్లడించాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా అన్నా హజారే మాట్లాడుతూ, పేదలకు ప్రయోజనం చేకూర్చే మరియు పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని నిర్ధారించే బలమైన అవినీతి నిరోధక చట్టాలను అమలు చేయడంపైనే దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందని నొక్కి చెప్పారు. అవినీతి నిర్మూలన, ప్రజా సంక్షేమాన్ని ప్రోత్సహించే ప్రయత్నాలను బలోపేతం చేయడం ఆర్. అరుణ్ కుమార్కు విలువైన మార్గదర్శనం కూడా అందించారు.

## భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత ప్రోగ్రాం అధికారులతో హాజరయ్యారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచానికి భారతీయ వైద్య విధానం ఆదర్శంగా నిలిచిందని ఎన్నో రకాల వైద్య పద్ధతుల ద్వారా వ్యాధులను నయం చేసే విధానాలను అవలంబించడం జరుగుతుందని తెలిపారు. భారతీయ వైద్య వ్యవస్థలో హోమియో ఆయుర్వేదం యునాని యోగ వంటి అనేక పద్ధతులలో వ్యాధులను నయం చేసేందుకు అవకాశం ఉందని కీళ్ల నొప్పులు మధుమేహం రక్త పటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను హోమియోపతి న్యాచురోపతి యోగ వంటి విధానాల ద్వారా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆయుష్ వైద్యులు అందుబాటులో ఉన్నారని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అతి సాధారణ ఖర్చులతో ప్రకృతికి దగ్గరగా యోగ ఫిజియోథెరపీ ద్వారా అందించే చికిత్సకు మంచి ఫలితాలు లభిస్తున్నాయని ప్రభుత్వం చేపట్టిన ప్రజా పలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని గ్రామీణ స్థాయి నుండి పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని మన జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దామని తెలిపారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు వైద్యులు జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం

### జీవన శైలిలో యోగ ఒక భాగంగా అలవార్చుకోవాలి

### ఆరోగ్య సంరక్షణకు యోగ ఎంతో అవసరం

జగిత్యాల: ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రం లోని ఉదయం యోగా భవన్లో యోగా ప్రదర్శన జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం మెగా ఆయుష్ వైద్య శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్, జిల్లా వైద్యాధికారి సుజాత తో కలిసి ప్రారంభించారు. ఈ శిబిరంలో హోమియోపతి, ఆయుర్వేదం, ఇతర ఆయుష్ వైద్య విధానాల ద్వారా ప్రజలకు ఉచిత వైద్య సేవలు,ఔషధాలు అందించడం జరుగుతుంది. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, రోజువారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా అలవార్చుకోవాలని అన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఆయుష్ వైద్య విధానాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యోగా, ఆయుర్వేదం, హోమియోపతి వంటి సంప్రదాయ వైద్య పద్ధతులు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు జీవనశైలిని మెరుగుపరుస్తాయని,ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ మెగా ఆయుష్ వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సులభంగా వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని వివరించారు.ప్రజలందరూ యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సుజాత, వివిధ జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖ అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పాదయాత్రల సాక్షిగా వర్డ్స్ వార్...

కడప, ఏప్రిల్ 10 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చేసి, సంక్షేమ రాజ్యానికి బాటలు వేసిన దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి చేపట్టిన చారిత్రాత్మక 'ప్రజాప్రస్థానం' పాదయాత్రకు నేటితో 23 ఏళ్లు పూర్తయ్యాయి. అయితే, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆయన వారసులు, అన్నాచెల్లెళు అయిన వైఎస్ జగన్, వైఎస్ షర్మిల మధ్య సోషల్ మీడియా వేదికగా సాగిన మాటల యుద్ధం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. తండ్రి ఆశయాల వారసులం మేమంటే మేమని ఇద్దరూ క్లెయిమ్ చేసుకుంటున్నప్పటికీ, ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలు శృతిమించాయి. మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత వైఎస్ జగన్ తన తండ్రి పాదయాత్రను గుర్తు చేసుకుంటూ భావోద్వేగపూరితమైన ట్వీట్ చేశారు. ఏప్రిల్ 9, 2003న ఎర్రటి ఎండలో ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి వైఎస్సార్ వేసిన అడుగులు, రాష్ట్ర చరిత్రను తిరగరాశాయని ఆయన కొనియాడారు. "నేనున్నాను" అనే భరోసాతో ప్రజల గుండెల్లో వైఎస్సార్ నిలిచిపోయారని, ఆ పాదయాత్రే ఆయన్ను ముఖ్యమంత్రిని చేసిందని పేర్కొన్నారు. ముఖ్యంగా వైఎస్సార్ హయాంలో జరిగిన ఉచిత విద్యుత్ సంతకం, జలయజ్ఞం, పోలవరం ప్రాజెక్టు వేగం, విద్య, వైద్య రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పులను జగన్ గుర్తు చేశారు. తన తండ్రి వేసిన ఆ ముద్రను ఎవరూ చెరిపేయలేరని, అదే స్ఫూర్తితో తన ప్రయాణం కొనసాగుతుందని జగన్ స్పష్టం చేశారు. తండ్రి వారసత్వాన్ని తన సంక్షేమ పాలనతో ముందుకు తీసుకెళ్తున్నానని ఆయన పరోక్షంగా ఈ ట్వీట్ ద్వారా సందేశాన్ని ఇచ్చారు. జగన్ ట్వీట్‌కు ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అత్యంత ఘాటుగా స్పందించారు. వైఎస్సార్ పాదయాత్రను ఒక కాంగ్రెస్ సైనికుడిగా, పీసీసీ అధ్యక్షుడిగా ప్రారంభించారన్న విషయాన్ని ఆమె ప్రధానంగా గుర్తు చేశారు. వైఎస్సార్ పేరును పార్టీలో పెట్టుకుని, ఆయన ఆశయాలకు విరుద్ధంగా జగన్ వ్యవహరిస్తున్నారని నేరుగా విమర్శించారు. లౌకికవాదానికి నిలువుటద్దంలా నిలిచిన వైఎస్సార్ ఎక్కడ? మతోన్మాద బీజేపీకి ఢిల్లీలో తలవంచి, రాష్ట్రంలో మౌనం వహిస్తున్న జగన్ ఎక్కడ? అని ఆమె ప్రశ్నించారు. వక్ఫ్ చట్టం, దళిత క్రైస్తవుల రిజర్వేషన్లు వంటి అంశాల్లో జగన్ వైఖరిని ఆమె తప్పుబట్టారు. జగన్ ఐదేళ్ల పాలనలో దళితులు, మహిళలు, మైనారిటీలపై దాడులు పెరిగాయని, ఇది వైఎస్సార్ ఆత్మ క్షోభించేలా ఉందని ఆరోపించారు. ఫాసిస్టు శక్తులకు, క్యాపిటలిస్టులకు జగన్ దాసోహమయ్యారని షర్మిల విమర్శించారు. వైఎస్సార్ ఆశయాలకు పూర్తి భిన్నంగా ఉంటూ ఆయనకు నివాళులు అర్పించడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. జగన్ ఇప్పుడు చేయాల్సింది పాదయాత్ర కాదని, ఆత్మవిమర్శన యాత్ర అని చురకలు అంటించారు. ఒకప్పుడు అన్న కోసం ఉప ఎన్నికల్లో, పాదయాత్రలో అలుపెరగకుండా శ్రమించిన షర్మిల, నేడు అదే అన్నపై రాజకీయంగా యుద్ధం ప్రకటించడం వైఎస్సార్ అభిమానులను విస్మయానికి గురి చేస్తోంది. వైఎస్సార్ పాదయాత్ర వార్షికోత్సవం సాక్షిగా బయటపడ్డ ఈ విభేదాలు, కేవలం కుటుంబ కలహాలే కాక, సిద్ధాంతపరమైన పోరాటంగా కూడా మారుతున్నాయి. తండ్రి పేరును, పాదయాత్ర సెంటిమెంట్‌ను ఇద్దరూ వాడుకుంటున్నప్పటికీ, ప్రజలు ఎవరి వైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు జగన్ తన తండ్రి సంక్షేమ పథకాలే తన ఆయుధాలని అంటుంటే, మరోవైపు వైఎస్సార్ అసలైన రాజకీయ వారసత్వం తనదేనని షర్మిల వాదిస్తున్నారు. మొత్తానికి వైఎస్సార్ పాదయాత్ర జ్ఞాపకం.. అన్నాచెల్లెళ్ల మధ్య ట్వీట్ల యుద్ధానికి వేదికైంది.

# కారు ఇన్నోవా ఎదురెదురు డీ.. ఇద్దరు దుర్మరణం



మదనపల్లి మండలంలోని సిటిఎం కంకర ఫ్యాక్టరీ వద్ద కారు ఇన్నోవా ఎదు రెదురు ఢీకొని ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై తాలూకా సిఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాలు.. మండలంలోని కొత్తవారిపల్లి పంచాయతీ, పూలవండ్లపల్లి కు చెందిన శేషాద్రి రమణ 36 సిటిఎం ఇండియన్ బ్యాంకులో అటెండర్ గా పనిచేసే విధులు ముగించుకుని బైకులో ఇంటికి బైక్ లో బయలుదేరాడు. స్కూటర్ మార్గమధ్యంలోని కంకర ఫ్యాక్టరీ సమీపంలోకి వెళ్ళగానే మదనపల్లె దేవత నగర్ ముజీబ్ నగర్ లకు చెందిన జావీద్, అస్లాం, ముబారక్ మరో యువకుడు ప్రయాణిస్తున్న ఇన్నోవా కారు బైక్ ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో స్కూటర్ లో వెళుతున్న శేషాద్రి రమణ అక్కడి కక్కడే దుర్మరణం చెందగా, కారు రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టి అందులో ఉన్న ఓ 13 ఏళ్ళ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ముగ్గురిని వెంటనే మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు. మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

# 16 నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు

ఈ నెల 16 నుంచి మూడు రోజుల పాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఈ చారిత్రక బిల్లుల ఆమోదానికి అన్ని పార్టీలు సహకరించాలని ప్రధాని మోదీ కోరారు. అత్యవసర అంశాలపైనే చర్చ ఉంటుందని, అవసరమైతే సమావేశాలను పొడిగించే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

# జిల్లావ్యాప్తంగా పోలీసుల నైట్ పెట్రోలింగ్



కడప నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు జిల్లా వ్యాప్తంగా నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు.

నేర నియంత్రణతో పాటు అసాంఘిక కార్యకలాపాల కట్టడి, ప్రజల్లో భద్రత భావాన్ని పెంపొందించడం కోసం ప్రతీ రోజు నైట్ పెట్రోలింగ్ విధులు కొనసాగుతున్నాయి. లాక్డ్ హౌస్ ( తాళాలు వేసిన ఇళ్లు ) వద్ద దొంగతనాలు జరగకుండా ప్రత్యేకంగా నిఘా ఉంచారు. కింది స్థాయి సిబ్బంది నుండీ ఎస్సైలు, సి.ఐ లు, డీఎస్పీల దాకా రాత్రి వేళ మరింత అప్రమత్తత తో గస్తీ విధులు, పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. బీట్ తనిఖీ అధికారులు, సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి రవాణా వివరాలు, కొత్త వ్యక్తుల వివరాలు ఆరా తీసి అక్రమ రవాణాను అరికట్టే చర్యలు తీసుకుంటున్నారు. బీట్ తనిఖీ అధికారులు తరచూ బీట్ పాయింట్స్ తనిఖీ చేసి, సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ఎటువంటి నేరాలు జరగకుండా పకడ్బందీగా గస్తీ విధులు నిర్వర్తించేలా చేస్తున్నారు. లాడ్జి రూమ్స్ లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. లాడ్జిలో ఉంటున్న వారి అధార్ కార్డు పరిశీలించి వారు వివరాలు సేకరించారు. తెల్లవారు జామున వెహికిల్ డ్రైవర్లకు స్టాప్ అండ్ వాష్ కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూస్తున్నారు.

# గులాబీలో అంతర్మధనం...




హైదరాబాద్, ఏప్రిల్ 10, ముందు వచ్చిన చెవుల కంటే.. వెనుక వచ్చిన కొమ్ములు వాడి అంటారు. మిగతా రంగాలలో ఏమోగానీ.. రాజకీయాల్లో మాత్రం ఈ సామెత నూటికి నూరు శాతం సరిపోతుంది. అధికారంలోకి రాకముందు పార్టీలు మొత్తం ప్రజాస్వామ్య విలువల గురించి మాట్లాడతాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం ఆ అధికారాన్ని మరింత సుస్థిరం చేసుకోవడానికి తాపత్రయపడతాయి. ఇందులో ఆ పార్టీ.. ఈ పార్టీ అని తేడా లేదు.. అన్ని అలానే ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రంలో 2014లో జరిగిన ఎన్నికల్లో నాటి తెలంగాణ రాష్ట్ర సమితి అధికారంలోకి వచ్చింది.. అప్పుడు ఆ పార్టీకి గొప్పగా చెప్పుకునే సీట్లు రాలేదు. దీంతో ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపింది. టిడిపి నుంచి మొదలు పెడితే కాంగ్రెస్ పార్టీ వరకు అందరూ ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది. చివరికి కమ్యూనిస్టు పార్టీని కూడా వదిలిపెట్టలేదు. నాడు ఈ పరిణామాన్ని గులాబీ పార్టీ రాజకీయ పునరేకీకరణ అని చెప్పింది. అంతేకాదు 2018 లో జరిగిన ఎన్నికల్లోను ఇతర పార్టీల నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను తన పార్టీలో చేర్చుకుంది గులాబీ పార్టీ. పైగా వారికి మంత్రి పదవులు కూడా ఇచ్చింది.. నాడు కూడా కేసీఆర్ దానిని రాజకీయ పునరేకికరణ అని చెప్పారు. అప్పుడు ఇతర పార్టీలకు సంబంధించిన ఎమ్మెల్యేలు గులాబీ పార్టీలో చేరుతున్నప్పుడు.. రకరకాల విమర్శలు వచ్చాయి. నాడు అధికారం ఉంది కాబట్టి వాటిని కేసిఆర్ తొక్కిపెట్టారు. ఒరిజినల్ తెలంగాణ కాకుండా.. బంగారు తెలంగాణ బ్యాచ్ హవా పెరిగిపోయిందని అప్పట్లో విమర్శలు వచ్చాయి. అయినప్పటికీ వాటిని కెసిఆర్ పట్టించుకోలేదు. పైగా సొంత మీడియాలో రాజకీయ పునరేకీకరణ అనే కోణంలో కథనాలు రాయించారు. అప్పట్లో కెసిఆర్ మీడియా మీద ఉక్కు పాదం మోపడంతో.. తెలంగాణలో ప్రశ్నించే గొంతుక లేకుండా పోయింది. 2023 లో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆ తర్వాత గతంలో తను ఎదురైన అనుభవానికి గట్టి రివెంజ్

తీర్చుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావించారు. అందులో భాగంగానే గులాబీ పార్టీలో గెలిచిన కొంతమంది ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకున్నారు. దీనిని బిఆర్ఎస్ నేతలు విమర్శించారు. సుప్రీంకోర్టు దాకా వెళ్లారు. అనేక సందర్భాల్లో విచారణ పూర్తయిన తర్వాత సుప్రీంకోర్టు ఈ అంశాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్లింది. స్పీకర్ ఎలాగూ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యక్తి కాబట్టి.. ఆ పార్టీకి అనుకూలంగానే నిర్ణయం తీసుకున్నారు. మొత్తంగా గులాబీ పార్టీ ఈ వ్యవహారంలో ఏదో చేయబోయి.. తనే విమర్శల పాలైంది. అటు కాంగ్రెస్ పార్టీ.. ఇటు భారత రాష్ట్ర సమితి ఇప్పుడు తెలంగాణలో ఒక రకమైన ఒత్తిడి వాతావరణాన్ని ఎదుర్కొంటున్నాయి.. భారత రాష్ట్ర సమితి జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డిని చేర్చుకుంది. ఇది ఎల్ రమణలాంటి వాళ్లకు నచ్చడం లేదు. పైగా వచ్చే ఎన్నికల్లో జీవన్ రెడ్డికి టికెట్ ఇస్తామని గులాబీ పార్టీ పెద్దలనుంచి హామీ లభించినట్లు తెలుస్తోంది. అదే జరిగితే రమణ రాజకీయ భవిష్యత్తు మొత్తం నాశనమైనట్టే. అందువల్లే ఆయన జీవన్ రెడ్డి రాక పట్ల అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. మిగతా భారత రాష్ట్ర సమితి నాయకులు కూడా ఇదే ధోరణిలో ఉన్నట్టు సమాచారం. ఒకవేళ జీవన్ రెడ్డి కి ఒక టికెట్ ఇస్తే.. రమణ తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వేరే నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్టు కనిపిస్తోంది. కేవలం జగిత్యాలలోనే కాకుండా.. ఇంకా కొన్ని నియోజకవర్గాలలో భారత రాష్ట్ర సమితి ఆపరేషన్ ఆకర్ష కు తెర లేపినట్టు తెలుస్తోంది. అయితే అక్కడ ఉన్న గులాబీ పార్టీ నేతలు అంతర్మథనంలో పడుతున్నారని.. తమ రాజకీయ భవిష్యత్తు దృష్ట్యా వేరే నిర్ణయం తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారని వార్తలు వస్తున్నాయి. ఇక అధికార కాంగ్రెస్ పార్టీలో కూడా పరిస్థితి ఏమంత గొప్పగా లేదు. రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిని ఆశిస్తున్నారు. అసెంబ్లీ వేదికగా కాంగ్రెస్ పార్టీని కడిగిపారేస్తున్నారు. ఎమ్మెల్సీ విజయశాంతి కూడా ప్రభుత్వ వైఖరి పట్ల తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. తన సేవలను పార్టీ వాడుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల శాసన మండలి లో విజయశాంతి సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ వ్యవహార శైలి సక్రమంగా లేదని.. ప్రభుత్వంలో కూడా సానుకూల దృక్పథం కనిపించడం లేదని మండిపడ్డారు. ఇంకా కొంతమంది నేతలు కూడా ప్రభుత్వ తీరు పట్ల ఆగ్రహంతో ఉన్నారు. మొత్తంగా చూస్తే అటు బిటి బ్యాచ్.. ఇటు వలస బ్యాచ్.. వల్ల రెండు ప్రధాన పార్టీలు శిరోభారాన్ని ఎదుర్కొంటున్నాయి. అయితే ఈ భారం ఎంతవరకు సాగుతుంది.. వచ్చే ఎన్నికల్లో ఎటువంటి ప్రభావాన్ని చూపిస్తుంది.. ఈ ప్రశ్నలకు త్వరలోనే సమాధానం లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

# అంతుపట్టని విజయ్ వ్యూహం



చెన్నై, ఏప్రిల్ 10, (న్యూస్ పల్స్) తమిళనాడు రాజకీయాల్లో ఇప్పుడు కొత్త చర్చకు దారితీసిన పేరు దళపతి విజయ్ (సినీ నటుడిగా అపారమైన ప్రజాదరణ సంపాదించిన ఆయన, రాజకీయాల్లోకి అడుగుపెట్టి తనదైన ముద్ర వేయాలని ప్రయత్నిస్తున్నారు. రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించిన తమిళగ వెట్రి కళగంపార్టీతో ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగేందుకు సిద్ధమవడం రాష్ట్ర రాజకీయాలను ఆసక్తికరంగా మార్చింది. ఇటీవల ఆయన తీసుకున్న కీలక నిర్ణయం రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. రాష్ట్రంలోని అన్ని 234 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించడం ద్వారా విజయ్ తన వ్యూహాన్ని స్పష్టంగా తెలియజేశారు. సాధారణంగా కొత్త పార్టీలు డీఎంకే లేదా అన్నాడీఎంకే వంటి ప్రధాన పార్టీలతో కూటమి కట్టడం ద్వారా తమ ఉనికిని చాటుకోవాలని చూస్తాయి. కానీ విజయ్ మాత్రం ఆ మార్గాన్ని ఎంచుకోకుండా స్వతంత్రంగా ముందుకు సాగుతున్నారు. ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాలను విశ్లేషిస్తే కొన్ని ఆసక్తికర అంశాలు బయటపడుతున్నాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వంపై

యువత, మహిళలు, ప్రభుత్వ ఉద్యోగుల్లో కొంత అసంతృప్తి పెరుగుతోందని సర్వేలు సూచిస్తున్నాయి. అదే సమయంలో ప్రతిపక్షంగా ఉన్న అన్నాడీఎంకే పట్ల కూడా తటస్థ ఓటర్లలో పూర్తి నమ్మకం కనిపించడం లేదు. ఈ రెండు పార్టీలపై ఉన్న అసంతృప్తిని ఒకే దిశగా మళ్లించాలనే లక్ష్యంతో విజయ్ తన వ్యూహాన్ని రూపొందించుకున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సర్వే అంచనాల ప్రకారం, టీవీకే పార్టీకి 18 నుండి 20 శాతం వరకు ఓటు షేర్ వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇది సాధారణంగా కొత్త పార్టీకి చాలా పెద్ద సాధనగా భావించవచ్చు. ఈ స్థాయిలో ఓట్లు వస్తే, నేరుగా అధికారంలోకి రావడం కష్టమైనా, ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించే అవకాశం ఉంటుంది. ఈ పరిస్థితిలో విజయ్ 'కింగ్ మేకర్'గా మారే అవకాశం ఉందని అంచనాలు వినిపిస్తున్నాయి. విజయ్ వ్యక్తిగత ఇమేజ్ కూడా ఆయనకు పెద్ద బలంగా మారుతోంది. ముఖ్యంగా క్రైస్తవ వర్గం ఓటర్లు ఆయన వైపు మొగ్గు చూపే అవకాశముందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఇప్పటివరకు ఆ వర్గానికి రాష్ట్ర

స్థాయిలో బలమైన రాజకీయ ప్రత్యామ్నాయం లేకపోవడం కూడా దీనికి కారణంగా చెప్పవచ్చు. దీంతో ఆ వర్గం ఓట్లను ఆకర్షించడంలో టీవీకే కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఇంకా ఒక ముఖ్యమైన అంశం ఆయన సినీ ప్రభావం. భారీ ఫ్యాన్ బేస్, ముఖ్యంగా యువతలో ఉన్న ఆదరణ ఆయనకు రాజకీయంగా ప్లస్ అవుతోంది. ఈ క్రేజ్‌ను ఓట్లుగా మార్చుకునే దిశగా ఆయన బృందం వ్యూహాలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి విజయ్ తీసుకున్న 'సోలో ఫైట్' నిర్ణయం కేవలం ధైర్యం మాత్రమే కాదు, దాని వెనుక పక్కా రాజకీయ లెక్కలు ఉన్నాయని స్పష్టంగా కనిపిస్తోంది. ప్రధాన పార్టీల ఓట్లను చీల్చడం ద్వారా తమ స్థాయిని పెంచుకోవడం, తద్వారా రాష్ట్ర రాజకీయాల్లో ప్రభావవంతమైన శక్తిగా ఎదగడం ఆయన లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ వ్యూహం ఎంతవరకు ఫలిస్తుందో తెలుసుకోవాలంటే ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

## భార్యను కడతేర్చిన భర్త

మార్కాపురం జిల్లా గిద్దలూరు పట్టణంలోని ఏబీఏం పాలెంలో గంగరాజు అనే వ్యక్తి తన భార్య ప్రేమ కుమారిని రోకలిబండతో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన అనంతరం నిందితుడు సంఘటనా స్థలం నుంచి పారిపోయాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు. 15 ఏళ్ల క్రితం వివాహం జరిగిన ఈ దంపతులకు ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. తల్లి తన తండ్రి చేతిలోనే హత్యకు గురి కావడంతో పిల్లలు కన్నీరుమున్నీరయ్యారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

# పురుషులకు ఎంట్రీ లేని టెంపుల్స్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10, (న్యూస్ పల్స్) కేరళలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయసున్న మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం మరోసారి గట్టిగా సమర్థించింది. ఇది మహిళల పట్ల చూపుతున్న వివక్ష కాదని, శతాబ్దాలుగా వస్తున్న మతపరమైన ఆచారాలను గౌరవించడమేనని సుప్రీంకోర్టుకు విన్నవించింది. మన దేశంలో కేవలం మహిళలకు మాత్రమే పరిమితమైన, పురుషులను అనుమతించని ఆలయాలు కూడా ఉన్నాయని ఈ సందర్భంగా గుర్తుచేసింది. శబరిమల కేసుపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల విస్తృత రాజ్యాంగ ధర్మాసనం గురువారం మూడో రోజు విచారణ చేపట్టింది. కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపిస్తూ.. భక్తి అనేది స్త్రీ, పురుషాధిక్యతలకు సంబంధించిన అంశం కాదని పేర్కొన్నారు. పురుషులకు ప్రవేశం లేని ఆలయాలు: దేవి భగవతి వంటి ఆలయాల్లో పురుషుల ప్రవేశంపై ఆంక్షలు ఉన్నాయని, ఇది కూడా ఆచారంలో భాగమేనని తెలిపారు. మహిళల వేషధారణలో పురుషులు: కేరళలోని మరో ఆలయంలో

పురుషులు మహిళల వేషధారణలో వెళ్లే ఆచారాన్ని ప్రస్తావిస్తూ.. మతపరమైన విశ్వాసాలను రాజ్యాంగపరమైన వివక్షతో ముడిపెట్టలేమని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. 2018లో శబరిమలలో అన్ని వయసుల మహిళలకు ప్రవేశం కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆ తీర్పుపై పెద్ద ఎత్తున రివ్యూ పిటిషన్లు దాఖలవ్వడంతో, 2019లో అప్పటి సీజేఐ రంజన్ గొగొయ్ ఈ కేసును విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశారు. ప్రస్తుతం ఈ అంశంపై అత్యున్నత న్యాయస్థానంలో లోతైన విచారణ జరుగుతోంది. ఏది మూఢనమ్మకమో, ఏది ఆచారమో తేల్చగలమని ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం ప్రాధాన్యత సంతరించుకుంది

# విమానయాన సంస్థలకు గుడ్ న్యూస్

ముంబై, ఏప్రిల్ 10, (న్యూస్ పల్స్) పశ్చిమాసియాలో అమెరికా ? ఇరాన్ మధ్య రగులుతున్న యుద్ధ వాతావరణం, భౌగోళిక ఉద్రిక్తతల కారణంగా తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న దేశీయ విమానయాన సంస్థలకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. విమానాల నిర్వహణ భారాన్ని తగ్గించే దిశగా అత్యవసర ఉపశమన చర్యలు చేపట్టింది.దేశవ్యాప్తంగా ఉన్న అన్ని విమానాశ్రయాల్లో విమానాల ల్యాండింగ్, పార్కింగ్ ఛార్జీలను రాబోయే మూడు నెలల పాటు 25 శాతం మేర తగ్గిస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. ఈ సవరించిన (తగ్గించిన) ఛార్జీలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేస్తూ భారత విమానాశ్రయాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.అదనపు భారం: ఇరాన్ ఉద్రిక్తతలకు తోడు, పాకిస్థాన్ గగనతలం మూసివేత కారణంగా దేశీయ విమానాలు చాలా కాలంగా లాంగ్ రూట్‌లో (సుదూర మార్గంలో) ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో ఆయా సంస్థలకు ఇంధన, నిర్వహణ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.నష్టాల్లో దిగ్గజాలు: ఈ విపత్కర పరిస్థితుల వల్ల దేశంలోని అతిపెద్ద ఎయిర్‌లైన్స్ అయిన ఇండిగో,

ఎయిరిండియాలకు అత్యధిక నష్టం వాటిల్లుతోంది. దీంతో ఎయిర్‌పోర్టులు విధించే అదనపు ఛార్జీల నుంచి కొంతైనా ఉపశమనం కల్పించాలని ఆ రెండు సంస్థలు ఇటీవల ప్రభుత్వాన్ని గట్టిగా కోరాయి.వీటి విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్రం.. కష్టకాలంలో ఏవియేషన్ రంగాన్ని ఆదుకునేందుకు సకాలంలో ఈ ఛార్జీల తగ్గింపు నిర్ణయం తీసుకుంది.

# తెలంగాణలో ఒంటరి పోరే

హైదరాబాద్, ఏప్రిల్ 10, తెలంగాణలో బీజేపీ ఇక ఒంటరిపోరుకే సిద్ధమవుతుంది. ఎటువంటి పొత్తులకు సిద్ధపడకూడదని నిర్ణయించినట్లు కనపడుతుంది. రానున్న కాలంలో టీడీపీ, జనసేనతో పొత్తు పెట్టుకుంటుందన్న ప్రచారాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు బహిరంగంగానే ఖండించారు. ఆ పొత్తు వల్ల ప్రమాదమే కాని... ప్రయోజనం లేదని తెలంగాణ బీజేపీ నేతలు ఫిక్స్ అయినట్లుంది. మొన్నటి మున్సిపల్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ను ప్రచారానికి రావాలని ఆహ్వానించిన నేతలు తర్వాత మాత్రం ఆ ఆలోచనను విరమించుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో ఎవరితో పొత్తు ఉండదని ప్రకటించారు. దీని వెనకకూడా అదే కారణమని అంటున్నారు. టీడీపీ, జనసేనలకు ఆంధ్రాపార్టీలుగా ముద్ర పడింది. ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ, జనసేన, బీజేపీలు పొత్తులో ఉన్నాయి. అయితే తెలంగాణకు వచ్చే సరికి ఆ పొత్తు పనిచేయదు. కూటమి వికటిస్తుంది. సెంటిమెంట్ అంటుకుంటే అసలుకే మోసం వస్తుంది. అందుకే ఏఎన్నికల్లోనూ టీడీపీ, జనసేనలతో నేరుగా పొత్తు పెట్టుకోకూడదని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ఇదే అభిప్రాయం కేంద్ర నాయకత్వంలోనూ ఉంది.తెలంగాణలో బీజేపీ ఒంటరిగా ఎదుగుతుంది. ఇప్పటికే గతం కంటే బలంగా తయారయింది. అలాంటి సమయంలో అనవసరపు పొత్తులకు వెళ్లి పార్టీని ప్రజల్లో పలుచన చేయకూడదని భావిస్తున్నారు. ఒంటరిగా పోటీ చేసి అధికారంలోకి రావడం పెద్ద కష్టమేమీ కాదని, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల నుంచి అసెంబ్లీ ఎన్నికల వరకూ ఇదే సూత్రాన్ని పాటించాలని రాష్ట్ర నాయకత్వం కేంద్ర నాయకత్వానికి తెలియజెప్పిందని, అందుకు హైకమాండ్ కూడా అంగీకరించిందంటున్నారు. మరొకవైపు టీడీపీ, జనసేన ఓటు బ్యాంకు తమకు టర్న్ అయ్యే అవకాశం కూడా లేదని, పొత్తు పెట్టుకుంటే ఆ ఓట్లు పడకపోగా, పడే ఓట్లు కూడా రావన్నది పార్టీ నేతల అంచనాగా ఉంది.

# తెలంగాణలో 2 లక్షల రేషన్ కార్డుల రద్దు

హైదరాబాద్, ఏప్రిల్ 10, రాష్ట్రంలో రేషన్ కార్డుల అనర్హుల జాబితాను గుర్తించే పనిలో అధికారులు పడ్డారు. విజిలెన్స్ అధికారులు రహస్యంగా ఆడిట్ నిర్వహించగా.. భారీగా అవకతవకలు ఉన్నట్లు తేలింది. దీంతో ఆ రేషన్ కార్డులను రద్దు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. అంతేకాకుండా రేషన్ కార్డు ద్వారా ఇప్పటివరకు పొందిన సబ్సిడీని కూడా రికవరీ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఇప్పుడు రేషన్ కార్డుదారుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.తెలంగాణలో అనర్హులకు 1.40 లక్షల రేషన్ కార్డులను రద్దు చేసినట్లు ఇటీవలె కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బాంభానియా పార్లమెంటుకు చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు రేవంత్ రెడ్డి సర్కార్ కూడా అనర్హులు కలిగి ఉన్న రేషన్ కార్డుల ఏరివేత ప్రక్రియను ముమ్మరంగా చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తెలంగాణ విజిలెన్స్ విభాగం.. గుట్టు చప్పుడు కాకుండా.. రేషన్ కార్డులకు సంబంధించి రహస్య ఆడిట్ నిర్వహించగా అందులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. హైదరాబాద్‌లోనే ఏకంగా 2 లక్షల మంది అనర్హులు రేషన్ కార్డులు కలిగి ఉన్నారని తేలింది.పాన్ కార్డు, గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జీఎస్టీ) నంబర్లను రేషన్ కార్డు డేటాతో విజిలెన్స్ అధికారులు లింక్ చేయగా.. కీలక విషయాలు బయటపడినట్లు తెలుస్తోంది. ఒక్క హైదరాబాద్ నగరంలోనే దాదాపు 2 లక్షల మంది ఆదాయపు పన్ను (ఇన్‌కం ట్యాక్స్) చెల్లించే వారు రేషన్ కార్డులను పొందినట్లు వెల్లడైంది. దీనికి సంబంధించి ఇప్పటికే 80 శాతం వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తయినట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలుస్తోంది. ఐటీ పన్ను చెల్లించేవారు, ప్రభుత్వ ఉద్యోగుల రేషన్ కార్డులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాఫ్ట్‌వేర్‌తో విజిలెన్స్ అధికారులు గుర్తించడం గమనార్హం.మరోవైపు.. అనర్హులుగా తేలిన వారి రేషన్ కార్డులను రద్దు చేయడంపై ఇప్పుడు అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే కేవలం రేషన్ కార్డులను రద్దు చేయడం మాత్రమే కాకుండా వారు పొందిన సబ్సిడీని కూడా తిరిగి వసూలు చేసేలా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు కూడా రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు రేషన్ కార్డులు పొందిన అనర్హుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అధికారంలోకి వచ్చిన తర్వాత భారీగా రేషన్ కార్డులను జారీ చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో పోల్చితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 లక్షల కంటే ఎక్కువ రేషన్ కార్డులు ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవలె గణాంకాలు విడుదల చేసింది. ప్రస్తుతం తెలంగాణలో 17,348 రేషన్ దుకాణాలు ఉండగా.. వాటి నుంచి నెలకు 1.05 కోట్ల రేషన్ కార్డు దారులకు సరుకులు తీసుకుంటున్నట్లు కేంద్రం తెలిపింది. వీటిలో 99,36,073 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు కాగా.. మరో 5,66,660 అంత్యోదయ అన్న యోజన కార్డులు ఉన్నాయని పేర్కొంది. 5146 అన్నపూర్ణ కార్డులు కూడా ఉన్నట్లు కేంద్రం స్పష్టం చేసింది

# పొంచి ఉన్న తాగు నీటి సంక్షోభం

హైదరాబాద్, ఏప్రిల్ 10, తెలంగాణలోని నీటి జలాశయాలు దాదాపు ఎండిపోయే పరిస్థితికి చేరుకున్నాయి. దీంతో హైదరాబాద్ కు నీటిఎద్దడి సమస్య తలెత్తుతుందన్న అలెర్ట్ ఇప్పటికే అందింది. వేసవి కాలంలో నీటి ఎద్దడి మామూలే. గతలో ఎన్నడూ లేని విధంగా ఎండల తీవ్రత ఈ ఏడాది మార్చి నెల నుంచి ఉండటంతో నీటి సరఫరా జలమండలికి కష్టంగా మారింది. మార్చి మొదటి వారం నుంచే ట్యాంకర్లను బుక్ చేసుకుంటున్నారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతుందని చెప్పాలి. మరొకవైపు గతంలో రోజుకు గంట నుంచి రెండు గంటల పాటు వచ్చే నల్లా నీరు ఇప్పుడు అరగంట వచ్చిన తర్వాత సన్నటి ధార వస్తుండటం మంచినీటి ఎద్దడికి ఉదాహరణగా చూడాలి.సాగునీటి సంగతి పక్కన పెడితే తాగు నీటికి కూడా ఈ ఏడాది ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. అందుకే నీటివృధాను అరికట్టాలని జలమండలి అధికారులు ఎప్పటికప్పుడు నగర ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. గతంలో మే నెలలో కొంత నీటి ఎద్దడి ఉండేది. ఈసారి మార్చి నెల నుంచే ప్రారంభమయింది. నీరు వృధా చేసినా, తాగు నీటితో వాహనాలు శుభ్రంచేసినా జరిమానా విధిస్తామని జలమండలి అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు కూడా జలమండలి అధికారులతో సహకరించాల్సి ఉంది. మరొకవైపు భూగర్భ జలాలు ఎండిపోవడంతో నగరంలో అనేకచోట్ల బోర్లు ఎండిపోయాయి. చుక్క నీరు కూడా బోరు నుంచి రాకపోవడంతో ట్యాంకర్లకు వేల రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.నాగార్జునసాగర్ ప్రాజెక్టులో కేవలం 176.06 టీఎంసీలుమాత్రమే ఉన్నాయి. శ్రీశైలం ప్రాజెక్టులో 43.75 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. దాదాపు డెడ్ స్టోరేజీకి ప్రాజెక్టులు చేరుకున్నాయి. శ్రీరాం సాగర్ ప్రాజెక్టులో 28.83 టీఎంసీలు, నిజాం సాగర్ లో 9 టీఎంసీలు, జూరాలలో 9.66 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. కృష్ణా, గోదావరి నదుల్లో కూడా నీరు లేకపోవడంతో ఇక రానున్నకాలంలో హైదరాబాద్ కు తీవ్రమైన నీటి సంక్షోభం పొంచి ఉందన్న హెచ్చరికలు వినపడుతున్నాయి. ఎగువ రాష్ట్రాల్లో వానలు పడితేనే ఏమైనా నీరు వచ్చి జలాశయాలకు చేరుతుంది. కానీ ఇప్పుడు ఆసమస్య లేదు.

మరొకవైపు వచ్చే ఏడాది వర్షపాతం తక్కువగా నమోదవుతాయని భారత వాతావరణ శాఖ చేసిన హెచ్చరికలు కూడా పరిస్థితి తీవ్రతకు మరింత అద్దంపడుతుంది.

మొత్తం మీద చుక్కనీటిని వృధా చేయకుండా ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని కోరుతున్నారు.

# రామనపూడి లో అక్రమ చెరువు తవ్వకాలు?

గుడివాడ పరిసర ప్రాంతాల్లో అక్రమంగా చెరువుల తవ్వకాలు పెరుగుతున్నాయి. నియమ నిబంధనలు పాటించకుండా లోతైన గుంతలను చెరువులుగా మార్చడం వల్ల ప్రజల ప్రాణాలకు తీవ్రమైన ప్రమాదం ఏర్పడుతోంది. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా ఈ సమస్య రోజు రోజుకీ పెరుగుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.ఇటీవల గన్నవరం ప్రాంతంలో జరిగిన విషాద ఘటన అందరినీ కలచివేసింది. చెరువులో మునిగి ముగ్గురు బాలురు ప్రాణాలు కోల్పోవడం స్థానికంగా తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఈ చెరువు కూడా అక్రమంగా తవ్వబడినదేనని స్పష్టం . సరైన హెచ్చరిక బోర్డులు లేకపోవడం, భద్రతా చర్యలు తీసుకోకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని చెబుతున్నారు... అక్రమార్కుల పై కఠిన చర్యలు తీసుకుంటామని నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నోటిమాటగా ప్రకటించారు.. గుడివాడ రామనపూడి చెరువులో రాత్రి పగలు లేకుండా మట్టిని దోచేస్తుండడంతో "ఇంకా ఎంతమంది బలయ్యాక అధికారులు స్పందిస్తారు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.స్థానిక ప్రజలు, ప్రజా సంఘాలు కలిసి అక్రమ తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధ్యులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు..

### వైశాఖి వేడుకలకు రండి

హైదరాబాద్ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ని 'వైశాఖి' వేడుకలకు అమీర్పేట్ గురుద్వారా కమిటీ ఆహ్వానించింది. అమీర్పేట్ గురుద్వారా సాహెబ్ ఆధ్వర్యంలో వచ్చే వారం ఘనంగా నిర్వహించనున్న ఖల్సా సాజన దివస్ - వైశాఖి వేడుకలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ను గురుద్వారా ప్రతినిధులు అహ్వానించారు. వూడుకలకు సంబంధించిన ఆహ్వాన పత్రికను కేటీఆర్కు అందజేసారు.

# సొంత ఇల్లే లేని దీదీ



ముంబై, ఏప్రిల్ 10, వరుసగా మూడుసార్లు హ్యాట్రిక్ విజయం సాధించిన టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ దాదాపు 15 ఏళ్లుగా పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. బెంగాలీలు ఆమెను 'దీదీ (అక్క)' అని పిలుచుకుంటారు. సుదీర్ఘ కాలం నుంచి సీఎంగా ఉన్నా.. ఆమె మాత్రం నిరాడంబర జీవితం గడుపుతారు. నేటి తరం రాజకీయ నాయకులకు భిన్నంగా కాటన్ చీర, భుజాన గుడ్డ సంచి, కాళ్లకు రబ్బరు చెప్పులతో సామాన్యురాలి మాదిరిగానే ఉంటూ ఏంతో ఆదర్శంగా నిలిచారు. తాజాగా, తనకు సొంత ఇల్లు, కారు, కాదు సెంటు భూమి కూడా లేదని బెంగాల్ సీఎం మమతా వెల్లడించడం మరోసారి చర్చనీయాంశంగా మారింది.పశ్చిమ్ బెంగాల్ శాసనసభ ఎన్నికలల్లో భవానీపూర్ నుంచి పోటీ చేస్తున్న మమతా బెనర్జీ నామినేషన్ వేశారు. నామినేషన్ సమయంలో ఎప్పటిలాగే తన ట్రేడ్‌మార్క్ కాటన్ చీర, రబ్బరు చెప్పులతో సాదాసీదాగా వచ్చారు. దీదీ తన ఎన్నికల అఫిడ్‌విట్‌లో ఆస్తులు, అప్పుల వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం తన చేతిలో రూ.75 వేలు, ఇండియన్ బ్యాంక్‌లో తన పేరిట ఉన్న వ్యక్తిగత ఖాతాలో సుమారు రూ.12.4 లక్షలు నగదు ఉన్నట్టు మమతా తెలిపారు. అదే బ్యాంకులోని మరో ఖాతాలో ఎన్నికల ఖర్చుల కోసం రూ.40,000 ఉన్నాయని వెల్లడించారు. మొత్తం బ్యాంకు నిల్వలు దాదాపు రూ.13 లక్షలుగా పేర్కొన్నారు.న వద్ద కేవలం 9.75 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయని, 2021లో వాటి విలువ రూ.88,887గా ఉండేదని, ప్రస్తుతం ధరలు పెరగడంతో రూ.1.75 లక్షలకు చేరింది.స్థిరాస్తుల విషయానికి వస్తే బెంగాల్ ముఖ్యమంత్రికి ఉండటానికి సొంత ఇల్లు లేదు. అలాగే, వ్యవసాయ భూమి, నివాస స్థలాలు, కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని అఫిడవిట్‌లో పొందుపరిచారు. గత ఐదేళ్లలో ఆమె ఆస్తులు తగ్గడం గమనార్హం. ఇక, తన పేర2021లో రూ.16.72లక్షల విలువైన చరాస్తులు ఉన్నట్టు వివరించారు. అలాగే, 2025-26 ఆర్థిక సంవత్సరంలో టీడీఎస్ రిఫండ్ రూ.40,600 వచ్చిందని వెల్లడించారు. ఇక, రాయల్టీలు, బ్యాంక్ వడ్డీలు తన ప్రాథమిక ఆదాయ వనరుగా పేర్కొన్నారు. 2024-25లో దీదీ ఆదాయం రూ.23.21 లక్షలు కాగా.. ఇది 2023-24 కంటే (రూ.20.72 లక్షలు) అధికం. అయితే, మమతా బెనర్జీకి అత్యధికంగా ఆదాయం 2021-22లో రూ.38.14 లక్షలుగా ఉంది.క, కాళీఘాట్‌లోని 30

-ః హరీశ్ చటర్జీ వీధిని తన చిరునామాగా నామినేషన్‌లో దీదీ పేర్కొన్నారు. కానీ, ఆ భవనం ఆమె పేరుతో లేదు. ఇప్పటి వరకు తనకంటూ ఒక సొంత ఇల్లు లేదని ఆమె అఫిడవిట్‌లో పేర్కొనడం గమనార్హం. ఇక, 2021 బెంగాల్ ఎన్నికల సమయంలో ఏడీఆర్ నివేదిక ప్రకారం.. దేశంలోనే పేద ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ నిలిచారు. ఆమె ఆస్తులు కేవలం రూ.15 లక్షలే. 2016లో ఇవి రూ.30 లక్షలుగా ఉన్నాయి.

# కేసీఆర్ వెంట... రెండు సార్లు కేసీఆర్ పై పోటీ..

హైదరాబాద్, ఏప్రిల్ 10, తెలంగాణ రాజకీయాల్లో జీవన్ రెడ్డిది ఓ ప్రత్యేక శైలి. 1983లో మొదటి సారి ఎమ్మెల్యేగా గెలిచినా ఇంకా సొంత నియోజకవర్గానికి మాత్రమే అంటిపెట్టుకుని ఉన్న అరుదైన నేత. అంతే కాదు ఏ కేసీఆర్‌పై రెండు సార్లు పోటీ చేసారో ఇప్పుడు అదే కేసీఆర్ పార్టీలోకి వెళుతుండటం ఆసక్తికర పరిణామం. ఒకప్పుడు ఎవరినైతే ఓడించడానికి తన సర్వశక్తులూ ఒడ్డారో, నేడు అదే నాయకుడి వెనుక నడవడానికి సిద్ధపడ్డారు. జగిత్యాల ప్రజల తలలో నాలుకగా మెదిలి, కాంగ్రెస్ కోటను కాపాడిన తాటిపర్తి జీవన్ రెడ్డి, నేడు గులాబీ కండువా కప్పుకోవడం వెనుక రాజకీయ అవసరాలకు మించిన ఆత్మగౌరవం, అసంతృప్తి దాగి ఉన్నాయి.తెలుగు రాష్ట్రాల రాజకీయాలు తెలిసిన ఎవరికైనా జీవన్ రెడ్డి పేరు సుపరిచితం. నేటి ధిగ్గజనేతలు కేసీఆర్, చంద్రబాబు సమకాలికుడే కాదు, 1983లోనే ఎమ్మెల్యే.. యువ మంత్రి, ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. పలు పర్యాయాలు ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ గడ్డుకాలంలో చాలా సందర్భాల్లో జీవన్ రెడ్డి గెలిచి తన ప్రత్యేకత చాటుకున్నారు. అంతే కాదు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసిపడుతున్న వేళ కేసీఆర్ సెంటిమెంటును కొనసాగించేందుకు రాజీనామాలు, ఉపఎన్నికల ఎత్తుగడలు వేసేవారు అలా 2006, 2008 కరీంనగర్ లోక్‌సభ ఉపఎన్నికల్లో కేసీఆర్ పై కాంగ్రెస్ తరఫున పోటీకి నిలిచారు. మొదటిసారి రెండు లక్షల ఓట్లతో కేసీఆర్ గెలిచినా.. 2008లో మాత్రం వైఎస్ సహకారంతో జీవన్ రెడ్డి కేసీఆర్ కు ముచ్చెమటలు పట్టించారు. కరీంనగర్ లో తనకు ఎదురు లేదనుకున్న గులాబీ నేతను దాదాపు ఓటమి అంచులదాకా నెట్టి కేవలం 15వేల మెజారిటీ మాత్రమే ఇచ్చారు. కానీ, కాలక్రమేణా పరిస్థితులు మారాయి. నేడు అదే కేసీఆర్ నాయకత్వాన్ని కీర్తిస్తూ, "ప్రజలు కోరిన దానికంటే ఎక్కువే చేసిన ఏకైక నాయకుడు కేసీఆర్" అని జీవన్ రెడ్డి కీర్తించే దాకా పరిణామాలు మారాయి. శత్రువు నుంచి మిత్రుడిగా మారిన ఈ ప్రస్థానం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది.జీవన్ రెడ్డి అంటే సంప్రదాయ రాజకీయ నాయకత్వానికి ఉదాహరణ. ఆయన ఇల్లు, ఆఫీసు చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. ఆధునిక కార్పొరేట్ రాజకీయాల హంగులు ఆయన దరిచేరలేదు. ఆయన ఆఫీసు డెస్కు దశాబ్దాల నాటి పాత శైలిలో ఉంటుంది. అత్యంత సాధారణంగా ఉండే ఆ గదిలోనే వేల మందిని ప్రతిరోజూ కలుస్తుంటారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసినా ఆయన జీవనశైలి మారలేదు. కార్యకర్తలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే 'ఓపెన్ డోర్' పాలసీ ఆయనది. గల్ఫ్ బాధితులైనా, స్థానిక పేదలైనా ఆయన వద్దకు వెళ్లి కష్టాలు తీర్చమని అడుగుతారు. ఇంటికి వచ్చిన వారికి పప్పు, పచ్చిపులుసు, మామిడికాయ తొక్కుతో 'సింపుల్ లంగర్' దశాబ్దాలుగా వడ్డిస్తున్నారు. వైఎస్ హయాంలో అత్యధిక సీఎం రిలీఫ్ ఫండ్ సాధించుకున్న నేత కూడా జీవన్ రెడ్డి గారే. కాంగ్రెస్ నాయకులకు ఢిల్లీ పర్యటనలు, 10 జనపథ్ అపాయింట్‌మెంట్ కోసం పడిగాపులు సర్వసాధారణం. కానీ, జీవన్ రెడ్డి శైలి వేరు. ఆయన ఎన్నడూ పదవుల కోసం ఢిల్లీ వీధుల్లో లాబీయింగ్ చేయలేదు. తనకు పదవి రావాలన్నా, పోవాలన్నా అది తన పనితీరు మీద ఆధారపడాలే తప్ప హైకమాండ్ ప్రదక్షిణల వల్ల కాదన్నది ఆయన నమ్మకం. తన నియోజకవర్గమే ఢిల్లీ, ప్రజలే హైకమాండ్ అన్నట్లుగా సాగుతారు. ఇప్పుడు రేవంత్ తో వైరం కూడా ఆ ఆత్మగౌరవ ప్రతిష్టతోనే వచ్చిందని చెబుతారు. 42 ఏళ్ల పాటు పార్టీతో నడిచి నేడు వీడటానికి జీవన్ రెడ్డి చెప్పిన కారణాలు రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలో పడేశాయి. "తెలంగాణ ప్రజలు మార్పు కోసం ఆశపడి ఓటేశారు, కానీ నేడు నిరాశకు గురవుతున్నారు" అని ఆయన చేసిన విమర్శలు చాలా ఘాటైనవి. ఫిరాయింపుల రాజకీయాలను ప్రోత్సహించడం, సీనియర్లకు గౌరవం ఇవ్వకపోవడం వంటి అంశాలు ఆయన ఆత్మగౌరవాన్ని దెబ్బతీశాయి. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు 2014లో ఒంటరి పోరాటం చేసి గెలిచిన తనకు, నేడు సొంత పార్టీలోనే గుర్తింపు కరువైందన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.జీవన్ రెడ్డిని కాంగ్రెస్ ఎప్పుడూ గౌరవించింది. 2018లో ఓడిపోతే ఎమ్మెల్సీని చేసింది.

అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో మంత్రిని చేసింది. మొత్తం 14 సార్లు జీవన్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇచ్చింది. బుజ్జగించేందుకు జాతీయ నేతలు, పీసీసీ అధ్యక్షులతో సహ అందరూ ఆయన ఇంటికి వెళ్లి కాంగ్రెస్ లో కొనసాగాలని కోరారు. కేవలం ఒకరితో ఆభిజాత్యానికి పోయి తల్లిలాంటి పార్టీని వీడటం సరికాదని తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ఇప్పుడు బీఆర్ఎస్ లాంటి కుటుంబ పార్టీలోకి వెళ్తే కేసీఆర్ ప్రేమలు ఎప్పటికీ ఉండవని హెచ్చరిస్తున్నారు.జగిత్యాల గడ్డపై తనకంటూ ఒక ముద్ర వేసుకున్న జీవన్ రెడ్డి, ఇప్పుడు కేసీఆర్ గూటికి చేరబోతున్న నేపథ్యంలో.. ఉత్తర తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు మారతాయా. రాజకీయం అంటే కేవలం అధికారమే కాదు, ఆత్మగౌరవంతో కూడిన ప్రయాణం అని జీవన్ రెడ్డి చెప్పకనే చెబుతున్నారు. బిఆర్ఎస్‌లో ఆయన ప్రస్థానం ఎలా సాగుతుందో.. తన కోడలికి రాజకీయ వారసత్వం అప్పగించి వానప్రస్తంలోకి జారుకుంటారో చూడాలి!

# స్టీల్ బ్యాంక్...
# ప్లాస్టిక్ రహిత గ్రామంగా ఆదర్శం

నిజామాబాద్, ఏప్రిల్ 10, సోషల్ మీడియాను తెగ తిడుతుంటాం. అందర్నీ పాడు చేస్తోందని. కానీ కోవిడ్ లాంటి సమయాల్లో, లేదా క్లిష్టమైన సమయాల్లో సోషల్ మీడియానే ప్రముఖ పాత్ర పోషించింది. అనేక ముఖ్యమైన సమాచారాలు, ఆరోగ్య సమాచారాలు, ఇతరులకు సేవ చేసే విషయాలు ఈ వేదిక ద్వారానే ప్రపంచానికి తెలిసాయి.అంతేకాకుండా చాలా మంచి మంచి విషయాలను కూడా సోషల్ మీడియా సమాజం ముందుకు తెస్తుంది. దీంతో సమాజానికి చాలా మేలు చేకూరుతుంది. తాజాగా ఇలాంటి ఓ వార్తే సోషల్ మీడియాలో వచ్చింది. దీంతో ఊరు ఊరంతా మారిపోయింది. పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించింది ఆ గ్రామం. గ్రామంలో ఇంతటి మార్పుకు కారణమైంది మన సోషల్ మీడియానే. ఇదంతా జరిగింది బాసర సమీపంలోని గుండంపల్లి గ్రామం.ఈ రోజుల్లో ప్రతిదీ ప్లాస్టిక్ అయ్యింది. దీంతో కాన్సర్ కి కారణం అవుతోంది. ఏ ఫంక్షన్ జరిగినా, చిన్న కార్యక్రమం జరిగినా.. ప్రయాస పడకూడదని ప్లాస్టిక్ విస్తళ్లు, ప్లాస్టిక్ గ్లాసులను ఆర్డర్ ఇచ్చేస్తున్నారు. వాడేస్తున్నారు, పాడేస్తున్నారు. దీంతో మనుషులకు కేన్సర్ లాంటి రోగాలు రావడంతో పాటు వాటిని తిన్న పశువులు కూడా తీవ్ర అనారోగ్యానికి బలి అవుతున్నాయి.ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా తెలుసుకున్న గుండంపల్లి గ్రామస్థులు అలర్ట్ అయ్యారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 500 స్టీల్ ప్లేట్లు, గ్లాసులతో "స్టీల్ బ్యాంకు"ను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలో జరిగే ప్రతి శుభకార్యంలోనూ వీటినే ఉపయోగిస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ వాడకం తగ్గింది. పర్యావరణ పరిరక్షణలో ఇదో కీలక అడుగుగా భావిస్తున్నారు. శుభ కార్యాల్లో ఇందులోనే తిని, వాటిని ప్రజలే శుభ్రం చేసి, తిరిగి ఇచ్చేస్తున్నారు.అలాగే అనుమతి లేకుండా తమ గ్రామంలో విక్రయిస్తున్న ఐస్ క్రీమ్ లపై కూడా అలర్ట్ అయ్యారు గ్రామస్థులు. వాటిని తమ గ్రామంలోకి అనుమతించకూడదని ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. గ్రామ సరిహద్దుల్లోనే ఇలాంటి వాటిని అడ్డుకుంటున్నారు. ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను వాడొద్దని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారుగుండంపల్లి గ్రామస్థులందరూ ఐకమత్యంతో స్టీల్ ప్లేట్ల వాడకం, పర్యావరణాన్ని కాపాడలన్న నిర్ణయం తీసుకోవడంతో రాష్ట్రానికి దిక్సూచిగా మారారు. వీరు తీసుకున్న నిర్ణయాన్ని అందరూ ప్రశంసిస్తున్నారు. ఏ ప్రభుత్వ అధికారులు చెప్పకపోయినా, స్వచ్ఛందంగా, ప్రకృతిపై వున్న మమకారంతో, తమ ఆరోగ్యం విషయంలో తీసుకునే శ్రద్ధ కారణంగా, అవగాహన కారణంగా ఈ విజయం వరించింది. అలాగే ప్రతి ఇంటి నుంచి కూడా సహకారం లభించడంతో విజయం సాధించారు.ప్రజల్లో చైతన్యం పెరిగితే మార్పు దానంతట అదే వస్తుందని మరోసారి నిరూపితమైంది.ఒక గ్రామంలో 500 స్టీల్ ప్లేట్లు 20 కార్యక్రమాల్లో వాడితే? 10,000 ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం తగ్గినట్టే. అదే ప్రతి గ్రామం చేస్తే? పర్యావరణానికి ఎంత మేలు జరుగుతుందో ఊహించండి.

# 2028 నాటికి జిల్లాల పునరవ్యవస్థీకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 10, రాష్ట్రంలో పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమా? లేక రాజకీయంగా పట్టు సాధించడమా? కారణం ఏదైనా తెలంగాణలో జిల్లాల సరిహద్దుల మార్పు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. గత ప్రభుత్వం (బీఆర్ఎస్) చేసిన జిల్లాల విభజనలో లోపాలున్నాయని, శాస్త్రీయత లేదని భావించిన కాంగ్రెస్ సర్కార్, ఇప్పుడు సర్జరీకి సిద్ధమైంది. ఈ మార్పులు కేవలం భౌగోళిక సరిహద్దులకే పరిమితమా? లేక కొత్త జిల్లాల ఏర్పాటుకు దారితీస్తాయా? అన్నది ఆసక్తికరంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన విభజనలో కొన్ని ప్రాంతాలను తమ రాజకీయ ప్రయోజనాల కోసం కలిపారని, దీనివల్ల ప్రజలకు దూరాభారం పెరిగిందని ప్రస్తుత ప్రభుత్వం భావిస్తోంది. రేవంత్ రెడ్డి వ్యూహం ప్రకారం.. కేవలం జిల్లాల సంఖ్యను పెంచడం కాకుండా, భౌగోళికంగా, పరిపాలనా పరంగా ప్రజలకు దగ్గరగా ఉండేలా సరిహద్దులను సవరించడమే ప్రధాన లక్ష్యం. ఇప్పటికే ఐఏఎస్ అధికారుల నుంచి నివేదికలు తెప్పించుకున్న ప్రభుత్వం, ఏ ఏ జిల్లాలను విడగొట్టాలి లేదా ఏ ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలపాలి అనే అంశంపై ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు తెలుస్తోంది.ప్రస్తుతం దేశవ్యాప్తంగా జనగణన ప్రక్రియ ప్రారంభం కావడంతో, నిబంధనల ప్రకారం.. జిల్లాల సరిహద్దులను మార్చడానికి వీలులేదు. ఈ ప్రక్రియ 2028 చివరి నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం తన పదవీకాలం ముగిసేలోగా ఈ భారీ ఆపరేషన్ పూర్తి చేయాలని చూస్తోంది. దీనివల్ల రాబోయే అసెంబ్లీ ఎన్నికల నాటికి కొత్త జిల్లాల సెంటిమెంట్, ప్రజల ఆకాంక్షలను తమకు అనుకూలంగా మార్చుకోవచ్చనేది రాజకీయ వ్యూహం.కేవలం జిల్లాల సరిహద్దుల మార్పు మాత్రమే కాకుండా, భవిష్యత్తులో జరగబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను కూడా దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఈ అడుగులు వేస్తున్నట్లు సమాచారం. జిల్లా కేంద్రానికి, నియోజకవర్గ కేంద్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయికి వేగంగా చేరుతాయని ప్రభుత్వం వాదిస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాల సెంటిమెంట్‌ను గౌరవిస్తూనే, పరిపాలనలో వస్తున్న ఇబ్బందులను తొలగించడం ద్వారా ఓటర్లను ఆకట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. జిల్లాల పునర్విభజన అనేది ఎప్పుడూ ఒక డబుల్ ఎడ్జ్ స్వార్డ్ (రెండంచుల కత్తి) లాంటిదే. ఒక ప్రాంతాన్ని జిల్లాగా ప్రకటించినప్పుడు వచ్చే మైలేజీ కంటే, కీలకమైన ప్రాంతాలను పక్క జిల్లాల్లో కలిపినప్పుడు వచ్చే వ్యతిరేకత ఎక్కువగా ఉంటుంది. అందుకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈసారి అనాలోచితంగా కాకుండా, ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టి, అఖిలపక్ష సమావేశాల ద్వారా ఏకాభిప్రాయం సాధించాలని చూస్తోంది. ఏది ఏమైనా, 2028 నాటికి తెలంగాణ రాజకీయ చిత్రపటం మరోసారి మారడం ఖాయంగా కనిపిస్తోంది.

# సైడ్ పార్టీని పట్టుకున్న కవిత వ్యూహం ఏంటి..?



హైదరాబాద్, ఏప్రిల్ 10, రాజకీయం అంటేనే ఎత్తుగడలు.. మరీ ముఖ్యంగా సొంత గూడు వదిలి బయటకు వచ్చిన నేతలు వేసే అడుగులు చదరంగంలో ఎత్తుల కంటే వేగంగా మారుతుంటాయి. ఈ నెలలోనే ఎజెండాను ప్రకటిస్తానని చెబుతున్న మాజీ ఎంపీ కవిత ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నారు. సహజంగా కొత్త పార్టీ పెడితే అధికార పక్షాన్ని టార్గెట్ చేయడం ఆనవాయితీ.. కానీ, కవిత మాత్రం దీనికి భిన్నంగా వెళ్తున్నారు. అధికార కాంగ్రెస్‌ను కాదని, బలహీనపడ్డ 'కారు' (బీఆర్ఎస్) వెంటే ఆమె ఎందుకు పడుతున్నారు..? ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లెక్కలేంటో చూద్దాం. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదన్న వాదన బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక ఐకాన్ లీడర్‌గా ఎదిగారు. ఆయన ఇమేజ్ మరోసారి పార్టీని అధికారంలోకి తెస్తుందన్న విశ్వాసం ప్రజల్లో ఉంది. ఇలాంటి సమయంలో బలంగా ఉన్న రేవంత్ రెడ్డిని కదిపితే అనవసరమైన ఇబ్బందులు తప్ప ప్రయోజనం ఉండదని కవిత భావిస్తున్నట్లు తెలుస్తోంది. అందుకే రేవంత్ రెడ్డి జోలికి వెళ్లకుండా, తన రాజకీయ భవిష్యత్తు కోసం మరో మార్గాన్ని ఎంచుకున్నారు. అదే కారు పార్టీని కంగారు పెట్టడం. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఎన్నో ప్రాజెక్టులు, పథకాలు ప్రవేశపెట్టినప్పటికీ.. కుటుంబ పాలన, అవినీతి ఆరోపణలు ఆ పార్టీని దెబ్బతీశాయి. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. ఇప్పుడు బీఆర్ఎస్‌లో నాయకత్వ లేమి, అంతర్గత కలహాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం కావడం, కేటీఆర్–హరీష్ రావు మధ్య విభేదాల వాదనలు వినిపిస్తుండడంతో ఆ పార్టీ క్యాడర్ అయోమయంలో ఉంది. ఈ అనిశ్చిత వాతావరణమే తనకు అనుకూలమని కవిత అంచనా వేస్తున్నారు.ఓటు బ్యాంకు బీఆర్ఎస్ పార్టీకి క్షేత్ర స్థాయిలో ఇప్పటికీ బలమైన కేడర్ ఉంది. ఆ కేడర్ ఇప్పుడు నిరుత్సాహంలో ఉండడంతో, వారిని తన వైపు తిప్పుకోవాలన్నది కవిత పక్కా ప్లాన్. బీజేపీకి నాయకులు ఉన్నా క్షేత్ర స్థాయి ఓటు బ్యాంకు తక్కువగా ఉండడంతో, ఆమె దృష్టి అంతా బీఆర్ఎస్ కేడర్‌పైనే ఉంది. 'కారు'లోని అసంతృప్త నేతలను, నాయకత్వం కోసం వెతుకుతున్న కార్యకర్తలను చేరదీయడం ద్వారా తన కొత్త పార్టీని బలోపేతం చేసుకోవాలని వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రులు ఉండరన్నది జగమెరిగిన సత్యం. నిన్నటి వరకు అదే పార్టీలో ఉండి, ఇప్పుడు అదే పార్టీ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలని చూడడం రాజకీయ చదరంగంలో ఒక భాగమే. కవిత వేస్తున్న ఈ 'రివర్స్ వ్యూహం' ఎంత వరకు ఫలమిస్తుంది..? కేసీఆర్ నిర్మించిన కోటలో ఆమె చీలిక తీసుకురాగలదా? అన్నది ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్కంఠను రేకెత్తిస్తోంది. ఈ నెల 25న కవిత ప్రకటించబోయే జెండా, అజెండాలో బీఆర్ఎస్ పార్టీకి సంబంధించి ఎలాంటి అంశాలు ఉంటాయన్నది కీలకం. కాంగ్రెస్‌ను కాదని బీఆర్ఎస్‌ను టార్గెట్ చేయడం ద్వారా ఆమె తెలంగాణ రాజకీయ చిత్రపటాన్ని మార్చాలని చూస్తున్నారు. ఒకవేళ బీఆర్ఎస్ కేడర్ ఆమె వైపు మొగ్గు చూపితే, రాష్ట్రంలో విపక్ష హోదా కోసం సరికొత్త పోరాటం మొదలవుతుంది. ఏదేమైనా కవిత వేస్తున్న ఈ ఎత్తుగడలు గులాబీ శ్రేణుల్లో మాత్రం గుబులు పుట్టిస్తున్నాయి.

# జీవన్ రెడ్డి ఎమోషనల్ గా నిర్ణయం తీసుకున్నారు

హైదరాబాద్ జగిత్యాల మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీని వీడడం తొందర పాటు చర్య అని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. అయన పార్టీ విడకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చివరి వరకు ప్రయత్నం చేశారు. తర్వాత విడతలో రాజ్యసభ ఇచ్చే ఆలోచన ముఖ్యమంత్రి ఉన్నాడు. ఓపికగా ఉండకూడ బీఆర్ఎస్ లో చేరి జీవన్ రెడ్డి ఎమోషనల్ గా నిర్ణయం తీసుకున్నారు. పార్టీ సీనియర్ నేతగా ఎంతో సేవ చేశాడు... పార్టీ వీడటం బాధాకరమనిఅన్నారు.

# బ్లాక్ స్పాట్ లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ శుక్రవారం ఎన్ హెచ్ ? 65 పై బ్లాక్ స్పాట్స్ పరిశీలించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని కేతనకొండ గ్రామానికి బస్సు యాత్ర చేరుకుంది. జిల్లా ప్రభుత్వ అధికారులతో కలిసి కేతనకొండ, ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, వారధి, ఎనికేపాడు 24కే కల్యాణ మండపం వరకు ప్రత్యక్షంగా పరిశీలించి మొత్తం 28 బ్లాక్ స్పాట్స్ (రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలు)ను గుర్తించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగు సూచనలు, చర్యలు చేపట్టనున్నారు. ఎన్ హెచ్ ? 65 పై ఇబ్రహీంపట్నంలో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

# కాంగ్రెస్ నేతల భూకబ్జాపై బీఆర్ఎస్ పిర్యాదు

హైదరాబాద్ రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయానికి మాజీ మంత్రి సబిత ఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రావణ్, వాణిదేవి,మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అంజయ్య , పట్నం నరేందర్ రెడ్డి చేరుకున్నారు. నాదర్గుల్ 373 ఎకరాల ప్రభుత్వ భూముల అన్యకాంతం విషయంపై అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి కి పిర్యాదు చేసారు. సర్వే నంబర్ 673 లో వున్న పోలాలను కాంగ్రెస్ పార్టీకి సంబంధిన మంత్రి బౌన్సర్లు గుండాలను అడ్డం పెట్టుకొని కబ్జాలు చేస్తున్నారు. ల్యాండ్ సీలింగ్ యాక్ట్ పరంగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న కాంగ్రెస్ నేతలపై చర్యలు తీసుకోవాలి. చుట్టూరా రేకులతో బార్కండ్లు నిర్మించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పిర్యాదు చేసారు. కోర్టులకు సంబంధించిన భూములలో రైతులకు సంబంధిన బోర్లను పగలకొట్టడం, వ్యవసాయం చేసుకొనే రైతులను కొట్టి బయటికి పంపడం కాంగ్రెస్ నాయకులు ఎలా చేస్తారు. ప్రభుత్వ భూములలో కాంగ్రెస్ నాయకులు అక్రమ షెడ్లు వేస్తుంటే అధికారుల చర్యలు ఉండవా...? స్థానిక ఆర్డీఓ కి పిర్యాదు చేస్తే కనీసం కట్టించుకోలేదు. కోట్ల రూపాయల ప్రభుత్వ భూములను కాపాడటానికి అధికారులు చర్యలు తీసుకోవాలనీ డిమాండ్ చేసారు.

# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్

హైదరాబాద్ హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రౌడీ షీటర్లపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. నగరంలో పలు చోట్ల రౌడీల ఆగడాలు మితిమీరిపోతున్నారు. ఈ నేపథ్యంలో నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్లో ప్రస్తుతం 1300 మందికి పైగా రౌడీ షీటర్లు ఉండగా 250 మందికి పైగా డ్రగ్ టెస్టులను నిర్వహించారు. ఇందులో 190 మందికి గంజాయి పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు నిర్ధారించారు. ఎవరైనా గంజాయి సరఫరా చేసినా కొనుగోలు చేసిన కఠిన చర్యలు తీసుకుటామని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు గంజాయి బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు.

# స్కూల్ బస్సులు అగ్నికి ఆహుతి



కమలాపురం మండల పరిధిలోని కోగటం గ్రామంలో ఊరి బయట నైట్ హాల్ట్ కొరకు పెట్టుకున్న వివిధ స్కూల్, కాలేజ్ లకు చెందిన మూడు వాహనాలు గురువారం అర్ధరాత్రి సమయంలో మంటలు చెలరేగి కాలిపోయాయి.

సమాచారం అందుకున్న కమలాపురం పోలీసులు, ఫైర్ సిబ్బంది వెళ్లి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

ఈ ఘటనలో గీతాంజలి హై స్కూల్, ఐడియల్ పబ్లిక్ స్కూల్,. గోపికృష్ణ మాంటెస్సోరి హై స్కూల్ వాహనాలు దగ్ధం అయ్యాయి. మంటలకు గల కారణాలు తెలియరాలేదు.

# యోగాతో మెరగైన ఆరోగ్యం

వికారాబాద్ ప్రతి రోజు జీవితంలో యోగ చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఆరోగ్యం మెరుగుపడుతుందని జిల్లా జడ్ పి సి ఇ ఓ సుధీర్ తెలిపారు. నేడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో బాగంగా అంతర్జాతీయ హ్వామియోపతీ డే సందర్భంగా ఆయుష్ అధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమం లో పాల్గొన్నారు.

ఈ సందర్బంగా సుధీర్ మాట్లాడుతూ యోగ అనేది శారీరక, మానసిక మరియు ఆధ్యాత్మిక ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన సాధనంగా గుర్తించబడిందని, రోజువారీ జీవితంలో యోగాను అలవాటు చేసుకోవడం ద్వారా ఒత్తిడి తగ్గి, శరీరానికి శక్తి మరియు మనసుకు ప్రశాంతత లభిస్తాయని, యోగా మన శరీరానికి, మనసుకు సమతుల్యతను అందించే సాధనమని తెలిపారు. యోగా సాధన ద్వారా జీవనశైలిలో మార్పు వస్తుందని, అనేక వ్యాధులను నివారించుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు మరియు వృద్ధులు యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.

ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం లక్ష్యంగా యోగా సాధనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా యోగా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అనంతరము కల్లెక్ట్రేట్ కార్యాలయ ఆవరణలో అంతర్జాతీయ హ్వామియోపతీ డే రోజు శ్యామియోల్ హనిమ్యాన్ జన్మ దినం ఉనందున అయన చిత్ర పటానికి పులా మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వర్ణ కుమారి , మిషన్ భగిరథ రవి కుమార్ , బి సి వెల్ఫేర్ అధికారి మాధవ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ విక్రమ సింహ రెడ్డి , అయుష్ ఇంచార్జి అధికారి డాక్టర్ సునీత,డి పి ఏం వంశి ,ట్రైనర్స్ సంధ్య , రాజేష్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కజొన్న రైతులకు మద్దతుగా ప్రజా ప్రభుత్వం..

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి..

## మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



జగిత్యాల రబీ సీజన్ లో రైతులు పండించిన మొక్కజొన్న పంటకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం డీసీ ఎంఎస్ ల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ధర్మపురి వ్యవసాయ మార్కెట్ లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రైతులు ధర్మపురి నియోజకవర్గంలో 25శాతం అధికంగా మొక్కజొన్న సాగు చేశారని అన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని ధర్మపురి, వెల్గటూర్, బుగ్గారం, గొల్లపల్లి, పెగడపల్లి మరియు ఎండపల్లి మండలాల్లో సీజన్ లో 4898 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశారని మంత్రి తెలిపారు. ఆరు మండలాల్లో సుమారుగా 1.46 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారని మంత్రి తెలిపారు. రైతులు పెద్ద ఎత్తున పంట సాగు చేసిన నేపథ్యంలో రైతులకు మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వం మెక్కజోన్నల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రైతులు పండించిన పంటను దళారులు క్వింటాలుకు రూ. 1600 మాత్రమే చెల్లించి కొనుగోలు చేస్తున్నారని మంత్రి వివరించారు. రైతులకు మద్దతు ధర అందించాలని ప్రజా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తుందని మంత్రి తెలిపారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్నలు విక్రయించి క్వింటాలుకు రూ. 2400 మద్దతు ధర పొందాలని మంత్రి కోరారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏనాడు రైతుల సమస్యలు పట్టించుకోలేదని మంత్రి అన్నారు. ధాన్యం కొనుగోలు లో క్వింటాల్ కు నాలుగు కిలోల కోత విధించారని మంత్రి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గడిచిన రెండు సంవత్సరాలుగా ఎలాంటి కోత లేకుండా రైతులు పండించిన పూర్తి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ ధర్మపురి మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

తాండూరు.. శ్రీ భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు 3 వరోజు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షులు మేడి మహేష్ కుమార్, దేవాలయ ఈవో శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో జరుగుతున్న శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు లో, భద్రేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి పల్లకి సేవను వైభవంగా నిర్వహించారు. రాత్రి 11 గంటల తర్వాత ప్రారంభమైన ఈ పల్లకి సేవ గంజ్ లోకి వెళ్ళి అర్ధరాత్రి రెండు గంటలు దాటే వరకు భక్తిరసంతో కొనసాగింది. పల్లకి సేవకు ముందు భజనలు, ఆటపాటలు మరియు బొమ్మల కొలను తో వాతావరణం భక్తిమయంగా మారింది. పురంతాయాల ఆటపాటలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఈ వేడుకల్లో వీరశైవ సమాజం సభ్యులు, పట్టణ ప్రముఖులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి ఘన స్వాగతం పలికారు. నగరేశ్వర భజన మండలి, వీరశైవ సమాజం, ఆర్యవైశ్య సమాజం సభ్యులు అడుగడుగునా అల్పాహారాలు ఏర్పాటు చేసి భక్తులకు అందించారు.

# పాతబస్తీలో కార్డన్ అండ్ సెర్చ్

హైదరాబాద్ చార్మినార్ జోన్ డీసీపీ, జోన్ అధికారులతో కలిసి భవానీ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డెన్ సెర్చ్ మరియు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్డెన్ సెర్చ్ మరియు కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో చార్మినార్ జోన్ అధికారులు అందరూ పాల్గొన్నారు. కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ సమయంలో పోలీసులు నంబర్ ప్లేట్లు లేని 69 వాహనాలను స్వాధీనం చేసుకుని, గన్నా నసీర్తో సహా భవానీ నగర్కు చెందిన 6 మంది రౌడీ షెటార్లను అరెస్టు చేశారు. ఈ ఆపరేషన్లో భవానీ నగర్ పోలీసులు 11 మంది అనుమానిత రౌడీ షీటర్లను పట్టుకున్నారు. సోదాల సమయంలో పోలీసులకు పీడీఎస్ బియ్యం గోడౌన్ గురించి సమాచారం అందింది. వెంటనే వారు తలబ్కట్టా ప్రాంతంలో దాడులు చేసి, నిందితుల వద్ద నుండి 10 పీడీఎస్ బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, తలబ్కట్టాలోని అమన్ నగర్ నివాసి, 25 ఏళ్ల మహమ్మద్ హాజీ అనే వ్యక్తిని అరెస్టు చేశారు.

# హిందూ సమ్మేళనానికి భారీగా తరలి రావాలి

మల్లాపూర్ మండల కేంద్రం లో శుక్రవారం భరత మాత కూడలి వద్ద సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు పెద్ద ఎత్తున నిర్వహించే హిందూ సమ్మేళన కార్యక్రమం కు ప్రజలు భారీ సంఖ్య లో హాజరు కాగలరని మల్లాపూర్ మేజర్ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి మరియు ఉప సర్పంచ్ సోమ రెడ్డి సంయుక్తం గా గ్రామస్థులను ఆహ్వానించారు. మహిళలు మంగళ హారతులతో కార్యక్రమం కు రావాలని కోరారు.భారీ సంఖ్య లో మల్లాపూర్ ప్రజలు హాజరయి ఈ హిందూ సమ్మేళనం విజయవంతం చేయగలరని కోరారు.సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి ఎర్ర భూమయ్య ఎగ్యారపు వెంకటేశ్వర్లు కాసారాపు భూమ రెడ్డి కళ్లెం మహిపాల్ రెడ్డి నూతిపెల్లి రాజం వార్డు సభ్యులు ముష్కరి రమేష్ మాసీట్ల గంగ నర్సయ్య ముద్దం శ్రీధర్ సాంబారి శంకర్ గజ్జెటీ నర్సయ్య గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు స్టేషన్ చేరిన పిల్లి లొల్లి

లాలాగూడ: పిల్లిపోరు ఓ సీఐ మెడకు చుట్టుకున్నట్లైంది. దొంగలించిన పిల్లిని తెచ్చివ్వాలంటూ ఓ వ్యక్తిపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అయితే తన చేయి కరిచి పరారైందని సదరు వ్యక్తి పోలీసుల ఎదుట వాపోవడంతో లాలాగూడ సీఐకి ఎటూ తేల్చుకోలేని పరిస్థితి ఎదురైంది. వివరాల్లోకి వెళితే.. లాలాగూడలో ఓ ఇంటి ముందు ఉన్న ఓ పెంపుడు పిల్లిని బైక్పై మొక్కలు విక్రయించుకునే వ్యక్తి తస్కరించేందుకు ప్రయత్నించాడు. అయితే ఆ పిల్లి అతని చేతిని కొరికి పారిపోయింది. కాసేపటికి ఇంటి యజమానురాలికి పిల్లి కనిపించకపోవడంతో సీసీ ఫుటేజీలను పరిశీలించింది. పిల్లిని ఎత్తుకెళ్లిన వ్యక్తిని బైకు నంబరు ఆధారంగా గుర్తించి లాలాగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎట్టకేలకు చింతల్లో ఉంటున్న ఆ వ్యక్తిని పట్టుకు న్నారు. సీఐ బాధితురాలిని, పిల్లిని ఎత్తుకెళ్లిన వ్యక్తిని అరగంట పాటు విచారించారు. అయితే, బాధితురాలు తన పిల్లిని తనకు తెచ్చివ్వాలని సదరు వ్యక్తిపై కోపంతో ఊగిపోయింది. పిల్లి చక్కగా కనిపించడంతో దగ్గరకు తీసుకునే ప్రయత్నం చేస్తే, అది తన చేతిని కొరికి పారిపోయిందని, తాను ఎక్కడి నుంచి తేవాలంటూ అతను వాదించాడు. ఎంతకీ విషయం కొలిక్కి రాకపోవడంతో సీఐ తల పట్టుకున్నారు. చివరికి సీఐ గదిలోనే తనను మన్నించాలంటూ మొక్కలు విక్రయించే వ్యక్తి బాధితురాలి కాళ్లు మొక్కేందుకు ప్రయత్నించాడు. సీఐ ఇద్దరికీ సర్ది చెప్పి సదరు వ్యక్తికి వార్నింగ్ ఇచ్చి పంపేశారు.

# నిరవధిక సమ్మెలోకి ఆర్టిజన్లు

**స్వచ్ఛందంగా విధుల బహిష్కరణ**

**సర్కిల్, డివిజన్ ఆఫీసుల ఎదుట దీక్షలు**

**మద్దతిచ్చిన కార్మిక, ఇంజినీర్ల సంఘాలు**

**రెగ్యులర్ చేయాలని కార్మికుల డిమాండ్**

**సమ్మెతో థర్మల్ ప్లాంట్లపై తీవ్ర ప్రభావం**

విద్యుత్తు సంస్థల్లో పనిచేసే కార్మికులు.రెగ్యులరైజ్ సహా ఆర డిమాండ్లు సాధించుకునేందుకు కార్మికు లు నిరవధిక సమ్మెకు దిగి జంగ్ సైరన్ మోగించారు. మూడవ వరోజు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కార్మికులు స్వచ్ఛందంగా విధుల ను బహిష్కరించారు. విద్యుత్తు ఉత్పత్తి కేంద్రా లు, సర్కిల్, డివిజన్ కార్యాలయాల ఎదుట దీక్షల్లో పాల్గొన్నారు. ట్రాన్స్కో, జెన్కో, ఉత్తర డిస్కమ్, దక్షిణ డిస్కమ్లో పనిచేసే కార్మికులు ఎక్కడికక్కడ ఆందోళనలకు దిగారు. తొమ్మిది కార్మిక సంఘాలు ఏకమై, జేఏసీగా ఉద్యమానికి శ్రీకారం చుట్టగా, ఇతర కార్మిక సంఘా లు, ఇంజినీర్ల సంఘాలు సమ్మెకు మద్దతు ప్రకటించాయి. ఆర్టిజన్ వద్దు.. కన్వర్షన్ ముద్దు'.. 'విద్యుత్తు సంస్థల యాజమాన్య మొండివైఖరి నశించాలి' అంటూ నినదించారు. దీంతో విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్లు, పలు కార్యాలయా ల్లో సేవలకు అంతరాయం కలిగింతుందని అన్నారు. బయట ప్రైవేట్ వ్యక్తులకు ఒక్కొక్కరికి 1000 రూపాయలు చెలించి పనులు చేపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థలో అవగాహన లేని వాళ్లను తీసుకొచ్చి పనులు చేపిస్తే వారికి ప్రమాదం జరుగుతే ఎవరూ బాధ్యులని అధికారులను పై మండిపడుతున్నారు.

# ఇండస్ట్రియల్ పార్క్ నిర్వాసితులకు అండగా వుంటాం కలెక్టర్



హుస్నాబాద్ ఇండస్ట్రియల్ పార్క్ లో భూమిని కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా అండగా ఉంటామని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారుహుస్నాబాద్ సమీకృత కార్యాలయ సముదాయం లోని మీటింగ్ హాల్ లో టిజీఐఐసి ఇండస్ట్రియల్ పార్క్ లో వలన భూమి కోల్పోతున్న అక్కన్న పేట మండలం చౌటపల్లి, జనగామ, తోటపల్లి గ్రామాల రైతులతో భూ సేకరణ



ప్రక్రియ గురించి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. హుస్నాబాద్ నియోజకవర్గంలో అక్కన్న పేట మండలంలో చౌటపల్లి, జనగాం, తోటపల్లి గ్రామాల్లో దాదాపు 124 ఎకరాలు భూమి టిజీఐఐసి కి అందించి ఇండస్ట్రియల్ పార్క్ గా అభివృద్ధి చేసి ఈ ప్రాంతంలో పరిశ్రమలు స్థాపనతో ప్రాంత యువతకు ఉద్యోగ ఉపాధి లభిస్తుందని ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి అందరూ సహకారం అవసరం అని తెలిపారు. మీప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న మీకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామని భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోద యోగ్యమైన పరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రామ్మూర్తి, తహసిల్దార్లు తదితరులు ఉన్నారు.

## పోలీస్ శాఖలో రూ.1.40 కోట్ల జీతాల కుంభకోణం: ఒక పోలీసు ఉద్యోగి పై కేసు నమోదు




కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మరణించిన సిబ్బంది పేర్లతో జీతాలు డ్రా చేస్తూ ప్రభుత్వ ధనాన్ని కాజేస్తున్న భారీ కుంభకోణాన్ని అధికారులు వెలికితీశారు. సుమారు రూ.1,40,18,308 మేర నిధుల దుర్వినియోగం జరిగినట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ విచారణలో తేలింది.గతంలో పే-సెక్షన్లో పనిచేసిన ఒక పోలీసు ఉద్యోగి మరణించిన ముగ్గురు కానిస్టేబుళ్ల ఎంప్లాయీ ఐడీలను ఉపయోగించి, ఐఎఫ్ఎమ్ఐఎస్ పోర్టల్లో ఇతరుల పేర్లను చేర్చారు. నిందితుడు ప్రైవేట్ బ్యాంకుల్లో నకిలీ ఖాతాలు తెరిచి, తన వ్యక్తిగత మొబైల్ నంబర్లను అనుసంధానించడం ద్వారా 2022 నుండి 2026 వరకు ప్రభుత్వ జీతాల సొమ్మును అక్రమంగా పొందారు.అక్రమంగా వచ్చిన సొమ్ముతో పర్సనల్ లోన్లు పొందడమే కాకుండా, నగదును వ్యక్తిగత అవసరాలకు వాడుకున్నట్లు గుర్తించారు.ఈ ఘటనపై కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఆదేశాల మేరకు బాధ్యుడైన పోలీసుఉద్యోగిపై కరీంనగర్ ఎ-టౌన్ పోలీస్ స్టేషన్లో క్రిమినల్ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ రాంచందర్ రావు తెలిపారు. ఇంకా ఎవరెవరికి ఈ ఘటనతో సంబంధాలు ఉన్నాయని అంతర్గత విచారణ జరుపుతున్నామని, పూర్తి విచారణ జరిపి బాధ్యులైన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ తెలిపారు.

# లాయర్ దారుణ హత్య



పల్నాడు చిలకలూరిపేట (మం)యడవల్లి సమీపంలో లాయర్ దారుణ హత్య కు గురయ్యాడు. చీమకుర్తి కి చెందిన ప్రముఖ న్యాయవాది శ్రీరామ్ హరి ప్రసాద్ ను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేసారు. యడవల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రక్కన బండ రాయి తో కొట్టి చంపారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

లాయర్ హరి ప్రసాద్ పై స్కూటీ పడిఉండడంతో ఈ ఘటన ప్రమాదమా లేక మరేదైన కుట్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

# అంబెద్కర్ జయంతి పోస్టర్ల విడుదల

హైదరాబాద్ తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలోఅంబేద్కర్ 135వ జయంతి (ఏప్రిల్ 14, 2026) వేడుకలను మూసారాం బాగ్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. ఈ సందర్భంగా మలక్ పేటలో అసోసియేషన్ అధ్యక్షుడు కూరేళ్ల మహేష్ కుమార్ పోస్టర్లను ఆవిష్కరించారు. మాట్లాడుతూ సబ్బండ వర్గాల హక్కులకై జీవితాంతం పోరాడిన మహానేత అంబేద్కర్ అని అన్నారు. ఏప్రిల్ 14న మూసారాం బాగ్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగే జయంతి ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి పెద్దఎత్తున తరలిరావాలన్నారు.

ప్రతి ఒక్కరూ అంబేద్కర్ మార్గాన్ని అనుసరించి, వారు చూపిన బాటలో నడవాలని సూచించారు. ఈ మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ విద్యార్థులలో చైతన్యం నింపే కార్యక్రమాలు చేపట్టనున్నామని వివరించారు

# రాష్ డ్రైవింగ్‌తో ఇసుక ట్రాక్టర్ల రోతన?

**కాలనీవాసుల ఆగ్రహం**

**రోడ్డు పై స్తంభాలు, మొద్దులు పేర్చి వినూత్న నిరసన**

**దుమ్ము-ధూళితో పిల్లలు, వృద్ధులు అనారోగ్యానికి గురవుతున్నారని ఆరోపణ**

**అనుమతికి మించి ట్రిప్పులు?**

**అక్రమ రవాణాపై కాలనీవాసుల విమర్శలు**

**సంతకాల సేకరణతో తహసిల్దార్, పోలీసులకు వినతిపత్రం ఇవ్వనున్న ప్రజలు**



వికారాబాద్ తాండూరు పట్టణంలోని వార్డు నెంబర్ 17 పరిధిలోని పాత తాండూరు గడీ ప్రాంతంలో ఇసుక ట్రాక్టర్ల రాష్ డ్రైవింగ్‌పై కాలనీవాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజూ వందల సంఖ్యలో వెళ్లే ఇసుక ట్రాక్టర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ట్రాక్టర్లు అధిక వేగంతో వెళు ండటంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు రోడ్డుపై నడవడానికి కూడా భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో కాలనీవాసులు రోడ్డుపై స్తంభాలు, మొద్దులు పేర్చి నిరసన వ్యక్తం చేశారు.ఇసుక ట్రాక్టర్ల కారణంగా ఎగిసే దుమ్ము, ధూళి ఇళ్లలోకి చేరుతుండటంతో ప్రజలు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు.ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కేవలం రెండు ట్రాక్టర్లకు మాత్రమే అనుమతి ఇచ్చినప్పటికీ, ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఒక్కో ట్రాక్టర్ పదుల సంఖ్యలో ట్రిప్పులు చేస్తున్నాయని కాలనీవాసులు ఆరోపించారు. ఇది పూర్తిగా అక్రమ రవాణా అని విమర్శించారు.రోజూ ఇక్కడి నుంచి వెళ్లే ట్రాక్టర్ల సంఖ్య చూస్తే, రాష్ట్రంలోని అన్ని ఇందిరమ్మ ఇళ్లను నిర్మించవచ్చని స్థానికులు ఎద్దేవా చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ కాలనీలో ఇసుక ట్రాక్టర్ల రాకపోకలను నియంత్రించాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కాలనీవాసులు సంతకాల సేకరణ చేపట్టి, తహసిల్దార్ మరియు పట్టణ పోలీసులకు వినతిపత్రం అందించేందుకు సిద్ధమవుతున్నారు



## సోషల్ మీడియాలో నకిలీ ప్రొఫైల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు,**

**సోషల్ మీడియాలో తెలిసిన వ్యక్తుల నుండి డబ్బులు "అత్యవసరం" అంటూ డబ్బులు అడిగితే వెంటనే స్పందించకండి**

**?ముందుగా ఫోన్ చేసి నిర్ధారించుకోండి.**

**సామాజిక మాధ్యమాల్లో అకౌంట్ల ప్రొఫైల్‌ను లాక్ చేసి ఉంచడం మరింత భద్రతకు మంచిది**

సాంకేతికత పెరుగుతున్న కొద్దీ కొత్త రకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయని, కొందరు సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ అకౌంట్లకు నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ హర్షవర్ధన్ రాజు తెలిపారు. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న వారు ముందుగా ఫేస్‌బుక్‌లోకి ప్రవేశించి, ప్రైవసీ సెట్టింగ్స్ లేని ఖాతాల వివరాలను సేకరించి, ఆ వ్యక్తుల పోస్టులు మరియు గుర్తింపు పరిశీలిస్తారు. అనంతరం ఆ ఖాతాల్లో ఉన్న ఫోటోలను డౌన్‌లోడ్ చేసి, వాటిని ప్రొఫైల్ ఫోటోలుగా ఉపయోగించి నకిలీ ఖాతాలు సృష్టిస్తారు. తర్వాత ఆ నకిలీ ఖాతాల ద్వారా ఫ్రెండ్స్ లిస్టులో ఉన్న వారికే మళ్లీ ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతారు. దీనివల్ల, ఎదుటి వారు అదే వ్యక్తి మరో ఖాతా తెరిచారని భావించి ఆ రిక్వెస్టులను అంగీకరిస్తున్నారని ఎస్పీ గారు తెలిపారు.తర్వాత ఆ నకిలీ ఖాతాలను వినియోగిస్తూ కొన్నాళ్లు కొత్త ఫ్రెండ్స్‌తో చాటింగ్ చేసి, అనంతరం వివిధ కారణాలు చెబుతూ తమకు అత్యవసరంగా కొంత డబ్బు కావాలని, కొన్ని గంటల్లోనే తిరిగి ఇస్తామని చెప్పి తెలిసిన వారిని ఆన్‌లైన్ చెల్లింపు యాప్‌లకు డబ్బులు పంపాలని కోరుతున్నారని తెలిపారు. ఆ సందేశాలను నమ్మి నిజంగా అవసరమై డబ్బులు అడుగుతున్నారనే భావనతో వారు చెప్పిన ఆన్‌లైన్ చెల్లింపు యాప్‌లకు డబ్బులు పంపితే, వాటిని సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారని, కాబట్టి ఫేక్ ప్రొఫైల్ మోసాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఫేసుబుక్, ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్ అకౌంట్ ల ద్వారా డబ్బులు అడిగితే సంబంధిత వ్యక్తులకు ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి లేదా పోలీసులకు సమాచారం అందించాలి లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చెయ్యాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ లిలిలి.ఇ.ఎవతీఇతీతిఎవ.ఐనీల.తిని లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.



## నకిలీ హాల్ టికెట్లు ఇచ్చిన కాలేజీ
## కేసు నమోదు..ఒకరి అరెస్టు

గుంటూరు విద్యార్థులు కు జే ఈ ఈ ఎగ్జామ్ లో ఫేక్ హాలిటికెట్లు ఇచ్చిన ఆక్స్ఫర్డ్ కాలేజ్ సిబ్బంది పై కేసు నమోదయింది. తమ వద్ద లక్షలు రూపాయలు తీసుకుని మోసం చేశారాని విద్యార్థులు తల్లిదండ్రులు.పోలీసులకు పిర్యాదుచేసారు. సెక్షన్.420.120(బి) 506.509.465.467 కేసు నమోదుఅయింది. ఆక్స్ఫర్డ్ డీన్ మురళి కృష్ణ పిఏ జూజీ మూర్తిని పట్టాభి పురం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఈ కేసులో యాజమాన్యం ప్రిన్సిపాల్.డీన్., సి ఈ వో .సిబ్బంది ఐదుగురు పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఆక్స్ఫర్డ్ కాలేజ్ విద్యార్థుల భవిష్యత్ పై విద్య శాఖ మంత్రి లోకేష్ ఆరా తీసారు. ఫేక్ హాలిటికెట్ ల ఘటన పై కలెక్టర్ సాయికాంత్ వర్మ సిరియస్ అయ్యారు. చంద్రమౌళి నగర్ లో ఉన్న ఆక్స్ఫర్డ్ కాలేజ్ పర్మిషన్ లేదని విద్యాశాఖ అధికారులు విచారణలో వెల్లడించారు.

# పోలీసు శాఖ ప్రతిష్టను చాటిచెప్పండి

### హోంగార్డులకు రీజియన్ కమాండెంట్ పిలుపు.
### తమిళనాడు ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి.
### ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూనే మెరుగైన సేవలు అందించాలి.
### మదనపల్లిలో ఘనంగా హోంగార్డుల పరేడ్..
### పాల్గొన్న కమాండెంట్ . యం. మహేష్ కుమార్



మదనపల్లి, ఏప్రిల్ 10: పోలీసు వ్యవస్థలో హోంగార్డుల సేవలు అత్యంత కీలకమని, విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటిస్తూ శాఖ ప్రతిష్టను పెంచేలా పని చేయాలని రాయలసీమ రీజియన్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం. మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మదనపల్లిలోని బి.టి. కళాశాల పోలీస్ పరేడ్ మైదానంలో జిల్లా స్థాయి హోంగార్డులకు ప్రత్యేక పరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కమాండెంట్ పరేడ్ లో హోంగార్డుల గౌరవ వందనాన్ని స్వీకరించి, సిబ్బంది పనితీరును తనిఖీ చేశారు.ఎన్నికల విధులే పరమావధి:త్వరలో తమిళనాడులో జరగనున్న సాధారణ ఎన్నికల విధులకు వెళ్లే హోంగార్డులకు ఆయన ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. పరాయి రాష్ట్రంలో విధులు నిర్వహించేటప్పుడు అత్యంత ఓర్పుతో ఉండాలని, ఓటర్లతో మర్యాదగా ప్రవర్తిస్తూనే నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు.



శిక్షణలో నేర్చుకున్న మెళకువలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ జిల్లా పోలీసు యంత్రాంగానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఆరోగ్యమే మహాభాగ్యం:సవాళ్లతో కూడుకున్న పోలీసు ఉద్యోగంలో ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించరాదని కమాండెంట్ స్పష్టం చేశారు. “మీరు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి సమర్థవంతంగా సేవ చేయగలరు” అని పేర్కొన్నారు. అలాగే రోడ్డు భద్రతపై అవగాహన కలిగి ఉండాలని, ప్రయాణాల్లో జాగ్రత్తలు వహిస్తూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఇన్సూరెన్స్ వ్యక్తి గత ఇన్స్యూరెన్స్ లు కలిగి ఉండాలని సూచించారు.సమస్యల పరిష్కారానికి ‘దర్బార్’:అనంతరం నిర్వహించిన ‘దర్బార్’లో హోంగార్డులు తమ సమస్యలను కమాండెంట్ దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యలను జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే సబ్ డివిజన్ ఇంచార్జీలకు లేదా రిజర్వ్ ఇన్స్పెక్టర్‌కు తెలపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ డి. ఏడుకొండల రెడ్డి, హోంగార్డ్స్ డీఎస్పీ కె.బి.వి. ప్రసాద్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె. సురేష్ కుమార్ రెడ్డి, ఆర్ఎస్ఐలు ఏ. శ్రీనివాస్, జి.రవి, హోంగార్డ్స్ ఇంచార్జీలు మరియు పెద్ద సంఖ్యలో హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు, మాదకద్రవ్యాల వినియోగదారులకు టాస్క్ ఫోర్స్, హెచ్-న్యూ (ఊ-ఔఇచి) మరియు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఆకస్మిక డ్రగ్ టెస్టులు.



హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్, ఆదేశాల మేరకు, ఈరోజు టాస్క్ ఫోర్స్ మరియు హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్‌మెంట్ వింగ్ (ఊ-ఔఇచి) సంయుక్తంగా స్థానిక పోలీసుల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాయి. ఈ డ్రైవ్‌లో భాగంగా రౌడీ షీటర్లు, గొడవలకు దిగే వ్యక్తులు మరియు గతంలో ఎన్.డి.పి.ఎస్ (ఔఆఖా) కేసుల్లో పట్టుబడిన మాదకద్రవ్యాల వినియోగదారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే చట్టపరమైన పరిణామాలపై అవగాహన కల్పించడమే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశ్యం.ఈ కార్యక్రమం టాస్క్ ఫోర్స్/హెచ్-న్యూ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శ్రీ వైభవ్ రఘునాథ్ గైక్వాడ్, ఐపీఎస్ గారి పర్యవేక్షణలో జరిగింది. ఇందులో చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ అడిషనల్ డిసిపి శ్రీ అందె శ్రీనివాస్, రాజేంద్రనగర్ జోన్ టాస్క్ ఫోర్స్ అడిషనల్ డిసిపి ఇక్బాల్ సిద్ధిఖీ పాల్గొన్నారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్ మరియు ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయం వైద్యుల సహకారంతో ఈ పరీక్షలు నిర్వహించారు.ఈ వైద్య పరీక్షల వివరాలను పరిశీలిస్తే.. గాంధీ జనరల్ హాస్పిటల్‌లో మొత్తం 70 మందికి పరీక్షలు నిర్వహించగా 44 మందికి పాజిటివ్, 26 మందికి నెగటివ్ అని తేలింది. ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌లో 80 మందికి పరీక్షలు చేయగా 59 మందికి పాజిటివ్, 21 మందికి నెగటివ్ వచ్చింది. అలాగే ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక చికిత్సాలయంలో 89 మందికి పరీక్షలు నిర్వహించగా, అందులో అత్యధికంగా 86 మందికి పాజిటివ్, ముగ్గురికి నెగటివ్ అని తేలింది. మొత్తంగా 239 మందికి పరీక్షలు నిర్వహించగా, అందులో 189 మంది మాదకద్రవ్యాలు సేవించినట్లు నిర్ధారణ అయింది.పరీక్షల అనంతరం, డ్రగ్స్ అలవాటు వల్ల కలిగే దుష్ప్రభావాలు మరియు పునరావాసం (ఖీవష్ట్రజీఏతిశ్రీతిబిజీబితినీని) యొక్క ప్రాముఖ్యత గురించి మానసిక వైద్యులు వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రగ్ టెస్టులో పాజిటివ్‌గా తేలిన వారిపై చట్టప్రకారం తగిన కేసులు నమోదు చేయనున్నారు.మాదకద్రవ్యాలకు సంబంధించిన కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, బాధితులు సరైన కౌన్సెలింగ్ ద్వారా కోలుకునేలా చేయడంలో హైదరాబాద్ సిటీ పోలీస్ టాస్క్ ఫోర్స్ మరియు హెచ్-న్యూ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన మరియు సురక్షితమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని కోరుతున్నాము.

## జీవన్ రెడ్డి
## రాజ్యసభ పదవి వదులుకొన్నారు

హైదరాబాద్, ఏప్రిల్ 10 : జగిత్యాల జిల్లా రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన టి జీవన్ రెడ్డి త్వరలో బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. జీవన్ రెడ్డి పార్టీని వీడటం బాధాకరమని, ఓ మంచి అవకాశాన్ని కోల్పోయారని నేతలు చెబుతున్నారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్‌ను వీడటంపై దానం నాగేందర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జగిత్యాల మాజీ ఎమ్మెల్యే టి. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వెళ్లడం ఒక తొందరపాటు చర్య అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అభిప్రాయపడ్డారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను పార్టీలోనే కొనసాగేలా చేసేందుకు చివరి నిమిషం వరకు ఎంతో ప్రయత్నించారని ఆయన పేర్కొన్నారు. జీవన్ రెడ్డికి తదుపరి విడతలో రాజ్యసభ సీటు ఇచ్చే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ, ఆయన ఓపిక పట్టకుండా ఎమోషనల్‌గా నిర్ణయం తీసుకుని బీఆర్ఎస్ పార్టీలో చేరనుండటం దురదృష్టకరమని దానం వ్యాఖ్యానించారు.పార్టీ సీనియర్ నాయకుడిగా జీవన్ రెడ్డి ఎన్నో సేవలు అందించారని, అటువంటి నేత పార్టీని విడటం బాధాకరమని దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని పెద్ద గణేష్ విగ్రహం వద్ద 99 రోజుల ప్రజా పాలన ఉత్సవాల్లో భాగంగా, జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ప్రియాంకతో కలిసి నిర్వహించిన “ఫ్రైడే డ్రైడే” ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు.ఇదే క్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై దానం నాగేందర్ విమర్శలు గుప్పించారు. సమస్యల పరిష్కారం కంటే పబ్లిసిటీకే ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోపించారు. కేవలం ప్రచారం కోసమే దోమతెరలు వేసుకుని బయట తిరుగుతున్నారని సుధీర్ రెడ్డిని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలి తప్ప, ఇలాంటి విన్యాసాలు చేయకూడదని ఆయన హితవు పలికారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లాలని, వారు పరిష్కరించేందుకు కృషి చేస్తారని తెలిపారు. కానీ ఒక్కరోజు స్టంట్స్, పబ్లిసిటీ పిచ్చితో ఏదో ఒకటి చేస్తే వైరల్ అవుతారు తప్పా, పనులు మాత్రం కావని సూచించారు.

# జీహెచ్ఎంసి అవినీతికి ముఖ్యమంత్రి బాధ్యుడు
# కల్వకుంట్ల కవిత



హైదరాబాద్ జీహెచ్ఎంసీలో తీవ్రమైన అవినీతికి ముఖ్యమంత్రి బాధ్యులు. సీఎం తన అనుచరులకు నామినేషన్ పద్ధతిలో టెండర్లు కట్టబెడుతున్నడని జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏలో పనులన్నీ టెండర్ల ద్వారానే ఇవ్వాలి. టెండర్లు లేకుండా జీహెచ్ఎంసీలో 1,148 కోట్ల పనులు అప్పగించారు. జీహెచ్ఎంసీ లో కాంగ్రెస్ భారీ ఎత్తున అవినీతికి పాల్పడుతోంది. వెంటనే నామినేషన్ల పద్ధతిని రద్దు చేసి కాంట్రాక్ట్ పద్ధతిలో టెండర్లు ఇవ్వాలని అమె అన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారులను బెదిరించటం ఆపాలి. లేదంటే మీ అవినీతి పై ఈడీకి ఫిర్యాదు చేస్తాం. కాళేశ్వరం మరమ్మత్తులను కమిషన్ల కోసమే చేస్తున్నారు . కాళేశ్వరం ఫెయిల్ అయ్యిందని చెప్పేందుకు ఎనిమిదిన్నర లక్షల ఎకరాలు ఎండబెట్టిన కర్కోటక ప్రభుత్వం ఇది. మహిళ బిల్లుకు 2011 జనాభా లెక్కలు ప్రతిపాదిక అంటే మోసం చేయటమే. బీజేపీ మరోసారి తన బీసీ వ్యతిరేకతను చాటుకుంటోంది. ఎంపీ అర్వింద్ కు తెలివి లేదు. నా గురించి పిచ్చి పిచ్చిగా మాట్లాడితే ఊరుకునేది లేదు. జీహెచ్ఎంసీలో తీవ్రమైన అవినీతి జరుగుతోంది. జీహెచ్ఎంసీ ఏర్పడిన తర్వాత కచ్చితంగా కొన్ని మంచి మార్పులు జరిగాయి. కానీ ఇప్పటికి కూడా చినుకుపడితే ఎక్కడి కార్లు అక్కడే నిలిచి పోయే పరిస్థితి ఉంది. హైదరాబాద్ అభివృద్ధి కోసం అంటూ హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న 35 వేల కోట్ల రూపాయల ఫ్లాట్లను అమ్మారు. కానీ ఆ డబ్బులు మాత్రం హైదరాబాద్ నగర అభివృద్ధికి ఏమాత్రం ఉపయోగపడలేదు. హెచ్ఎండీఏ లో ఒక ఆరు డిపార్ట్ మెంట్లు మాత్రమే ప్రధానంగా ఉన్నాయి. వాటిల్లోనే విజిలెన్స్, ప్లానింగ్ డిపార్ట్ మెంట్ ఉంటుంది. ఐతే మనం ఏదైనా టెండర్ ఇవ్వాలంటే గ్రామాల్లో సైతం 5 లక్షలు దాటితే టెండర్ రూపంలో ఇస్తాం. కానీ హెచ్ఎండీఏ పరిధిలో భారీఎత్తున నామినేషన్ రూపంలో కాంట్రాక్ట్ లు కట్టబెట్టారని అన్నారు.

గత ప్రభుత్వం బీఆర్ఎస్ నాటి నుంచే ఈ పద్ధతి కొనసాగుతోంది. 2017 నుంచి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విధంగా 480 కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లకు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అదే మాదిరిగా 1148 కోట్లు పూర్తిగా నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్ట్ లు ఇచ్చారు. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగింది. ఇది తెలంగాణ స్టేట్ ఫైనాన్షియల్ కోడ్ కు పూర్తిగా వ్యతిరేకం నామినేషన్ల పద్ధతిలో కాంట్రాక్ట్ లు ఇవ్వవద్దని 2023 లోనే వేసిన కమిటీ స్పష్టం చేసింది. ఆయన సరే ఈ ముఖ్యమంత్రి 1148 కోట్లు నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్ట్ ఇచ్చాడు. ఇన్ని వందల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయటాన్ని మేము తీవ్రంగా ఖండిస్తున్నాం. 50 కోట్లు దాటితే కచ్చితంగా టెండర్ పిలవాల్సిందే. టెండర్లు పిలవటం కారణంగా మళ్లీ సగం వరకు కూడా ప్రభుత్వానికే ఆదాయం వస్తుంది. హెచ్ఎండీఏ కు ముఖ్యమంత్రే ఛైర్మన్, మున్సిపల్ మంత్రి వైస్ ఛైర్మన్ ఉంటాడు. కానీ మన ఖర్మ కొద్దీ ఈ ముఖ్యమంత్రే నేనే రాజు, నేనే మంత్రి అన్నట్లుగా వ్యవహరిస్తున్నాడు. వీళ్లు ఏదైతే నామినేషన పద్ధతిలో టెండర్లు పిలిచారో ఆ డిపార్ట్ మెంట్ లో 6 వేల మంది పనిచేస్తున్నారు. వారికి 23 వేలకు పైగా జీతాలు ఇవ్వాల్సి ఉంటే 13, 500 లు మాత్రమే ఇస్తున్నారు. నర్సరీ డిపార్ట్ మెంట్ లో మొక్కలు నాటటానికి, పెంచటానికి, పంచటానికి మీరు చే సిన అవినీతి చిట్టా మా దగ్గర ఉంది. అవుట్ రింగ్ రోడ్ కు సంబంధించి ఒక కంపెనీ పై సిట్ వేశారు. కానీ ఆ సిట్ ఏమైందో తెలియదు. ముఖ్యమంత్రి తో సిట్టింగ్ ద్వారా ఆ సిట్ మాయమైందా? అవుటర్ రింగ్ రోడ్ ను అమ్ముకున్నట్లుగా తయారు చేశారు. అక్కడ మెయింటెనెన్స్ కోసం మొత్తం ఖర్చు ప్రభుత్వం నుంచే పెడుతున్నారు. అసలు అవుటర్ మీద అవుతున్న ప్రమాదాల గురించి ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. అక్కడ ఉండాల్సినంత మంది లేబర్లను కూడా పెట్టటం లేదు. ముఖ్యమంత్రి వద్ద సంచులు మోసే వ్యక్తి ఈ డిపార్ట్ మెంట్ కు వైస్ ఛైర్మన్ అన్నట్లు ఉన్నాడు. రియల్ ఎస్టేట్ సంస్థలను ఇప్పటికే హైడ్రా పేరుతో బెదిరించారు. స్క్వేర్ ఫీట్ కు 150 రూపాయల చొప్పున వారి వద్ద వసూలు చేస్తున్నారు. రియల్ ఎస్టేట్ సంస్థలను బెదిరించటమనేది వెంటనే మానుకోవాలని హెచ్చరిస్తున్నాని అన్నారు.

# హర్యానా లో గుడివాడకు చెందిన టేకి దారుణ హత్య



చండీఘడ్ హర్యానలో గుడివాడకు చెందిన సాఫ్ట్ వేర్ ఇంజనీర్ బండ్ల రుషికేష్ (27) దారుణ హత్యకు గురయ్యాడు. రుషి పంచకుల వేది టెక్నాలజీస్ కంపెనీ లో 10రోజుల క్రితం ఉద్యోగంలో చేరాడు. శుక్రవారం కంపెనీ రూమ్ లో రక్తపు మడుగులో పడి ఉన్న రుషిని తోటి ఉద్యోగులు గమనించారు. బేతవోలులో ఉన్న కుటుంబ సభ్యులకు రుషి మరణ వార్తను గుడివాడ 1టౌన్ పోలీసులు తెలియచేసారు. దాంతో మృతుడి కుటుంబ సభ్యులు హుటా హుటిన హర్యానా బయలుదేరారు.

## కొండవీడు కోటలో ప్రేమజంట ఆత్మహత్య
### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన
### ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృత్యువాత



చిలకలూరిపేట యడ్లపాడు మండలం కొండవీడు కోట పరిధిలో అత్యంత విషాదకర ఘటన చోటు చేసుకుంది. ప్రేమించిన యువతికి వేరే వ్యక్తితో వివాహం జరగడం, విడిపోయి ఉండలేమన్న బాధతో ఇద్దరు ప్రేమికులు పురుగుమందు తాగి ప్రాణాలు తీసుకున్నారు.

పోలీసులు అందించిన వివరాల ప్రకారం..

గుంటూరు స్వర్ణభారత్ నగర్కు చెందిన రసిక మనికంఠ రాజు (20), అంకమ్మ నగర్కు చెందిన ఓ యువతి ప్రేమలో పడ్డారు. గత రెండేళ్లుగా వివాహానికి పెద్దలు అంగీకరించకపోవడంతో యువతికి ఇటీవల మరో వ్యక్తితో పెళ్లి జరిగింది. వివాహం తర్వాత మనస్తాపానికి గురై భర్తతో ఉండలేనని చెప్పి యువతి గుంటూరుకు తిరిగి వచ్చేసింది. ఈ నెల 7వ తేదీన కొండవీడు కోటకు మనికంఠ రాజు, సదరు యువతి వెళ్లారు. అక్కడ వారు ‘స్పైకర్’ పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మనికంఠ రాజు 8వ తేదీ సాయంత్రం మృతి చెందాడు. పరిస్థితి విషమించి 9వ తేదీన యువతి మరణించింది. కొండవీడు కోట వంటి పర్యాటక ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతుల ఇద్దరి తల్లులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ టి శివరామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జీరా లో ఎమ్మెల్యే తలసాని పర్యటన

సికింద్రాబాద్... బస్తీ వాసుల అభీష్టం మేరకే కమిటీ హాల్ నిర్మాణం చేపడతామని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. శుక్రవారం రాంగోపాల్ పేట డివిజన్ లోని జీరా బస్తీ, కాలనీలలో అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా జీరా గార్డెన్ సమీపంలో గల ఖాళీ స్థలాన్ని కమిటీ హాల్ నిర్మాణం కోసం పరిశీలించారు. బస్తీ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని 19 లక్షల రూపాయల వ్యయంతో కమిటీ హాల్ ను జీ ప్లస్ ఒన్ విధానంలో నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. అనంతరం జీరా బస్తీలో ని శ్రీ లక్ష్మి నర్సింహ స్వామి ఆలయాన్ని సందర్శించి పరిశీలించారు. వర్షాకాలంలో ఆలయం కురుస్తుందని, మరమ్మతులు చేపించాలని స్థానికులు ఎమ్మెల్యే ను కోరారు. స్పందించిన ఆయన వెంటనే ఆలయ మరమ్మతుల కోసం ఆర్ధిక సహాయం అందజేశారు. తదనంతరం బస్తీలోని అధ్వాన్నంగా ఉన్న టాయిలెట్ లను పరిశీలించారు. తాము ఉపయోగించలేని పరిస్థితి లో ఉన్నాయని, నూతన టాయిలెట్స్ నిర్మించాలని కోరగా, వెంటనే నూతన టాయిలెట్స్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అక్కడి నుండి గార్డెన్ కు చేరుకొని పరిశీలించారు. గార్డెన్ ను పచ్చదనంగా తీర్చిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలని, అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. గార్డెన్ లోని పోచమ్మ అమ్మవారి ని దర్శించుకున్నారు. అనంతరం బాలాజీ జీరా బస్తీలో పర్యటించగా, ఒక నీటిట్యాంక్ నిర్మించాలని స్థానిక మహిళలు ఎమ్మెల్యే ను కోరారు. ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. స్థానిక కమిటీ హాల్ శిథిలావస్థకు చేరిందని, నూతన భవనం నిర్మించాలని కోరగా, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సమస్యలను తెలుసుకొని పరిష్కరించే లక్ష్యంతోనే జీరా ప్రాంతంలో పర్యటిస్తున్నట్లు స్థానిక ప్రజలకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వివరించారు.

### గ్రామస్థులను హడలెత్తించిన గిరినాగు

విజయనగరం వేపాడ మండలంలోని వీలుపర్తి పంచాయతీ వెల్లాం గ్రామంలో 15 అడుగుల గిరినాగు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. వెలమల వీధిలోని మురుగు కాలువలో పాము సంచరిస్తుండటాన్ని గమనించిన స్థానికులు స్నేక్ కేచర్ రాజేష్‌కు సమాచారం అందించారు. ఆయన వెంటనే అక్కడికి చేరుకుని, పామును సురక్షితంగా పట్టుకుని సమీప అడవిలో విడిచిపెట్టారు. దీంతో గ్రామస్తులు ఊపిరిపీల్చుకున్నారు.

# మృతిరాలి కుటుంబానికి ఎస్ కే ఆర్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్10(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:**మర్పల్లి మండల పరిధిలోని పంచలింగల్ గ్రామానికి చెందిన పిచకుంట్ల చెంద్రమ్మ గురువారం రాత్రి మృతి చెందింది..

అట్టి విషయం తెలుసుకున్న ఎస్ కే ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సనగారి కొండల్ రెడ్డిఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.. చెంద్రమ్మ (వయస్సు 110 సంవత్సరాలు) అంత్యక్రియల నిమిత్తం 5 వేల రూపాయలు పంపించారుస్థానిక ఉప సర్పంచ్ ముత్యాల ఆంజనేయులు గౌడ్ గ్రామస్తులతో కలిసి మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ఎస్ కే ఆర్ పంపిన నగదును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ చంద్రశేఖర్,వార్డు సభ్యుడు శివయ్య, యాదగిరి, అంజయ్య,జగన్,సంగయ్య, సోఫీ, అశోక్,జనార్ధన్ కృష్ణ,శేఖర్, భాస్కర్,హరి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## దాతృత్వాన్ని చాటుకున్న ఏటూరునాగారం కాంగ్రెస్ మండల నాయకులు దశదినకర్మకు 50 కేజీల బియ్యం అందజేత.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 10 04 2026**మంత్రి సీతక్క గారి ఆదేశాలమేరకు జిల్లా పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనమేరకు మండల పార్టీ మాజీ అధ్యక్షుడు చిటమట రఘు గారి ఆద్వర్యంలో ఏటూరునాగారం మండల కేంద్రంలో క్రాస్ రోడ్ లో తొర్రెం సమ్మక్క ఇటీవల మృతి చెందగా కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆమె చిత్రపటానికి పూలమాల చేసి ఈరోజు వారి దశదినకర్మకు వారి మనువడు కంకణాల సాయికుమార్ కు 50 కేజీల బియ్యాన్ని కాంగ్రెస్ మండల నాయకుల ఆధ్వర్యంలో అందించడం జరిగింది..

ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్టిఏ డైరెక్టర్ వసంత శ్రీనివాస్ మండల కూరపాటి వేణు, వార్డు మెంబర్ నగవత్ కిరణ్, ఈసం రాజు ,అటిక కిష్టా, ఈసం కిరణ్, హరికృష్ణ ఈసం నర్సయ్య గండపల్లి సత్యం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

# జీవన్ రెడ్డి పార్టీ ని వీడటం పై స్పందించిన టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



**అందోల్ నియోజకవర్గంలో ప్రతినిధి ఏప్రిల్ 10 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా** :జీవన్ రెడ్డి లాంటి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు పార్టీ ని వీడటం బాధాకరమని, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఒక సందర్భంలో అన్నారు,

సోనియాగాంధీ,రాహుల్ గాంధీ, కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ కి విధేయుడు గా ఉన్న జీవన్ రెడ్డి పార్టీ ని వీడటం బాధాకరం జీవన్ రెడ్డి, విషయంలో అంతర్గతంగా ఏం జరుగుతుందో ఏఐసీసి స్థాయిలో చెక్ చేసుకోవాల్సి ఉండాల్సిందని అన్నారు,డైరెక్ట్ గా డిల్లీ నాయకత్వమే నేరుగా రంగం లోకి దిగి సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేదని,ఇది నా వ్యక్తిగత అభిప్రాయం ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీలు మారడం ప్రస్తుత రాజకీయాల్లో సహజంజీవన్ రెడ్డి,పార్టీ మారడానికి గల కారణాలను బహిరంగగా మీడియా తో బహిరంగ మాట్లాడాలేం. అంతర్గతంగా పార్టీ లో చర్చిస్తాం అన్నారు

## అమ్మలాంటి అంగన్వాడీ టీచర్ను చెట్టుకు కట్టేసిన వైనం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 10 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:**భర్తపై కోపంతో ఏ పాపం తెలియని భార్యనీ తాళ్లతో చెట్టుకు కట్టి అవమానించిన గ్రామస్తులు, భర్త (హెచ్ బి ఏం) ఫైనాన్స్ పేరుతో గ్రామంలోని పలువురి వద్ద డబ్బులు తీసుకుని పారిపోయాడని, భర్త ఆచూకీ తెలుపాలని భార్యను చిత్రహింసలకు గురి చేసిన సంఘటన, సంగారెడ్డి జిల్లా: కంగ్టి మండలం రాసోల్, గ్రామంలో ఈ అమానుష ఘటన చోటు చేసుకుంది, అంగన్ వాడీ టీచర్ వసంత, కుమారిని గ్రామస్థులు చెట్టుకు కట్టేసి భర్త ఆచూకీ తెలపాలని భయభ్రాంతులకు గురి చేశారు,భర్త,గ్రామంలోని కొంతమంది నుంచి (హెచ్ బి ఏం )ఫైనాన్స్ పేరుతో డబ్బులు వసూలు చేసి, తిరిగి ఇవ్వకపోవడంతో, తీవ్ర ఆగ్రహంతో భర్తపై కోపంతో భార్యను, గ్రామంలోని చెట్టుకు కట్టేసి హమానవీయంగా ప్రవర్తించారు. వద్దని బాధితురాల, ఎంత ప్రాధేయపడినప్పటికీ గ్రామస్థులు కనికరించని పరిస్థితి,దాదాపుగంటకుపైగా,అంగన్ వాడీ టీచర్ను, చిత్రహింసలకు గురిచేశారు, భర్తపై ఉన్న కోపంతో సంబంధం లేని మహిళపై, అరాచకంగా ప్రవర్తించారు, ఈ ఘటనపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, ఐదుగురిపై కేసు నమోదు చేసిన కంగ్టి పోలీసులు

## అంబర్పేట్ లో మైనర్ బాలికపై లైంగిక దాడి

అంబర్ పేట గోల్నాకలో ఓ మైనర్ అమ్మాయి పై ఓ మైనర్ బాలుడు లైంగిక దాడికి పాల్పడ్డాడు గోల్నాక తులసీరామ్ నగర్ కు చెందిన 13 ఏళ్ళ మైనర్ బాలికకు ఇంస్టాగ్రామ్ రీల్స్ ద్వారా పరిచయమైన కాచిగూడ గోల్నాక నివాసి అయిన మైనర్ బాలుడు,ఆ బాలికతో స్నేహం పెంచుకొని తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడు, విషయం బాలిక ద్వారా విషయం తెలుసుకున్న బాలిక తల్లి తండ్రులు కాచిగూడ పోలీసులకు బాలుడిపై పిర్యాదు చేశారు,దీంతో పోలీసులు బాలిక స్టేట్మెంట్ తీసుకుని కేసు నమోదు చేసి లైంగిక దాడికి పాల్పడిన మైనర్ బాలుడిని జువెనైల్ కోర్టులో హాజరు పరిచి జువెనైల్ హోమ్ కు తరలించారు

## సంపూర్ణ ఆరోగ్యం యోగాతోనే సాధ్యం. జీవన శైలిలో యోగ ఒక భాగంగా అలవర్చుకోవాలి.



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 10 .04 .2026.**యోగ చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, రోజువారి జీవనశైలిలో యోగ ప్రక్రియను ఒక భాగంగా దినచర్య అలవర్చుకోవాలని రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.

శుక్రవారం ములుగు జిల్లా బండారుపల్లి గిరిజన భవన్ లో

'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్ లో భాగంగా హోమియోపతి పితామహుడు డాక్టర్ క్రిస్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ హానిమాన్ 271వ జయంతిని పురస్కరించుకుని ప్రపంచ హోమియోపతి ( ఆయుష్ డే ) దినోత్సవ యోగ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ టి.ఎస్. దివాకర తో కలిసి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ యోగా చేయడం ద్వారానే సంపూర్ణమైన ఆరోగ్యం సాధ్యమవుతుందని ప్రజల దినచర్యలో యోగా ఒక భాగంగా అలవర్చుకోవాలని ఉదయం 30 నిమిషాల నుంచి 60 నిమిషాల వరకు యోగ చేయడం ద్వారా శరీరం మెదడు చురుకుగా పనిచేస్తాయని తెలిపారు. పురాతన కాలం నుంచి యోగాసనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. సంపూర్ణమైన ఆరోగ్యం ద్వారా మాత్రమే మనిషి తన ఆశలను ఆశయాలను ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా యోగ దినచర్యగా అవలంబించుకోవడం ద్వారా శరీరానికి మనసుకి ఉపశమనాన్నిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ కనీసం 45-50 నిమిషాల యోగా, వ్యాయామం చేయాలని సూచించారు. దీనివల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చని తెలిపారు.

వ్యాయామంతో పాటు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పేర్కొన్నారు.

మంత్రి, కలెక్టర్, అధికారులు ఆయుష్ సిబ్బంది, క్రీడాకారులు, క్రీడాభిమానులతో కలిసియోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు.

ఈ కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ గోపాలరావు, కౌన్సిలర్లు, మెడికల్ కళాశాల విద్యార్థులు, మహిళా సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ, కల్వర్టులు మరియు ఇంకుడు గుంతలను పరిశీలించిన సర్పంచ్ కాకుల మర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 10 ఏటూరునాగారం,** ఏటూరునాగారం మేజర్ గ్రామ పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దే లక్ష్యంతో, సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు 1, 2 వార్డుల్లో ముమ్మరంగా పర్యటించారు. వార్డుల్లోని పారిశుధ్య పనులు, డ్రైనేజీ వ్యవస్థతో పాటుగా ప్రభుత్వ లక్ష్యమైన భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించారు.

కల్వర్టుల క్షేత్రస్థాయి పరిశీలన వార్డుల్లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన కల్వర్టులను, దెబ్బతిన్న నిర్మాణాలను సర్పంచ్ పరిశీలించారు.

కల్వర్టులు సరిగా లేని చోట నీరు రోడ్లపైకి రాకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిబ్బందిని వాడు సభ్యులను ఆదేశించారు.బిఇంటింటికీ ఇంకుడు గుంతల నిర్మాణం పనితీరును పరిశీలించారు. వృథా నీరు రోడ్లపైకి రాకుండా నేరుగా ఇంకుడు గుంతల్లోకి వెళ్లేలా చూడాలని, తద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంతలను వినియోగించుకోవాలని సూచించారు. డ్రైనేజీ కాలువల్లో సిల్ట్ (పూడిక) పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని, మురికినీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు వాడు సభ్యులకు స్పష్టం చేశారు. డ్రైనేజీ కాలువలతో పాటు ఇంకుడు గుంతల నిర్వహణ చాలా ముఖ్యం. దీనివల్ల గ్రామంలో పారిశుధ్యం మెరుగుపడటమే కాకుండా, భూగర్భ జలాలు పెరిగి భవిష్యత్తులో నీటి ఎద్దడి లేకుండా ఉంటుంది. కల్వర్టుల మరమ్మతు పనులను త్వరలోనే పూర్తి చేయిస్తాం.

ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు ,బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, తాడూరి రఘు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, వార్డ్ మెంబర్ అంగాల వీరన్న, గంప కిరణ్, కుమ్మరి చంద్రబాబు, జాడి బోజారావు, పెద్ద బోయిన బాలకృష్ణ, బట్టు గోపి, కొండాయి చిన్ని, కటుకూరి రాఖి, బాస శరత్, రాము, వలస మొండయ్య, మహేష్, పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక నేతలు పాల్గొన్నారు.

# పాలెం వెంకన్న దేవాలయంలో మహిళాచే లలిత సహస్ర పారాయణ పఠనం...



**నాగర్ కర్నూల్ ప్రజాబలం ప్రతినిధి** బిజినపల్లి మండల పరిధిలోని పాలెం గ్రామంలో శ్రీ అలెర్మెల్ మంగ సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం నాడు మహిళల భక్తుల ఆధ్వర్యంలో శ్రీ లలిత సహస్రనామాలు మరియు శ్రీ లక్ష్మీదేవి అష్టోత్తర శతనామావళి పూజలు ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం నాడు 20 మంది మహిళలచే ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు రాజేశ్వరి,సూర్య కళ లు తెలిపారు. అనంతరం సామూహికంగా కుంకుమార్చన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పద్మ,చంద్రకళ ప్రసన్న,రజిత,శోభ కృష్ణమ్మ,కవిత,రాధా శ్రీదేవి,జ్యోతి,లక్ష్మి,పద్మ తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లి చేసుకున్నా... ప్రియుడితో కలిసి సూసైడ్

గుంటూరు, ఏప్రిల్ 10 ప్రేమించిన యువకుడితో కాకుండా వేరే వ్యక్తిలో పెళ్లి జరగడంలో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ యువతి.. ప్రియుడితో కలిసి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గుంటూరు జిల్లాలో వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు నగరంలోని స్వర్ణ భారతి నగర్‌కు చెందిన రాజు అనే యువకుడు జేకేసీ కాలేజ్‌లో డిగ్రీ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. రాజుకు అంకమ్మ నగర్‌కు చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడింది. అది కాస్తా ప్రేమగా మారింది. గత రెండేళ్లుగా ఇద్దరూ ప్రేమించుకుంటున్నారు. పెళ్లి కూడా చేసుకోవాలని నిర్ణయించుకొని అదే విషయాన్ని పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. రాజు పేరెంట్స్ పెళ్లికి ఒప్పుకోగా.. యువతి తల్లిదండ్రులు మాత్రం అందుకు నిరాకరించారు.అయితే గతంలో వీళ్ల పెళ్లికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోగా అప్పుడు రాజు తల్లిదండ్రులు నిరాకరించారు. ఇద్దరి సామాజిక వర్గాలు కూడా వేరు కావడంతో పెళ్లి జరగలేదు. అయితే గత నెల 15వ తేదిన ఆ యువతికి తల్లిదండ్రులు మరో వ్యక్తితో వివాహం జరిపించారు. అయితే పెళ్లి చేసుకొని అత్తవారింటికి వెళ్లిన యువతి మూడు రోజుల క్రితం గుంటూరు వచ్చింది. ఆమె వచ్చిన విషయం తెలుసుకున్న రాజు వెళ్లి ఆ యువతితో మాట్లాడాడు. ఈ క్రమంలోనే ఇద్దరూ కలిసి చనిపోవాలని నిర్ణయించుకున్నారు.ఈ నెల ఏడో తేదిన ఇద్దరూ కలిసి కొండవీడు వెళ్లారు. అక్కడ పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు వెంటనే వారిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎనిమిదో తేదిన మణికంఠరాజు చనిపోగా 9వ తేదిన యువతి కూడా చనిపోయింది. ఇద్దరూ చనిపోవడంతో రెండు కుటుంబాల్లో విషాయ ఛాయలు అలముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇద్దరి తల్లుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి: నేచురలిస్ట్ శ్వేత...




**నాగర్ కర్నూల్ ప్రజాబలం ప్రతినిధి** విద్యార్థులు మంచిగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని నేచురలిస్ట్ మరియు తెలంగాణ ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ యూనిట్ మేనేజర్ శ్వేత సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవ (యాన్యువల్ డే) వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ఆమె ప్రసంగించారు.

ఈ సందర్భంగా శ్వేత మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. "ప్రకృతిని కాపాడితే ప్రకృతి మనల్ని కాపాడుతుంది"అని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు ఎన్ని అవాంతరాలు వచ్చినా చదువును మధ్యలో ఆపకుండా పూర్తిచేసి మంచి భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు.

కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఘనంగా ఫేర్వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ విద్యార్థులు తమ అనుభవాలను జూనియర్ విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పూర్తయ్యాక ఎక్కడ ఉన్నా ఉన్నత స్థాయిలో ఎదగాలని గురువుల ఆకాంక్ష అని తెలిపారు. భవిష్యత్తులో కష్టపడి మంచి స్థాయికి చేరుకొని తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఏవో మొహమ్మద్ ఇర్ఫాన్, అధ్యాపకులు అంజయ్య, వనిత,కోదండరాములు, రామకృష్ణ, దశరథం, ముజఫర్, శోభారాణి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత ఆహారం -- ఆరోగ్యకర జీవితం

### ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపు కోసం యోగా, ఫుడ్ సేఫ్టీ కార్యక్రమాలు

### జిల్లా వైద్యాధికారి డా. సి. ఉమా గౌరి




**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 10:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం భాగంగా, ప్రజలలో నివారణాత్మక ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడానికి మరియు యోగా--ఆయుష్ సమన్వయాన్ని ప్రోత్సహించడానికి, ఈరోజు ఉదయం 7:00 గంటలకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఘట్‌కేసర్‌లో యోగా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 200 మంది పాల్గొని, యోగా ప్రదర్శనలు చేశారు. అనంతరం, జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సి. ఉమా గౌరి "ఈట్ రైట్ వాక్" ర్యాలీని ప్రారంభించారు. ఆహార భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం, ఆహార సంబంధిత వ్యాధులను నివారించడం మరియు సురక్షిత పోషకాహార అలవాట్లను ప్రోత్సహించడమే ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశ్యం. ఈ కార్యక్రమంలో మెడికల్ మరియు నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.



ఈ కార్యక్రమంలో కీసర డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. సత్యవతి, జిల్లా ఎన్సీడీ ప్రోగ్రామ్ అధికారి
డా. చంద్రకళ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డా. కౌశిక్, డా. జంగయ్య, ఘట్‌కేసర్ జి ఎ డి ఎస్ ఎం ఓ డా.ఎ. శ్రీవల్లి, డీపీఎం,
యోగా ఇన్‌స్ట్రక్టర్ శ్రీధర్ మరియు వారి బృందం పాల్గొన్నారు.

తదుపరి.., అంతాయపల్లి ఐడిఒసి సమావేశ మందిరంలో ఫోస్టాక్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి శ్రీ ఫైజాన్ అహ్మద్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) అధ్యక్షత వహించారు.

ఈ శిక్షణలో బి సి, ఎస్ సి, ఎస్ టి వెల్ఫేర్ హాస్టల్స్ వంటకారులు, మధ్యాహ్న భోజన పథకం వంటకారులు మరియు ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ పాల్గొన్న వారితో ప్రత్యక్షంగా మాట్లాడి, ఆహార భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ప్రోత్సహించారు.

ఈ కార్యక్రమంలో ధర్మేంద్ర పాల, డిజిగ్నేటెడ్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ మరియు పి. నిలీషా, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ పాల్గొన్నారు.

## ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

## కలెక్టర్ మను చౌదరి



**మేడ్చల్ -- మల్కాజ్గిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం ఏప్రిల్ 10:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు, మెరుగుదల వైద్య సేవల కోసం అవసరమైన సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి తెలిపారు.

శుక్రవారం కూకట్ పల్లి, ఎల్లమ్మబండ లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్నీ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూరోజుకు ఎంత ఓపి ఉంటుందని, ఆసుపత్రిలోని మౌలిక వసతుల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ సెంటర్ కు ఎంత మంది ఆశావర్కర్లు ఉన్నారని కలెక్టర్ అడుగగా, ఆశావర్కర్ల కొరత ఉందని మెడికల్ ఆఫీసర్ వివరించారు. ఆసుపత్రికి అదనపు గదులు, టాయిలెట్లు కావలసినవి కలెక్టరును కోరగా, అవసరమైన మరమ్మత్తులకు, నిర్మాణాలకు అంచనాలు వేసి ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిని పరిశీలించి లో నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు.

ఫార్మసిస్ట్‌కు ఔషధాల నిల్వలను సమర్థంగా నిర్వహిస్తూ, ఎమర్జెన్సీ కార్నర్‌ను సక్రమంగా ఉంచాలని సూచించారు. పేషంట్లకు మందులు అందించేటప్పుడు ఎక్స్పైరీ డేట్ చెక్ చేయాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రిలో నిర్వహిస్తున్న రిజిష్టర్లను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్, ఇమ్యునైజేషన్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి కోసం అవసరమైన నిధులను సమకూర్చుతామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

## మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ను ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గోషామహల్ లో రామ్ మనోహర్ లోహియా మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ప్రారంభించారు. 3.92 కోట్ల రూపాయల జీహెచ్ఎంసీ నిధులతో రెండు దశల్లో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మించారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే రాజాసింగ్ ,ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్ గార్లు ,ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు

## బడుగు యాదగిరి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 10** చౌటుప్పల్ పట్టణంలో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు బడుగు యాదగిరి ఇటీవల మరణించడం పట్ల ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ బడుగుల యాదగిరి నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించి వారి





కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ బడుగు యాదగిరి సమాజ సేవలో అంకితభావంతో పనిచేసి పద్మశాలి మహాజన సంఘం అభివృద్ధికి విశేష కృషి చేశారని ఆయన మరణం సమాజానికి తీరనిలోటని వారి సేవలు ఎల్లప్పుడు చిరస్మరణీయమని వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఈ క్లిష్ట సమయంలో తాను వ్యక్తిగతంగా మరియు పార్టీ తరఫున అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు పద్మశాలి మహాజన సంఘం సభ్యులు కార్యకర్తలు అభిమానులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## జ్యోతిరావు పూలే: భారత్ కు నేటికీ దారి చూపే ధృవతార!

### ప్రధానమంత్రి నరేంద్ర మోదీ



ఏప్రిల్ 11 నేడు. మనందరికీ చాలా ప్రత్యేకమైన రోజు. భారతదేశపు అగ్రశ్రేణి సంఘ సంస్కర్తల్లో ఒకరు, తరతరాలకూ మార్గదర్శిగా నిలిచిన క్రాంతిపథగామి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నేడు. ఆయన ద్విశతాబ్ది జయంత్యుత్సవాల ప్రారంభం నేపథ్యంలో, ఈ ఏడాది మరింత విశిష్టతను సంతరించుకున్నది.

మహాత్మాపూలే గొప్ప సంఘసంస్కర్త. అంతేకాదు.. నైతిక స్థైర్యం, నిరంతర సత్యాన్వేషణ, సామాజిక శ్రేయస్సు పట్ల అచంచలమైన అంకితభావం కలబోసిన ఉదాత్త జీవితం ఆయనది. ఎన్నో సంస్థలను నెలకొల్పి, ఎన్నో ఉద్యమాలకు సారథ్యం వహించి చిరస్మరణీయులయ్యారు పూలే. ఆయన రేకెత్తించిన సరికొత్త ఆశలు, దేశజనుల్లో నింపిన ఆత్మవిశ్వాసం, మన నాగరికతా పరిణామ క్రమంలో ఆయన చేసిన అసమానమైన సేవలూ... నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిని అందిస్తున్నాయి.

## మా వనరులు మేము ఉపయోగించుకుంటాం.

## రుసుం ఎందుక కట్టాలి



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఏప్రిల్ 10 04 2026**ఐటీడీఏ ఇంచార్జ్ పీవో కలెక్టర్ గారికి వినతి పత్రం సమర్పిస్తూ నూతనంగా ఇందిరమ్మ ఇండ్లు కానీ. ఇతర ఇండ్లకు మా వాగులో మేము రుసుం కట్టుకోవడం అంటే "తలాపున సముద్రం పెట్టుకొని కొంగ నీళ్లకు ఏడ్చినట్టుగా" ఉందని కోట్లాది క్యూబిక్ మీటర్లు.లక్షలాది టన్నుల ఇసుక మా గోదావరి నుండి తరలించుకుపోయేదె కాక ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి సొంతింటి కల నెరవేర్చేది పోయి నానా కష్టాలు పడి కూలి పని చేసుకుని పైసా పైసా పోగేసు కొని వడ్డీలు తెచ్చుకొని ఇల్లు నిర్మించు కొంటుంటే "ములిగె నక్కపై తాటిపండు పడ్డట్టు"ప్రభుత్వం ప్రజాపాలన అంటూ మరొకవైపు ప్రజలపై ఈ వడ్డింపులు ఏంటని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండి దావూద్ దుయ్య పట్టారు.

గత ప్రభుత్వంలో కూడా ఇదేవిధంగా డీడీలు తీయాలి అని మొండి కేస్తే ధర్నాలు చేసి అధికారులతో చర్చిస్తే డిడి విధానం నిలిపివేశారని అదేవిధంగా ఈ పద్ధతి ఎందుకు పెడుతున్నారంటే కొంతమంది దొంగలు ట్రాక్టర్లతో డంపు చేసి లారీల్లో లోడ్ చేసి దొంగ రవాణా చేస్తున్నారని చెప్తున్నారని అలాంటి దొంగల్ని పట్టుకోలేక పోతే కొంతమంది ప్రజలు సమాచారం ఇచ్చిన కొంతమంది అధికారులు నిమ్మకు నేరెత్తినట్లు వ్యవహరిస్తూ చూసి చూడనట్టు. విని విననట్లు నటించి ఇలాంటి దొంగలపై చర్యలు తీసుకోలే దంటే అందులో వారికి కూడా వాటా ఉందేమో అని అనుమానించాల్సిన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే మా వనరులు మేము మా మండల ప్రజలు ఉపయోగించుకునేలా అవకాశం కల్పించి ఆదుకోవాలని లేదంటే పోరాటాలు చేయాల్సిన పరిస్థితి వస్తుందని అధికారులకు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిఎల్ రవి. తోలెం కృష్ణయ్య. వడకాపురం సారయ్య. ఎస్కే పత్తి మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## పరిచయం ఉన్నవాడే రేప్ చేశాడు

గుంటూరు, ఏప్రిల్ 10 పల్నాడు జిల్లా మాచర్లలో ప్రభుత్వ ఉద్యోగినిపై జరిగిన అత్యాచారం కేసులో ఊహించని మలుపు చోటుచేసుకుంది. గుర్తుతెలియని వ్యక్తి తనపై దాడి చేశాడని బాధితురాలు తొలుత ఫిర్యాదు చేయగా, పోలీసుల దర్యాప్తులో అసలు నిజం బయటపడింది. నిందితుడు ఆమెకు స్నాప్‌చాట్ ద్వారా పరిచయమైన ప్రియుడేనని తేలింది. వివరాల్లోకి వెళితే.. మాచర్లలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా పనిచేస్తున్న మహిళ, ఈ నెల 2న తనపై అత్యాచారం జరిగిందని పోలీసులను ఆశ్రయించింది. నీళ్లు తాగే నెపంతో ఇంట్లోకి వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి ఈ దారుణానికి పాల్పడ్డాడని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసిన పోలీసులు, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ, బాధితురాలి ఫోన్ చాటింగ్ వివరాలను పరిశీలించగా, అసలు విషయం వెలుగులోకి వచ్చింది. గతంలో ఇద్దరితో వివాహమై విడాకులు తీసుకున్న బాధితురాలు ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో ఆమెకు రాజుపాలెం మండలానికి చెందిన నామాల శ్రీనివాస్‌తో స్నాప్‌చాట్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఘటన జరిగిన రోజు బాధితురాలే గూగుల్ మ్యాప్స్ లొకేషన్ పంపి శ్రీనివాస్‌ను ఇంటికి పిలిచింది. ఇంటికి వచ్చిన శ్రీనివాస్ ఆమెపై బలవంతానికి ప్రయత్నించగా, ఆమె ప్రతిఘటించింది. దీంతో ఆగ్రహానికి లోనైన నిందితుడు ఆమెను వివస్త్రను చేసి కాళ్లు, చేతులు కట్టేసి అత్యాచారం చేసి పారిపోయాడు. పరిచయస్తుడే ఈ దారుణానికి పాల్పడ్డాడనే విషయాన్ని దాచిపెట్టి, పోలీసులను తప్పుదోవ పట్టించిందని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. సాంకేతిక ఆధారాలతో నిందితుడు శ్రీనివాస్‌ను గుర్తించిన పోలీసులు, ఈ నెల 8న మాచర్ల రైల్వే స్టేషన్ వద్ద అతడిని అరెస్ట్ చేశారు. గురువారం కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతడికి 14 రోజుల రిమాండ్ విధించింది.

# దక్షిణ తెలంగాణ కు కేంద్ర బిందువు మహబూబ్ నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సూపర్ స్పెషాలిటీ రిఫరల్ ఆసుపత్రిగా అభివృద్ధి : రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహా

### ప్రజా పాలన ప్రగతి పాలన ఆరోగ్య అవగాహన వారోత్సవాల లో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో స్వచ్ఛంద మెగా రక్త దాన శిబిరంను ప్రారంభించిన మంత్రి

### పాత పాలమూరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో మహిళా స్వయం సంఘాల సభ్యుల కోసం హెల్త్ స్క్రీనింగ్ పైలెట్ ప్రాజెక్ట్ ను ప్రారంభించిన మంత్రి

మహబబ్ నగర్ ఏప్రిల్ 10;మహబూబ్‌నగర్‌లో మెడికల్ సేవలు, విద్యా ప్రమాణాల పెంపుపై ప్రభుత్వ దృష్టి సారించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం లో వైద్య ఆరోగ్య శాఖ ఈ నెల 6 నుంచి 11 వరకు నిర్వహిస్తున్న ఆరోగ్య అవగాహన వారోత్సవాల లో

భాగంగా మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న స్వచ్ఛంద మెగా రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయుష్, హోమియోపతి, యునాని వైద్య శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాల్స్ ను ఆయన సందర్శించారు.

అనంతరం మెడికల్ కాలేజీ,నర్సింగ్ కాలేజీ విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను, మెడికల్ కాలేజీలో,నర్సింగ్ కాలేజీ లో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా కావలసిన మౌలిక సౌకర్యాల కల్పన,సమస్యలు గురించి వారి నుండి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజ నర్సింహా మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాను దక్షిణ తెలంగాణ వైద్య రంగానికి కేంద్రంగా సూపర్ స్పెషాలిటీ సేవలతో రిఫరల్ ఆసుపత్రి గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. మెడికల్ కాలేజ్‌లో సీట్ల పెంపు, పీజీ కోర్సుల విస్తరణ, విద్యార్థులకు వేర్వేరు హాస్టల్ సదుపాయాలు, ఆడిటోరియం నిర్మాణం వంటి అంశాలను ప్రాధాన్యతగా తీసుకుంటున్నట్లు వెల్లడించారు. కొత్త టీచింగ్ హాస్పిటల్ భవనం పనులు త్వరలో పూర్తిచేసి, జూన్ నెలలో ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే, టీచింగ్ హాస్పిటల్ ప్రారంభంతో పాటు హాస్టల్స్ భవనం మరియు ఆడిటోరియం నిర్మాణానికి త్వరలో శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. మెడికల్ కాలేజ్ మరియు ఆసుపత్రికి అవసరమైన అదనపు మౌలిక సదుపాయాలను ప్రభుత్వం పూర్తిగా సమకూర్చుతుందని స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్‌ను సూపర్ స్పెషాలిటీ మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దక్షిణ తెలంగాణలోని నారాయణపేట్, వనపర్తి, గద్వాల, నాగర్ కర్నూల్ జిల్లాలకు మహబూబ్‌నగర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ రిఫరల్ సెంటర్‌గా పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పార.ఇందులో భాగంగా ఎంఆర్ఐ వంటి ఆధునిక వైద్య సదుపాయవైద్ధియేటర్లుగా అందుబాటులోకి తీసుకురావడం,సర్జరీలకు రోబోటిక్స్ వైద్ధియేట, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్ ఆర్గన్ ట్రాన్స్‌ప్లాంట్ రిట్రీవల్ సెంటర్, వాస్క్యులర్ యాక్సెస్ సెంటర్ వంటి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని తెలిపారు. అలాగే, మెడికల్ కాలేజ్‌లో ప్రస్తుతం ఉన్న 21 విభాగాలకు అదనంగా మరో 14 డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసి, హైదరాబాద్ లోని ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు ధీటుగా అభివృద్ధి చేస్తామని అన్నారు. ముఖ్యంగా సర్జికల్ విభాగాలను బలోపేతం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. టీచింగ్ ఫ్యాకల్టీ కొరతను తీర్చేందుకు భారీగా నియామకాలు చేపడుతున్నామని, 607 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియ చేపట్టినట్లు ఇప్పటికే 172 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల నియామక ఉత్తర్వులు ఇచ్చామని తెలిపారు. ప్రొఫెసర్ ఖాళీలను ప్రమోషన్ ద్వారా భర్తీ చేస్తామని తెలిపారు.

2232 నర్స్ లను రాష్ట్రం లో కొత్తగా నియామకం చేస్తున్నట్లు తెలిపారు.

అలాగే జిల్లాలో ఉన్న 100 నుండి 150 పడకల సెకండరీ ఆసుపత్రులను కూడా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని తెలిపారు. ప్రతి 30 నుండి 35 కిలోమీటర్ల పరిధిలో థర్డ్ లెవెల్ ట్రామా కేర్ సెంటర్లను, ప్రతి 25 కిలోమీటర్ల పరిధిలో ఒక డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు.

సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, విద్యార్థులకు మెరుగైన మెడికల్ ఎడ్యుకేషన్ అందించడంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. తర్వాత ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో పోస్ట్ ఆపరేటివ్ వార్డ్ ను సందర్శించి రోగులతో మాట్లాడి వైద్య సేవలు,చికిత్స గురించి తెలుసుకున్నారు.



## తిరుమలగిరి గ్రంధాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్.. నేటి తరానికి జ్ఞానాన్ని సమకూర్చేందుకు గ్రంథాలయాల ఆవశ్యకత ఎంతైనా ఉందని కంటోన్మెంట్ శాసనసభ్యులు శ్రీ గణేష్ అన్నారు.తిరుమలగిరి లాల్ బజార్ లో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. కోటి యాభై లక్షల రూపాయల నిధులతో గ్రంథాలయాన్ని నిర్మించి విద్యార్థులకు యువతకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ గ్రంథాలయం మూలంగా వచ్చే సమాచార సేకరణ, విషయ పరిజ్ఞానం యువతకు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బోయిన్ పల్లి, బొల్లారంలో సైతం గ్రంథాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. గ్రంథాలయంలో అన్ని రకాల వసతులు కల్పించామని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రంథాలయంలో తన సొంత నిధులతో అధ్యాపకులను మార్గదర్శకులుగా నియమించి కంటోన్మెంట్ యువతకు భావితరాలకు గొప్ప భవిష్యత్తును అందించేందుకు ప్రణాళిక చేస్తున్నట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం నోటిఫికేషన్లు జారీ చేసి కోర్టులలో కేసులు వేసి నిరుద్యోగులను మోసం చేసిందని ప్రజాపాలన ప్రభుత్వం ఇప్పటికే వేల సంఖ్యలో ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులకు అండగా నిలిచిందని పేర్కొన్నారు.

## 16, 17 తేదీల్లో ఈవీఎంలు చెకింగ్

ముంబై, ఏప్రిల్ 10 దేశ ఎన్నికల చరిత్రలో తొలిసారిగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీ, పరిశీలించేందుకు బాంబే హైకోర్టు అనుమతి ఇచ్చింది. జస్టిస్ సోమశేఖర్ సుందరేశన్ ఈవీఎంల పరిశీలనకు ఆదేశాలను జారీ చేశారు. ఈ కేసులో పిటిషనర్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మహారాష్ట్ర మాజీ మంత్రి నసీమ్ ఖాన్. ప్రతివాదిగా శివసేన ఎమ్మెల్యే దిలీప్ లాండే ఉన్నారు.2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ముంబై శివారు జిల్లాలోని చాందీవలి నుంచి దిలీప్ లాండే (ఏకనాథ్ షిండే వర్గం శివసేన) మాజీ మంత్రి నసీమ్ ఖాన్‌పై విజయం సాధించారు. ఈ ఎన్నికల అనంతరం లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈవీఎంల ట్యాంపరింగ్, ఓట్ల చోరీపై ఆరోపణలు చేశారు. బాంబే హైకోర్టులో జరిగిన విచారణలో భారత ఎన్నికల కమిషన్ తరపున లాయర్లు నైరా జేజీభాయ్, అరుణ్ పనిక్కర్, తన్మయ్ పవార్, వినయ్ నాయర్, ఆయుష్ యాదవ్ హాజరయ్యారు.ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణలు చేసిన పిటిషనర్ తరపున ఓటింగ్ మేషిన్ల తనిఖీకి బాంబే హైకోర్టు అనుమతి ఇచ్చింది. భారత ఎన్నికల కమిషన్ 2 నెలల లోపు యంత్రాల పరిశీలనను పూర్తి చేయాలని కోర్టు ఆదేశాల్లో పేర్కొంది. భారత ఎన్నికల చరిత్రలో ఇప్పటివరకు ఎన్నికల తర్వాత అభ్యర్థులు, అధికారుల సమక్షంలో ఈవీఎంల తనిఖీ జరగలేదని.. ఇదే తొలిసారి అని నసీమ్ ఖాన్ పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును ఆయన చారిత్రాత్మక ఆదేశం, ప్రజాస్వామ్యంలో అవసరమైన న్యాయపరమైన జోక్యంగా అభివర్ణించారు.ఏప్రిల్ 16, 17 తేదీల్లో ముంబైలో ఈవీఎం తయారీ సంస్థ భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెంగళూరు) ద్వారా కేవలం డయాగ్నోస్టిక్ చెకింగ్ మాత్రమే నిర్వహించనున్నారని ముంబై సబర్బన్ జిల్లా డిప్యూటీ రిటర్నింగ్ ఆఫీసర్ అర్చన కదం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ తన అభ్యర్థులను తమ తమ నియోజకవర్గాల్లో ఈవీఎం, వీవీప్యాట్ (ఎఖయి - ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రైల్) యూనిట్ల పరిశీలించేందుకు డిమాండ్ చేయాలని కోరింది. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా (ఎ.ఔ.ఆ.ఎ.ం) కూటమికి చెందిన సుమారు రెండు డజన్ల మంది అభ్యర్థులు ఈవీఎంల విశ్వసనీయతపై ఆందోళన వ్యక్తం చేశారు.సుప్రీంకోర్టు ఏప్రిల్ 2024 నాటి తీర్పును ఉటంకిస్తూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలోని 5 శాతం ఈవీఎంల (కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్) "బర్న్ మెమరీ/ మైక్రోకంట్రోలర్"ను ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ఈవీఎం తయారీ కంపెనీల ఇంజనీర్ల టీమ్ చెక్ చేయాలని నసీమ్ ఖాన్ అన్నారు.

## ముగ్గురి ప్రాణాలు తీసిన సెల్ఫీ

ఏలూరు, ఏప్రిల్ 10 సెల్ఫీలు, ఫొటోలు తీసుకునే సరదా ముగ్గురు యువతుల ప్రాణాలను బలిగొంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గురువారం చోటుచేసుకున్న ఈ ఘోర విషాద ఘటన స్థానికంగా తీవ్ర ఆవేదనకు గురిచేసింది. పండుగ సెలవులు కావడంతో సరదాగా గడిపేందుకు జలపాతం వద్దకు వెళ్లిన బాలికలు, విగతజీవులుగా మారడంతో వారి కుటుంబాల్లో తీరని శోకం మిగిలింది. హుకుంపేట మండలం బుర్జ పంచాయతీ పరిధిలోని జంబవలస గ్రామానికి చెందిన ఐదుగురు యువతులు, పండుగ సెలవుల సందర్భంగా సమీపంలోని ముల్లుంగుమ్మి జలపాతాన్ని చూసేందుకు వెళ్లారు. అక్కడ ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఫొటోలు, సెల్ఫీ వీడియోలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో త్రిష (17), రత్న కుమారి (16), పవిత్ర (16) అనే ముగ్గురు యువతులు జలపాతం మధ్యలో ఉన్న ఓ పెద్ద బండరాయిపైకి ఎక్కారు. అక్కడ ఫొటోలు తీసుకుంటుండగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటి ప్రవాహంలో పడిపోయారు.వారిని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి కాపాడేందుకు ప్రయత్నించారు. అయితే, నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో వారు కొట్టుకుపోయారు. కొంత సమయం తర్వాత వారి మృతదేహాలను నీటిలో నుంచి వెలికితీశారు. ఈ ఘటనలో మిగిలిన ఇద్దరు అమ్మాయిలు సురక్షితంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందమైన పిక్నిక్ ప్రదేశాలు, సుందరమైన జలపాతాలకు అల్లూరి జిల్లా ప్రసిద్ధి. అయితే, ఇక్కడ తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నా, పర్యాటకులు వాటిని పెడచెవిన పెట్టి ప్రమాదకరమైన ప్రదేశాల్లోకి వెళ్లి ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పోలీసులు చెబుతున్నారు. ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్రధాన పర్యాటక ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు పెంచి భద్రతా చర్యలను కట్టుదిట్టం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## హైదరాబాద్‌లో 75 శాతం రౌడీషీటర్లకు డ్రగ్స్ పాజిటివ్

హైదరాబాద్, ఏప్రిల్ 10 తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో రెగ్యూలర్ గా హైదరాబాద్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు తనిఖీలు జరుగుతున్నాయి.

హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల నిర్మూలన లక్ష్యంగా పోలీసులు ఒక భారీ ఆపరేషన్ చేపట్టారు. సిటీ వ్యాప్తంగా ఉన్న రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచిన పోలీసులు, వారిలో డ్రగ్స్ అలవాట్లు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకునేందుకు ప్రత్యేకంగా డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీలు నగరంలోని నేరస్తులకు వణుకు పుట్టిస్తున్నాయి.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరం మొత్తం మీద సుమారు 1300 మంది రౌడీ షీటర్లను గుర్తించారు. వీరిలో ప్రాథమిక దశలో 250 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా,గ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. డ్రగ్స్ పరీక్షలు జరిపిన 250 మందిలో ఏకంగా 190 మందికి డ్రగ్స్ పాజిటివ్‌గా తేలడం కలకలం రేపుతోంది. అంటే దాదాపు 75 శాతం మంది రౌడీ షీటర్లు మత్తు పదార్థాలకు బానిసలయ్యారని స్పష్టమైంది.వీరిలో అత్యధిక శాతం మంది గంజాయికి అలవాటు పడినట్లు పోలీసులు గుర్తించారు. రౌడీ షీటర్లు మత్తులో ఉండి తీవ్రమైన నేరాలకు పాల్పడే అవకాశం ఉండటంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. వీరికి గంజాయి ఎక్కడి నుండి సరఫరా అవుతోంది? దీని వెనుక ఉన్న ప్రధాన నెట్‌వర్క్ ఏమిటి? వీరు డ్రగ్స్, గంజాయి ఎక్కడెక్కడ విక్రయిస్తున్నారు అనే కోణంలో పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టారు.

## ప్రియురాలికి హెచ్ఐవీ రక్తం ఘటనలో విషాదం.. అవమానం, బాధతో యువతి ఆత్మహత్య

హైదరాబాద్, ఏప్రిల్ 10 హైదరాబాద్‌లో ఇటీవల ఓ యువకుడు తన ప్రియురాలికి హెచ్ఐవీ ఇంజెక్షన్ ఇచ్చిన ఘటనలో విషాదం చోటుచేసుకుంది. పెళ్లికి నిరాకరించిందనే కోపంతో ఓ యువకుడు యువతికి బలవంతంగా హెచ్ఐవీ సోకిన రక్తాన్ని ఎక్కించగా, ఆ మనస్తాపంతో బాధిత యువతి తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిన్ననాటి నుంచి ప్రేమించిన వ్యక్తే తన జీవితాన్ని ఇలా నాశనం చేశాడన్న బాధతో ఆమె ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఘటన జరిగింది.జనగామ జిల్లాకు చెందిన యువకుడు హైదరాబాద్‌లో ట్రాన్స్‌పోర్ట్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతడి తల్లిదండ్రులిద్దరికీ హెచ్ఐవీ పాజిటివ్ ఉండగా, తండ్రి గతంలోనే మరణించాడు. సమీప బంధువైన యువతిని అతడు ప్రేమించగా, పెద్దలు కూడా పెళ్లికి అంగీకరించారు. అయితే, వివాహానికి ముందు యువతి తండ్రి జరిపించిన రక్త పరీక్షల్లో యువకుడికి కూడా హెచ్ఐవీ ఉన్నట్లు తేలింది. దీంతో యువతి కుటుంబ సభ్యులు ఈ పెళ్లిని రద్దు చేసుకున్నారు. కుమార్తె జీవితాన్ని తెలిసి నాశనం చేయలేమని, యువకుడి కుటుంబానికి వారు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.వివాహం రద్దవడాన్ని జీర్ణించుకోలేకపోయిన నిందితుడు, తాను ప్రేమించిన యువతికి కూడా హెచ్ఐవీ సోకితే మరెవరూ పెళ్లి చేసుకోరని, అప్పుడు కచ్చితంగా తననే చేసుకుంటుందని వికృతంగా ఆలోచించాడు. మార్చి నెల 11న తన రక్తాన్ని సిరంజీలోకి తీసుకుని, యువతి ఇంటికి వెళ్లి ఆమె నిరాకరించడంతో బలవంతంగా ఆ రక్తాన్ని ఎక్కించి పారిపోయాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ప్రాణాంతక వ్యాధి సోకిందన్న ఆందోళన, సమాజంలో ఎదురయ్యే అవమానం తట్టుకోలేక ఆ యువతి ప్రాణాలు తీసుకోవడం అందర్నీ కలచివేస్తోంది. తన తప్పు లేకున్నా, ఆమె చనిపోయిందని తెలియడంతో స్థానికంగా విషాదం నెలకొంది.ఈ ఘటనలో ఆ యువకుడు దారుణమైన తప్పిదం చేశాడు. ప్రేమించిన యువతి హాయిగా ఉండాలని ఆలోచించలేదు. తన కుటుంబంతో పాటు తనకు హెచ్ఐవీ ఉందని గమనించి సైలెంట్ గా ఉండలేదు. అదే కారణంతో తనను రిజెక్ట్ చేయడం, పెళ్లి రద్దు కావడంతో ఆమెను ఎలాగైనా దక్కించుకోవాలని ప్రమాదకర హెచ్ఐవీ రక్తాన్ని ఆమెకు బలవంతంగా ఇంజెక్ట్ చేశాడు. అలా చేస్తే ఆమె నిజంగానే అతడ్ని పెళ్లి చేసుకుంటుందా? నేరస్తుడిగా జైలుకు వెళ్తానని మాత్రం ఆలోచించలేకపోయాడు. ఆ అవమాన భారంతోనో, లేక భయంతోనే యువతి ఏదైనా తీసుకోకూడదని నిర్ణయం తీసుకుంటే పరిస్థితి ఏంటని కూడా థింక్ చేయలేదు. అతడి వికృత నిర్ణయం ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ఆ తల్లిదండ్రులకు కన్నీళ్లే మిగిల్చింది. పెళ్లి చేసి అత్తింటికి పంపాలని భావించిన తల్లిదండ్రులు కూతుర్ని శ్మశానానికి సాగనంపి, ఆమెకు తుది వీడ్కోలు పలకాల్సి రావడం కంటే నరకం ఇంకేమైనా ఉంటుందా అని స్థానికులు, నెటిజన్లు అంటున్నారు. తనకు దక్కనిది ఎవరు దక్కకూడదని భావించే వాళ్లు, దక్కించుకునేందుకు ఏదైనా పిచ్చి పనులు చేస్తే వారికి కఠిన శిక్షలు వేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## మే నెల్లో టెన్త్ పరీక్షల ఫలితాలు

విజయవాడ, ఏప్రిల్ 10 పదో తరగతి మూల్యాంకనంలో మార్కుల నమోదుకు ఆటోమేషన్ పేరిట ఈ ఏడాది ట్యాబ్ లను వినియోగించాలని విద్యాశాఖ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టింది. ఇందుకోసం రూ.50 లక్షలతో ఇంటర్నెట్ సదుపాయం కల్పించారు. అయితే పదో తరగతి స్పాట్ వాల్యుయేషన్‌లో ఉపాధ్యాయులకు ట్యాబ్‌లు చుక్కలు చూపిస్తున్నాయి. సోమవారం మధ్యాహ్నం మొదలైన టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ ట్యాబ్‌లు మొరాయించడంతో రాత్రి 10 గంటల వరకు సాగింది. సాంకేతిక లోపం, నెట్ వర్క్ పనిచేయకపోవడం, సర్వర్ డౌన్, ట్యాబ్‌లు సజావుగా పనిచేయకపోవడం వంటి సాంకేతిక కారణాలతో మార్కుల నమోదులో తీవ్ర జాప్యం నెలకొంది.సోమవారం ఒక్కో ఉపాధ్యాయుడు కేవలం 20 జవాబు పత్రాలే మూల్యాంకనం చేశారు. అనంతరం వాటిని స్కాన్ చేసి, ట్యాబ్‌లో నమోదు చేసేందుకు యత్నిస్తే సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. రాత్రి 10 గంటల వరకు కుస్తీపడిన టీచర్లు సోమవారం మిగిలిన మార్కుల నమోదు ప్రక్రియను మంగళవారం మధ్యాహ్నానికి పూర్తి చేశారు. విధుల్లో పాల్గొనే టీచర్లు ఒక్కొక్కరు కనీసం 40 జవాబు పత్రాలు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ప్రతి జవాబు పత్రాన్ని స్కానింగ్ చేసి, మార్కులు నమోదు చేయాలి. అసిస్టెంట్ ఎగ్జామినర్లు పేపర్లు మూల్యాంకనం చేసిన అనంతరం మార్కులను ట్యాబ్‌ల ప్రక్రియకు ప్రత్యేకంగా కేటాయించిన స్పెషల్ అసిస్టెంట్లు మాత్రమే నమోదు చేయాలి. దీంతో మరో స్పెషల్ అసిస్టెంట్ చేయాలని ప్రయత్నించినా, అందుకు సాఫ్ట్‌వేర్ అనుమతించదు. వాల్యుయేషన్ సెంటర్లలో అందుబాటులో ఉంచిన ట్యాబ్‌లు, ఇంటర్నెట్ పనిచేయడం లేదని టీచర్లు తలలు పట్టుకుంటున్నారు. దీంతో ఉదయం 9 గంటలకు ప్రారంభమైన మూల్యాంకనం సాయంత్రం 4 గంటలకల్లా పూర్తవ్వాలి. కానీ సాంకేతిక సమస్యలతో అర్ధరాత్రి 11 గంటలు దాటినా మార్కుల నమోదు పూర్తికావడం లేదు. దీంతో ఉపాధ్యాయులు దిద్దిన జవాబు పత్రాలను తిరిగి స్ట్రాంగ్ రూములకు తరలిస్తున్నారు.కాగా రాష్ట్రంలో పదో తరగతి పరీక్షలు మార్చి 16 నుంచి ఈ నెల 2వ తేదీ వరకు జరిగాయి. దాదాపు 6.20 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. సోమవారం నుంచి ప్రారంభమైన జవాబు పత్రాల మూల్యాంకనం పది రోజుల్లోపు అంటే ఏప్రిల్ 16లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మూల్యాంకనం విధులకు దాదాపు 20 వేల మందిని ఆటోమేషన్ ద్వారా నియమించారు. అయితే విద్యాశాఖ నుంచి చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్ విధులు కేటాయించినా కొందరు ఎగ్జామినర్లు డుమ్మాకొడుతున్నారు. దీంతో టీచర్ల కొరత ఏర్పడి మూల్యాంకనం ప్రక్రియ విద్యాశాఖ అధికారులకు గుదిబండగా మారింది. స్పాట్‌లో టీచర్ల కొరత తీవ్రతరం కావడం విద్యాశాఖ స్పందించింది. స్పాట్ విధులకు హాజరుకాని టీచర్లపై సస్పెన్షన్ వేటు తప్పదని అధికారులు హెచ్చరించారు. స్పాట్ సెంటర్‌లలో ఏర్పడిన సాంకేతిక సమస్యను టెలికం అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇవన్నీ పదో తరగతి ఫలితాలపై తీవ్ర ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. తొలుత ఏప్రిల్ 4వ వారంలో ఫలితాలు వెల్లడించాలని భావించినప్పటికీ మే మొదటి వారంలో పదో తరగతి ఫలితాలు విడుదల చేసే అవకాశం ఉంది.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com